గురువారం 9 ఏప్రిల్ 2026
https://www.telugudesam.org



# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు






## మావిగన్ అంటే ఇదేనా?

మంత్రి నారా లోకేష్ కౌంటర్

- వివరాలు 6 లో..

# ప్రజా ప్రభుత్వం వరాలు



- 2016కు ముందు పట్టా పొందిన ఇళ్లకు రిజిస్ట్రేషన్
- 75 లక్షల పేద కుటుంబాలకు ప్రయోజనం
- మార్చి నాటికి 1.12 కోట్ల పట్టాదారు పాస్‌పుస్తకాలు
- 1.37 లక్షల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ నుంచి తొలగిస్తూ నిర్ణయం
- ఇతర సర్వీస్‌లోని మరో లక్ష ఎకరాలకూ విముక్తి
- కొత్తగా చట్టం తీసుకురావాలని సీఎం ఆదేశం
- 2016కు ముందు పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్
- రెవెన్యూ సమీక్షలో సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు
- ప్రతీ రెవెన్యూ రికార్డును డిజిటలైజ్ చేయాలని ఆదేశం
- భూ వివాదాల పరిష్కారానికి వేగంగా అడుగులు

3

రెవెన్యూ శాఖ సమీక్షలో ముఖ్యమం త్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2016కు మందు ఏదైనా ప్రభుత్వ హౌసింగ్ స్కీంలో పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించాలని ఆదేశించారు. ఈ నిర్ణయం దాదాపు 75 లక్షల పేద కుటుంబాలకు వరంగా మార నుంది. 2027 మార్చి నాటికి రీ సర్వే 2.0 పూర్తి చేసి 1.12 కోట్ల కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆదేశించారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22 ఏ నుంచి తొలగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఇతర సర్వీస్ ఇనాంలోని మరో లక్ష ఎకరాల భూములకూ విముక్తి కల్పించ నున్నారు. దీని కోసం కొత్తగా చట్టం తీసుకురావాలని ఆదేశించారు.




## 3.0

- ఏడాది పొడవునా నిరంతరం శిక్షణ తరగతులు
- పైరవీలతో పనిలేదు..పదవులకు పనితీరే ప్రామాణికం
- జూన్ తర్వాత అందరూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లాల్సిందే
- ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి
- మహానాడు ప్రిపరేషన్ వర్క్ ప్రారంభమైంది
- విజయవంతానికి ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలి
- నిలకడలేని జగన్‌ను సీరియస్‌గా తీసుకోవాల్సిన పనిలేదు
- క్యాడర్‌తో మంత్రి నారా లోకేష్ కాఫీ కబుర్లు

5

*పార్టీకి కార్యకర్తే అధినేత.. గ్రామస్థాయి నాయకుడు పొలిట్ బ్యూరోకు ఎదగాలి..పార్టీ క్యాడర్‌కు సభ్యత్వ నెంబర్ ఆధార్ కార్డు లాంటిది. ఆ నెంబర్ ఎంటర్ చేస్తే ఎవరు ఎంత పనిచేశారో తెలిసిపోతుంది. పైరవీలతో పనిలేకుండా పనిచేసే కార్యకర్తలను గుర్తించి పదవులిస్తాం. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన తామంతా కింద కూర్చున్నాం. బాబు గారి పక్కన సామాన్య కార్యకర్తలు కూర్చున్నారు..పార్టీలో వస్తున్న అనూహ్య మార్పులకు ఇదొక సంకే తమని లోకేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం క్యాడర్ శిక్షణా తరగతు ల్లో భాగంగా ప్రసంగించారు. ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. జూన్ తర్వాత అందరూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని పిలుపునిచ్చారు.*

## అమరావతి నిర్మాణ ప్రగతి భేష్

- మీ విజన్‌తోనే అంతర్జాతీయ పెట్టుబడులు
- రాష్ట్రానికి అమరావతి ఒక గ్రోత్ ఇంజిన్
- ప్రపంచ బ్యాంక్ బృందం ప్రశంసల వర్షం
- సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ


- వివరాలు 4 లో..

## ఈస్ట్-వెస్ట్ కారిడార్‌గా రహదారుల నిర్మాణం

- ❑ దేశంలో వివిధ ప్రాంతాలతోపాటు పోర్టులను వాటితో అనుసంధానించాలి
- ❑ ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా కనెక్టివిటీ
- ❑ ఈ ఏడాది చివరికల్లా ప్రాజెక్టులు పూర్తి కావాలి
- ❑ పుష్కరాల్లోపే రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి
- ❑ ఈవీ బస్సులు పెంచి రవాణా వ్యయం తగ్గించాలి
- ❑ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం
- ❑ రాష్ట్ర, జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సమీక్ష



2



నేడు వేమూరు నియోజకవర్గంలో

## చంద్రబాబు పర్యటన

- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం
- రైతులకు పట్టాదారు పుస్తకాల పంపిణీ

- వివరాలు 4 లో..

## యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- ప్రతి ఇంటి నుంచి ఒకరు తయారుకావాలి
- ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్‌కు పెద్దపీట
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

- వివరాలు 10 లో..



## ఆత్మీయ పలకరింపు.. భరోసా

- 87వ రోజు ప్రజాసేవలో లోకేష్
- ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ
- సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

6

## అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్

- రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్
- రూ.2,534 కోట్లతో భారీ నిర్మాణాలు
- వచ్చే క్యాబినెట్‌లో క్లియరెన్స్ వచ్చే అవకాశం

2



## కార్యకర్తే పార్టీకి రక్ష

- ❑ కష్టపడ్డ వారికి గుర్తింపు తెలుగుదేశం సిద్ధాంతం
- ❑ మీ పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణం
- ❑ 'మై టీడీపీ యాప్' టాప్ పెర్ఫార్మర్స్‌కు లోకేష్ కితాబు
- ❑ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం
- ❑ ఉత్తమ కార్యకర్తలకు ఘనంగా సత్కారం



4

చైతన్యరథం

# ఈస్ట్-వెస్ట్ కారిడార్‌గా రహదారుల నిర్మాణం





- దేశంలో వివిధ ప్రాంతాలతో పాటు పోర్టులను వాటితో అనుసంధానించాలి
- ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా కనెక్టివిటీ
- ఈ ఏడాది చివరికల్లా ప్రాజెక్టులు పూర్తి కావాలి
- పుష్కరాల్లోపే రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలి
- ఈవీ బస్సులు పెంచి రవాణా వ్యయం తగ్గించాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం
- రాష్ట్ర, జాతీయ రహదారుల ప్రాజెక్టులపై సమీక్ష

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం జరగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారులు రాష్ట్రంలోని పోర్టులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలను కనెక్ట్ చేసేలా నిర్మాణం చేపట్టాలని సూచించారు. సచివాలయంలో బుధవారం రహదారులు భవనాలు, రవాణా, జాతీయ రహదారి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగం,వివిధ రాష్ట్రాలను అనుసంధా నించేలా జాతీయరహదారి ప్రాజెక్టుల నిర్మాణంపై సమీక్షలో చర్చించారు. "రాష్ట్రంలో రహదారుల నిర్వహణ పటిష్టంగా ఉండాలి. మొత్తంగా 45,433 కిలోమీటర్ల మేర రోడ్లు ఉంటే వాటిల్లో ఏటా 10,238కిలోమీటర్ల మేర నిరం తర నిర్వహణ చేయాల్సి ఉంది. ప్రజలకు రోడ్ల వల్ల ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించారు. రోడ్ల నిర్వహణ అనేది నిరంతరప్రక్రియగా చేపట్టాలి.. ఎక్కడైనా రోడ్లకు గుంతలు పడితే.. వాటినే వెంటనే సరిదిద్దితే ఇక ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు.

## రోడ్ల నిర్వహణపై అధ్యయం చేయాలి

రోడ్ల నిర్వహణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎలాంటి పద్ధతులను అవలంబిస్తున్నారనే అంశాన్ని అధ్యయనం చేయాలి. ఆర్ అండ్ బీ రహదారుల మెయింటెనెన్స్ కోసం నిధుల కొరత లేకుండా చూడాలి. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా రహదారుల నిర్మాణం జరగాలని సూచించారు. రహదారి నిర్వహణకు ప్రామాణికతను నిర్దేశించాలి. స్థానికంగా భౌగోళిక పరిస్థితులు, వాతావరణం అంశాలను పరిగణనలోకి తీసుకుని రోడ్ల నిర్వహణలో చర్యలు చేపట్టాలి.ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, బ్లాక్ కాటన్ సాయిల్ ఉన్న చోట హైబ్రీడ్ మోడల్‌లో బీటీ లేదా వైట్ ట్యాప్ రోడ్ల నిర్మాణం చేపడితే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కాలువలు ఉన్న 570 కిలోమీటర్ల మేర రహదారులు పదే పదే ధ్వంసం అవుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో ఏ మెటీరియల్‌తో రోడ్ల నిర్మాణం జరిగితే బాగుంటుందనేది ఆలోచన చేయాలి. దీనిపై యూనివర్శిటీల్లో అధ్యయనం చేయిస్తే కొత్త ఆవిష్కరణలు వస్తాయి. గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టండి. గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో మొత్తంగా 471 గ్రామాల్లో రోడ్లను మరమ్మతులు చేపట్టాలి. గ్రేటర్ రాజమహేంద్రవరం పరిధి లో చేపట్టే రోడ్ల అభివృద్ధి అనేది అన్ని ప్రాంతాలకు రోల్ మోడల్ గా నిలిచేలా పనులు చేపట్టాలి. పుష్కరాలకు ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.400 కోట్లతో 531 కిలోమీటర్ల పొడవైన రహదారులను అభివృద్ధి చేయాలి. దీని కోసం సాస్కి నిధులను వినియోగించుకోవాలి. కుంభమేళా తరహాలో పుష్కరాల కు నిధులు ఇవ్వాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాయాలని' అని సీఎం సూచించారు.

## పోర్టుల అనుసంధానానికి ప్రాధాన్యం

"రాష్ట్రంలోని పోర్టులను కనెక్ట్ చేసేలా జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలి. ఆర్థిక లావాదేవీలకు కేంద్రంగా పోర్టులు ఉన్నాయి. పోర్టులను కనెక్ట్ చేసేలా పశ్చిమ భారతంలో గుజరాత్ మోడల్ అలానే ఉంది. తూర్పు భారతంలో తీర ప్రాంతం, పోర్టుల విషయంలో ఏపీ కీలకంగా ఉంది. ఈస్ట్-వెస్ట్ కారిడార్‌గా జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి. ఈ రకమైన కనెక్టివిటీని పెంచడం ద్వారా లాజిస్టిక్స్ వ్యయం గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలి. లాజిస్టిక్స్ రంగాన్ని రాష్ట్రంలో అభివృద్ధి చేసేలా పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టాలి. దీని నిమిత్తం ఏపీ లింక్ ద్వారా ఆర్థిక వనరులు సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. మౌలిక సదుపాయాల ద్వారా సామాన్యుడికి సౌకర్యాలు పెరగాలి. ఇదే సమయంలో ఆర్థిక లావాదేవీలు జరగాలి. ప్రభు త్వం ప్రజాధనాన్ని అభివృద్ధి కోసం ఖర్చుచేస్తోంది. ప్రతి పైసా సద్విని యోగం కావాలి..అత్యుత్తమ ఫలితాలు రావాలని సూచించారు.

## రహదారుల కార్గో వ్యయం తగ్గాలి

ప్రస్తుతం 73శాతం కార్గో రోడ్ రవాణా ద్వారానే వెళుతోంది. రైల్వే ద్వారావెళ్లే కార్గో వ్యయం తక్కువగా ఉన్నట్టే రహదారుల కార్గో వ్యయం కూడా తగ్గాల్సిన అవసరం ఉంది. మూలపేట, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టుల మధ్యనున్న ప్రాంతాలను అనుసంధానిస్తూ జాతీయ రహదారుల నిర్మాణం జరగాలి.ఆయా పోర్టులను అనుసంధానం చేసే సమయంలో ఆయా పోర్టులకు సమీపంలోని పొరుగు రాష్ట్రాల సరిహద్దులను కలుపుకుని వెళ్లేలా ప్రధాన రహదారులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఉండాలి. రహదారుల నిర్మాణం వల్ల ఆర్థిక కార్యకలాపాలు పెరగాలి. జాతీయ రహదారులకు సమీపంలో ఉండే ప్రాంతాల అభివృద్ధి జరగాలి. జాతీయ రహదారులతోపాటు దేశ నిర్మాణం జరగాలి. ఏపీ పారిశ్రామిక,ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా మారుతోంది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లకు కనెక్టుచేసేలా రహదారులు రావాలని సూచించారు.

## రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలి

వివిధ నగరాలకు రింగ్ రోడ్లు వస్తే ఆయా ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు విస్తృ తం అవుతాయి. పొరుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రధాన నగరాలను ఏపీని కనెక్టు చేసేలా రహదారుల నిర్మాణం జరగాలి. ఖరగ్ పూర్- అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబా ద్-శ్రీశైలం డోర్నాల హైవే, కల్వకుర్తి-నంద్యాల హైవే వంటి జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే కనెక్టివిటీ మరింత పెరుగుతుంది. వివిధ కారిడా ర్ల ద్వారా 1335 కిలోమీటర్ల జాతీయ రహదారులు రెండేళ్లలో అందుబాటులోకి వస్తాయి. ఈ ఏడాదిలో రూ.24,502 కోట్ల విలువైన ప్రాజెక్టులు పూర్తి కావాలి. రాజమండ్రి, కాకినాడ, తిరుపతి, కర్నూలు, నెల్లూరు ప్రాంతాల్లో అవుటర్ కారిడార్ మోడల్స్‌ను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు.

## ఈవీలతో తక్కువ రవాణా వ్యయం

అతి తక్కువ వ్యయంతో ప్రజారవాణా అందుబాటులోకి రావాలి. దీనికి ఈవీ బస్సుల వినియోగం సరైన మార్గం. క్లీన్ ఫ్యూయెల్ వినియోగం ఎక్కువ జరిగితే ఖర్చు తగ్గుతుంది. ఫలితాలు ప్రజలకు అందుతాయి. సోలార్ పవర్‌ను సమర్థంగా నిర్వహించడం ద్వారా విద్యుత్ కొనుగోలు ధరను సుమారు రూ.1 మేర తగ్గించగలిగాం. కాస్ట్ ఆప్టిమైజేషన్ ఆఫ్ ఫ్యూయల్ విధానంపై దృష్టి సారిస్తే తక్కువ ఖర్చు.. ఎక్కువ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ఈవీ బస్సులకు కిలోమీటరుకు రూ.72 వ్యయం అవుతోంది. వివిధ మోడళ్లను అధ్యయనం చేసి అతి తక్కువ వ్యయంతో ఈవీలను ఆపరేట్ చేయాలి. ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీ స్టాండర్డైజేషన్ లాంటి అంశాలను పరిశీలించాలి. అన్నీ కేటగిరీల్లోనూ ఏసీ ఈవీ బస్సులే ఉండాలి. ఈ సైకిళ్ల వినియోగం మరింతగా పెంచేలా ప్రమోట్ చేయాలి. ఈ-సైకిళ్లు మాస్ ట్రాన్ పోర్టుగా మారేంతగా ప్రజలకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈసమీక్షా సమావేశానికి మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం, జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్

- రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్
- రూ.2,534 కోట్లతో భారీ నిర్మాణాలు
- వచ్చే క్యాబినెట్‌లో క్లియరెన్స్ వచ్చే అవకాశం

న్యూఢిల్లీ/అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రూ.2,534 కోట్లతో అమరావతిలో కేంద్రం భారీ నిర్మాణాలను చేపట్టనుంది. అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. అమరావతిలో కామన్ సెంట్రల్ సెక్రటేరియట్(సీసీఎస్) నిర్మాణం కోసం రూ.1,299.08కోట్లు, నివాస సముదాయాల(జీపీఆర్ఏ) ఏర్పాటు కోసం రూ.1,234.91 కోట్లతో కూడిన పీఐబీ మెమోరాండం సిద్ధమైంది. ఈ ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగాలంటే క్యాబినెట్ సెక్రటేరియట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫైల్‌కు క్లియరెన్స్ రావాల్సి ఉంది. అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ వెలువడిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఏపీ అధికారులు ఇప్పటికే క్యాబినెట్‌సెక్రటేరియట్‌కు సమర్పించారు. వచ్చే కేంద్రక్యాబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు అనుమతి లభించే అవకాశం ఉంది. ప్రాజెక్టు తదుపరి అనుమతులకు కీలకమైన క్యాబినెట్ సెక్రటేరియట్ క్లియరెన్స్ మాత్రమే పెండింగ్ ఉంది. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన ఫైల్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆమోదం తెలిపారు.

అమరావతిలో కేంద్ర నిర్మాణాల కోసం మొత్తం 22.53 ఎకరాల భూమిని కేటాయించారు. సీపీడబ్ల్యూడీ కోసం 22.53 ఎకరాల భూమిని ఏపీ ప్రభుత్వం ఆఫర్ చేసింది. ఇందులో 5.53 ఎకరాలు సెక్రటేరియట్ నిర్మాణానికి, 17 ఎకరాలు నివాస సముదాయాల (జీపీఆర్ఏ) ఏర్పాటుకు కేటాయించారు. క్యాబినెట్ సెక్రటేరియట్ నుంచి క్లియరెన్స్ వచ్చిన వెంటనే అమరావతిలో కేంద్ర



ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులు మరింత వేగవంతమయ్యే అవకాశం ఉంది.

# మార్చి నాటికి 1.12 కోట్ల పట్టాదారు పాస్‌పుస్తకాలు

- 1.37 లక్షల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ నుంచి తొలగిస్తూ నిర్ణయం
- ఇతర సర్వీస్‌లోని మరో లక్ష ఎకరాలకూ విముక్తి
- కొత్తగా చట్టం తీసుకురావాలని సీఎం ఆదేశం
- 2016కు ముందు పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్
- 75 లక్షల పేద కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం వరాలు
- రెవెన్యూ సమీక్షలో సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు
- ప్రతీ రెవెన్యూ రికార్డును డిజిటలైజ్ చేయాలని ఆదేశం
- భూ వివాదాల పరిష్కారానికి వేగంగా అడుగులు



అమరావతి(చైతన్యరథం): రెవెన్యూ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2027 మార్చి నాటికి రీ సర్వే 2.0 పూర్తి చేసి 1.12కోట్ల కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం రీ సర్వే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా భూ వివాదాలు సృష్టించింది. వీటిని పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టిన ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రీ సర్వే 2.0లో భాగంగా ఇప్పటికి 6,976 గ్రామాల్లో సర్వే పూర్తి కాగా...వీటితో 5,717 గ్రామాల్లో 22.79 లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరుగుతోంది. సర్వే పూర్తయిన మిగిలిన 1,259 గ్రామాలకు సంబంధించి 9 లక్షల పాసు పుస్తకాలను ఈ ఏడాది జూలై నాటికి పంపిణీచేయాలని సీఎం స్పష్టంచేశారు. అలాగే వచ్చే ఏడాది మార్చి నాటికి రీ సర్వేతోపాటు... పాసు పుస్తకాల పంపిణీ 100శాతం పూర్తి కావాలని ఆదేశించారు. దీని కోసం నెలవారీ లక్ష్యాలను సిద్ధం చేసుకుని కార్యాచరణ అమలు చేయాలన్నారు. జూలై తరువాత మార్చి లోపు 80లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరగాలని తేల్చి చెప్పారు. తప్పులకు ఆస్కారం లేకుండా పాసు పుస్తకాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన రెవెన్యూ శాఖ సమీక్షలో లక్షల కుటుంబాలకు లబ్ది చేకూర్చేలా ముఖ్యమంత్రి ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 1.37లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22 ఏ నుంచి తొలగిస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఇతర సర్వీస్ ఇనాంలోని మరో లక్ష ఎకరాల భూములకూ విముక్తి కల్పించనున్నారు. దీని కోసం కొత్తగా చట్టం తీసుకురావాలని ఆదేశించారు. 2019లో సర్వీస్ ఇనాం భూములకు సంబంధించి నాడు ఆర్డినెన్స్ జారీ చేసినప్పటికీ... తరువాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆర్డినెన్స్ మరుగున పడింది. దురుద్దేశంతో గత ప్రభుత్వం దీనిని చట్టంగా మార్చకుండా లక్షల కుటుంబాలకు నష్టం చేకూర్చింది. అయితే ప్రజా ప్రభుత్వం వీరికిన్యాయంచేసేందుకు, సాయంగా నిలిచేందుకు దీనిపై చట్టం చేయాలని నిర్ణయించింది.

### ఇంటి పట్టా ఉంటే.. రిజిస్ట్రేషన్

2016కు మందు ఏదైనా ప్రభుత్వ హౌసింగ్ స్కీంలో పట్టా పొందిన ప్రతి ఇంటికీ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం దాదాపు 75లక్షల పేద కుటుంబాలకు వరంగా మారనుంది. 2016ముందు పట్టా కలిగిన యజమాని నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు, విక్రయించేందుకు, గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ నిర్ణయం లక్షలాది పేదల కుటుంబాలకు ఆస్తిగా మారుతుంది. అలాగే రాష్ట్రంలో ఫ్రీ హోల్డ్ కింద 13.59లక్షల ఎకరాల భూమి ఉండగా.. ఇందులో అర్హత కలిగిన 9.25 లక్షల ఎకరాలపై భూ యజమానులకు త్వరలో పూర్తిగా యాజమాన్యహక్కులు కల్పించనున్నారు. రాష్ట్రంలోని ప్రతీ రెవెన్యూ రికార్డును డిజిటలైజ్ చేయాలని, భూ యజమానికి మొబైల్‌కి సాఫ్ట్ కాపీ పంపించాలని ఆదేశించారు. ఈ కేవైసీ అనంతరం రికార్డులను బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రపర్చాలని సూచించారు. భూ యజమానులు ఆధార్, ఈ కేవైసీ ఇచ్చి రికార్డ్ లాకింగ్ చేసుకోవచ్చు. దీని కారణంగా ఆయన నాలెడ్జ్‌లో లేకుండా రిజిస్ట్రేషన్ సాధ్యం కాదు. ప్రజల భూములకు రికార్డ్ లాకింగ్ రక్షణ కవచంగా ఉంటుంది. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, మంత్రి అనగాని సత్య ప్రసాద్, సీసీఎల్ఏ జయలక్ష్మితోపాటు ఇతర అధికారులు హాజరయ్యారు.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీలో ఏపీ టాప్

## బాలికల ఆరోగ్య భద్రతలో చంద్రబాబు విజన్ - దేశానికే ఆదర్శంగా కూటమి ప్రభుత్వం

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం ఒక ప్రభుత్వ సామర్థ్యాన్ని అంచనా వేయించే ముఖ్యమైన ప్రమాణం. ముఖ్యంగా బాలికల ఆరోగ్య భద్రత విషయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తు తరాల జీవితాలను ప్రభావితం చేస్తాయి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధిని ముందుగానే అరికట్టేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేస్తూ ఆంధ్రప్ర దేశ్‌లో కూటమి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు, ప్రణాళిక, నిర్వహణ సామర్థ్యం వల్లే ఈ కార్యక్రమం వేగంగా ముందుకు సాగుతోంది. ఆరోగ్య రంగంలో ముందస్తు సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ బాలి కల భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం క్రమబద్ధంగా పనిచేస్తోంది.



### ముందుచూపు నిర్ణయం-వేగంగా అమలు

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ మహిళల్లో అధికంగా కనిపించే ప్రమాదకర వ్యాధి. దీనిని ముందుగానే అరికట్టేందుకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అత్యంత కీలకం. ఈ విషయాన్ని గుర్తించిన చంద్రబాబు బాలికల ఆరోగ్యాన్ని రక్షించేందుకు స్పష్టమైన లక్ష్యంతో కార్యక్రమా న్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం రెండు విడతల్లో రాష్ట్రానికి మొత్తం 3,81,780 హెచ్‌పీవీ వ్యాక్సిన్ డోసులు అందించగా, వాటిని వేగంగా ప్రజలకు చేరవేయడంలో రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతంగా పనిచేస్తోంది. 3.45 లక్షల మంది 14-15 ఏళ్ల బాలికలకు టీకా ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న ప్రభుత్వం ఇప్పటివరకు 1,14,512 మందికి టీకా అందించింది. అంటే లక్ష్యంలో 33.19 శాతం ఇప్పటికే పూర్తి కావడం ఆరోగ్య రంగం లో ఉన్న వేగాన్ని స్పష్టంగా చూపిస్తోంది. జిల్లాల స్థాయిలో కూడా మంచి స్పందన కనిపిస్తోంది. కర్నూలు 6,785, నెల్లూరు 6,726, వైఎస్సార్ జిల్లా 6,725, అనంతపురం 6,655 టీకాలతో ముందంజలో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,645 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో టీకా అందుబాటులో ఉండటం, కోల్డ్ చైన్ సౌకర్యం కల్పించడం, టీకా తర్వాత 30 నిమిషాల పర్యవేక్షణ చేయడం వంటి చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతు న్నాయి. ఇప్పటివరకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ నమోదు కాకపోవడం ఈ కార్యక్రమం సమర్ధతను తెలియజేస్తోంది.

### గణాంకాల్లో కనిపిస్తున్న పాలన మార్పు

గత ప్రభుత్వంలో ఆరోగ్య రంగంలో ముందస్తు సంరక్షణ కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో వేగంగా అమలు కాలేదు. ముఖ్యంగా క్యాన్సర్ నివారణ వంటి కీలక కార్యక్రమాల్లో సమగ్ర ప్రణాళిక లోపించడం వల్ల రాష్ట్రం వెనుకబడి ఉండేది. కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిస్థితి మారింది. కేంద్రంతో సమన్వయం పెంచి వ్యాక్సిన్ డోసులను వేగంగా తెప్పించడం, జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్ణయించడం, వైద్య సిబ్బందిని చురుకుగా పనిచేయించడం వంటి చర్యల వల్ల కార్యక్రమం వేగంగా సాగుతోంది. వైసీపీ హయాంలో ప్రకటనలకే పరిమితమైన ఆరోగ్య కార్యక్రమాలు ఇప్పుడు గణాంకాలతో ముందుకు సాగుతున్నాయి. 3.81 లక్షల డోసులు, 3.45 లక్షల లక్ష్యం, 1.14 లక్షల పంపిణీ, 1,645 కేంద్రాలు వంటి లెక్కలు ప్రభుత్వ పనితీరును స్పష్టంగా చూపిస్తున్నాయి. ఇది కేవలం పరి పాలనా మార్పు మాత్రమే కాదు, ఆరోగ్య రంగంలో వచ్చిన దిశా మార్పు.

### రూ.150 కోట్ల ఆరోగ్య భద్రత - దేశానికి ఆదర్శంగా ఏపీ

హెచ్‌పీవీ వ్యాక్సిన్ కార్యక్రమం కేవలం టీకా పంపిణీ మాత్రమే కాదు, భవిష్యత్తు తరాలను రక్షించే ఆరోగ్య భద్రత కార్యక్రమం. సుమారు రూ.150 కోట్ల విలువైన వ్యాక్సిన్లను ఉచితంగా అందిం చడం ద్వారా ప్రభుత్వం బాలికల ఆరోగ్యంపై తన బాధ్యతను స్పష్టంగా చూపిస్తోంది. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే ముందే నివారించడం మంచిదనే దృక్పథంతో చంద్రబాబు గారు ఆరోగ్య రంగాన్ని ముందుకు తీసుకెళుతున్నారు. 108 సేవ లబలోపేతం, వైద్య మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు చేరువైన వైద్యసేవలు వంటి చర్యలు కూడా అదే దిశలో సాగుతున్నాయి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి బాలికలను రక్షించడం అంటే ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని, ఒక భవిష్యత్తును కాపా డటమే. ఆ బాధ్యతను కూటమి ప్రభుత్వం సమర్ధంగా నిర్వర్తిస్తోం ది. బాలికల ఆరోగ్య భద్రతే రాష్ట్ర భవిష్యత్తు అనే దృక్పథంతో సాగుతున్న ఈ కార్యక్రమం నిజంగా దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది.

- శాంతి జలసూత్రం, అనలిస్ట్
టీడీపీ నాలెడ్జ్ సెంటర్

# అమరావతి నిర్మాణ ప్రగతి భేష్



- మీ విజన్‌తోనే అంతర్జాతీయ పెట్టుబడులు
- రాష్ట్రానికి అమరావతి ఒక గ్రోత్ ఇంజిన్
- ప్రపంచ బ్యాంక్ బృందం ప్రశంసల వర్షం
- సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ
- రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు: సీఎం వెల్లడి

అమరావతి(చైతన్యరథం): ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో బుధవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. అమరావతి నిర్మాణ ప్రగతిని ప్రతినిధి బృందం ప్రశంసించింది. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న మౌలిక సదుపాయాలు, ఐటీ-విద్యుత్ రంగ సంస్కరణల వల్ల ఈ నగరం భారీగా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షి స్తుందని ప్రపంచ బ్యాంకు బృందం అభిప్రాయపడింది. రాష్ట్రానికి అమరావతి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుందని వెల్లడించింది. మౌలిక సదుపాయాల అభివృద్ధితో వాణిజ్య కార్యకలాపాలకు అమరావతి కేంద్రంగా మారుతుందని ఆశిస్తున్నట్టు బృంద ప్రతినిధులు ముఖ్యమంత్రితో చెప్పారు. ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేపట్టడంతోపాటు.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి దిశగా తాము పనిచేస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రపంచ బ్యాంక్ బృందానికి సీఎం చంద్రబాబు వివరించారు. మూడు రీజియన్లుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్టు ముఖ్యమంత్రి చెప్పారు.

# కార్యకర్తే పార్టీకి రక్ష



- కష్టపడ్డ వారికి గుర్తింపు తెలుగుదేశం సిద్ధాంతం
- మీ పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణం
- 'మై టీడీపీ యాప్' టాప్ పెర్ఫార్మర్స్‌కు లోకేష్ కితాబు
- పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం
- ఉత్తమ కార్యకర్తలకు ఘనంగా సత్కారం

మంగళగిరి(చైతన్యరథం): కష్టపడిన వారిని గుర్తించాలనేది పార్టీ సిద్ధాంతమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 'మై టీడీపీ యాప్' సమర్ధ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్న టాప్ 10 పెర్ఫార్మర్స్‌తో మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ ఆత్మీయ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరినీ ఆప్యా యంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అనేది ఒక వ్యవస్థ. మనం అందరం ఆ వ్యవస్థలో భాగం. మీ పనితీరు వల్లే ఇక్కడ వరకు రాగలిగారు. రేపు పార్టీ అధినేత చంద్రబాబు పక్కన కూర్చొనే అవకాశం వస్తుంది.

పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుంది. వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమని గుర్తించాలి. పార్టీలో సంస్కరణల కోసం నేను పోరాడుతున్నా.. కార్యకర్తే అధినేత. గ్రామ పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పొలిట్‌బ్యూరో వరకు రాగలగాలి. ఎన్నికల్లో విజయం సాధించాలంటే పార్టీ సిద్ధాంతాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ దిశానిర్దేశం చేశారు. మనం కోరుకున్న మార్పు సాధ్యం కావాలంటే అందరం కలిసికట్టుగా పనిచేయాలి. పార్టీ భవిష్యత్ దృష్ట్యా కడప మహానాడులో తీర్మానించిన 6 శాసనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. పార్టీ సిద్ధాంతాలను వివరించేందుకు 365 రోజులూ శిక్షణ తరగతులు నిర్వహిస్తాం.

2019-24 మధ్య జగన్‌రెడ్డి ఎమ్మెల్యేలనే కలవలేదు. మనం కార్యకర్తలను కలుస్తున్నాం. నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశం అవుతున్నాం. వారానికోరోజు పార్టీ కార్యాలయానికి వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నాం. పార్టీ కోసం ప్రాణాలర్పిం చిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కోసం చట్ట సవరణ చేశాం. మీరందరూ క్షేత్రస్థాయిలో ఉండి పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం అందరినీ ఘనంగా సత్కరించి ఎన్టీఆర్ జ్ఞాపికను బహూకరించారు. పార్టీ కార్యాలయంలో లోకేష్‌తో ఆత్మీయ భేటీపై 'మై టీడీపీ యాప్' ఉత్తమ కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు. ఈ భేటీని తాము జీవితాంతం మర్చిపోలేమని ఆనందం వ్యక్తం చేశారు.



నేడు వేమూరు నియోజకవర్గంలో

## ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన

- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం
- రైతులకు పట్టాదారు పుస్తకాల పంపిణీ
- అనంతరం టీడీపీ శ్రేణులతో సమీక్ష

అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. 'మీ భూమి-మీ హక్కు'కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తారు. పర్యటనలో భాగంగా గురువారం ఉదయం 10.50 గంటలకు భట్టిప్రోలు మండలం, సూరేపల్లికి చేరుకుంటారు. 11.00 గంటలకు సూరేపల్లిలో నిర్వహించే ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 01.35 గంటలకు వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడతారు. 02.10 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 04.05గంటలకు అమరావతి చేరుకుంటారు.గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే తప్పుల తడకగా ఉండటంతో కూటమి ప్రభుత్వం ఆ తప్పులను సరిచేస్తోంది. గత ముఖ్యమంత్రి పొలం హద్దుల కోసం పాతే రాళ్లపైనా, రైతులకు ఇచ్చే పట్టాదారు పుస్తకాలపై తన ఫొటోలను ముద్రించుకున్నారు. వీటన్నింటినీ కూటమి ప్రభుత్వం ప్రక్షాళన చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 16,816 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటికే 6,976 గ్రామాల్లో సర్వే పూర్తయింది. ఈ ఏడాది చివరి నాటికి రీ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించుకుంది. దీంతో పాటు ఈ ఏడాది ప్రారంభం నుంచి ప్రభుత్వం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను రాజముద్రతో అందిస్తోంది. జనవరి నెలలో 4,783 గ్రామాల్లో 18.77 లక్షల పాస్ పుస్తకాలు, ఫిబ్రవరిలో 279 గ్రామాల్లో 1,16,129 పాస్ పుస్తకాలు, మార్చిలో 299 గ్రామాల్లో 1,29,298 పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందించింది. జనవరి నుంచి 5,717 గ్రామాల్లో 22.79 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాలను రైతులకు ప్రభుత్వం అందించింది. మార్చి 2027 నాటికి 7,518 సిగ్నల్ గ్రామాల్లో 47,02,000 పాస్ పుస్తకాలు, ఏప్రిల్ 2027 కల్లా 2,438 నాన్ సిగ్నల్ గ్రామాల్లోని 15,02,000 పాస్ పుస్తకాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మొత్తంగా 9,956 గ్రామాల్లో 62, 04,000 పాస్‌బుక్స్ కొత్తవి ఇవ్వాల్సి ఉంది. బాపట్ల జిల్లాలోని 8 మండలాల్లో 3,658 పాస్ పుస్తకాలు, వేమూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని 1,795 పాస్ పుస్తకాలను గురువారం పంపిణీ చేయనున్నారు. అంతేకాదు రైతులకు తెలియకుండా ఇక భూ రికార్డులు మార్పిడి చేయలేని విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బ్లాక్ చైన్ టెక్నాలజీని అమల్లోకి తెస్తోంది. ఈ విధానం ద్వారా రికార్డులు ట్యాంపర్ చేయాలన్నా, తారుమారు చేయాలన్నా అసాధ్యం.

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాధవ్ భేటీ

మత్స్యకారులు, హోంగార్డుల సమస్యలపై వినతి



అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం కలిశారు. మత్స్యకారులు, హోంగార్డుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. నెల్లూరు, ఒంగోలు, బాపట్ల తీర ప్రాంతాల్లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన మత్స్యకారులు అక్రమంగా ప్రవేశించి స్థానిక మత్స్యకారు లకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. స్పీడ్ బోట్లతో వచ్చి మత్స్యసంపదను దోచుకోవడం, స్థానిక మత్స్యకారుల వలలు, పడవలను ధ్వంసం చేయడం, దాడులకు పాల్పడటం వంటి అంశాలను దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిణామాలతో స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో ఇలాంటి బోట్లను స్థానికులు పట్టుకోగా తర్వాత వాటిని విడుదల చేయడాన్ని వివరించారు. ఈ సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించి అక్రమంగా ప్రవేశించే బోట్లపై కఠిన చర్యలు తీసుకుని తీరప్రాంత భద్రతను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర విభజన తరువాత సుమారు 400మంది హోంగార్డులు తమ స్వగ్రామాలకు దూరంగా పనిచేస్తుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య పరస్పర బదిలీలు చేపట్టాలని కోరారు.



# ఇది తెలుగుదేశం 3.0 వెర్షన్!

- ఏడాది పొడవునా నిరంతరం శిక్షణా తరగతులు
- పైరవీలతో పనిలేదు.. పదవులకు పనితీరే ప్రామాణికం
- జూన్ తర్వాత అందరూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లాల్సిందే
- ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి
- మహానాడు ప్రిపరేషన్ వర్క్ ప్రారంభమైంది
- విజయవంతానికి ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలి
- నిలకడలేని జగన్‌ను సీరియస్‌గా తీసుకోవాల్సిన పనిలేదు
- క్యాడర్‌తో మంత్రి నారా లోకేష్ కాఫీ కబుర్లు

అమరావతి(చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ గ్రామస్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకు సమూల మార్పులు తెస్తున్నాం.. ప్రతి టర్మ్‌లోనూ 33శాతం (3వ వంతు) కొత్తవారు ఉండాలన్నది తమ అభిమతం.. గ్రామస్థాయి నాయకుడు పొలిట్‌బ్యూరో వరకు చేరుకునే అవకాశం లభించాలి.. మారుతున్న కాలానికి అనుగుణంగా మన పంథా మారాలి.. అలాగైతేనే పదికాలాల పాటు ప్రజాక్షేత్రంలో నిలబడగలమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం క్యాడర్ శిక్షణా తరగతుల్లో భాగంగా కేంద్ర కార్యాలయంలో కాఫీకబుర్లు పేరుతో పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్‌తో సరికొత్త పంథాలో దూసుకుపోతోంది. పార్టీ క్యాడర్‌కు సభ్యత్వ నెంబర్ ఆధార్ కార్డు లాంటిది. ఆ నెంబర్ ఎంటర్ చేస్తే ఎవరు ఎంత పనిచేశారో తెలిసిపోతుంది. ఎలాంటి పైరవీలతో పనిలేకుండా పనిచేసే కార్యకర్తలను గుర్తించి పదవులిస్తాం. ఇటీవల పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తామంతా కింద కూర్చోగా, బాబు గారి పక్కన సామాన్య కార్యకర్తలు కూర్చున్నారు..పార్టీలో వస్తున్న అనూహ్య మార్పులకు ఇదొక సంకేతమని పేర్కొన్నారు.









## తెలుగుదేశం రాజకీయ విశ్వవిద్యాలయం

పార్టీని అట్టడుగుస్థాయి నుంచి బలోపేతం చేయడం, పనిచేసే కార్యకర్తలను ప్రోత్సహించి గుర్తించడమే శిక్షణా తరగతుల ప్రధాన లక్ష్యం. ఇకపై క్లస్టర్, యూనిట్, గ్రామ, మండలస్థాయి వరకు ఏడాది పొడవునా నిరంతరం శిక్షణా తరగతులు నిర్వహిస్తాం. తెలుగుదేశం పార్టీ రాజకీయ విశ్వవిద్యాలయం లాంటిది. తెలంగాణాలో ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రితో పాటు అక్కడి మెజారిటీ నాయకులు టీడీపీ నుంచి వచ్చిన వారే. 1989-94 నడుమ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న చంద్రబాబునాయుడు ట్రైనింగ్ క్లాసులు పెట్టి క్యాడర్‌ను చైతన్యవంతం చేశారు. అయితే పార్టీ ఆవిర్భావం తర్వాత అట్టడుగు స్థాయి నుంచి క్యాడర్‌కు పెద్దఎత్తున శిక్షణా తరగతులు నిర్వహించడం ఇదే ప్రథమమని తెలిపారు.

## నాయకులు కాదు.. పార్టీనే శాశ్వతం!

తెలుగుదేశం క్యాడర్ బేస్డ్ పార్టీ. పార్టీలో నేనే రాజు, నేనే మంత్రిని అనే అభిప్రాయాన్ని నాయకులు సరిచేసుకోవాలి. టీడీపీలో లోకేష్ లేదా మరో నాయకుడు శాశ్వతం కాదు. పార్టీ శాశ్వతం. సమర్థవంతమైన నాయకుడు తమ తర్వాత నాయకత్వాన్ని తయారుచేస్తాడు. గతంలో వ్యక్తులను నమ్మి పార్టీ నష్టపోయింది, ఇప్పుడు వ్యక్తులపై కాకుండా వ్యవస్థపైనే ఆధారపడ్డాం. 2014-19 నడుమ పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసి కూడా ఓటమి పాలయ్యాం. పార్టీ దీర్ఘకాలంగా అధికారంలో ఉండ టానికి బీజేపీని మనం ఆదర్శంగా తీసుకోవాలి. పార్టీ సిద్ధాంతా లను కమిట్‌మెంట్‌తో అమలు చేసే క్రమశిక్షణ గల క్యాడర్ ఉండ టమే వారి విజయ రహస్యం. మన మై టీడీపీ యాప్ మాదిరిగానే వారికి సరళ్ యాప్ ఉంది. గ్రామస్థాయి కార్యకర్త నుంచి కేంద్ర మంత్రి వరకు ఎవరికి అప్పగించిన బాధ్యతను వారు సమర్థవంతంగా నిర్వహించడమే వారి విజయ రహస్యమని వ్యాఖ్యానించారు.

## మహానాడును విజయవంతం చేద్దాం

1985 తర్వాత ఎన్నడూ గెలవని మంగళగిరిని ఎంచుకొని నేను తొలి ప్రయత్నంలో ఓడిపోయాను. ఐదేళ్ల పాటు పట్టుదలతో పనిచేసి గత ఎన్నికల్లో 91 వేల పైచిలుకు మెజారిటీతో గెలుపొందాను. భారీ మెజారిటీతో గెలిచినప్పటికీ.. నియోజకవర్గ పరిధిలోని 20 బూత్‌ల పరిధిలో మైనస్ వచ్చింది. దానిని కూడా అధి గమించేందుకు హోంవర్క్ చేస్తున్నా. కాన్ఫిడెన్స్ ఉంటేనే ఏదైనా సాధించగలం. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే అంతర్గత వేదికలపై చర్చించి పరిష్కరించుకోవాలి. అలిగి ఇంట్లో పడుకోవడం అంటే పార్టీకి అన్యాయం చేయడమే. పార్టీలో సంస్కరణల కోసం నేను చంద్రబాబుతో ఒక యుద్ధమే చేశాను. మన పార్టీ పెద్ద పండుగ మహానాడు ప్రిపరేషన్ వర్క్ ప్రారంభమైంది. విజయ వంతం కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపు నిచ్చారు.

## చంద్రబాబు నీడే మనకు శ్రీరామరక్ష

అరాచక పాలనలో ఐదేళ్లు ఇబ్బందులు పడ్డాం. దేవాలయాలపై దాడులు చేశారు, పార్టీ కార్యకర్తలను విచక్షణారహితంగా పొట్టనబెట్టుకున్నారు. దాదాపు 35 వేల తప్పుడు కేసులు బనాయిం చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ అధ్యయనం చేసి.. 60శాతం అక్రమ కేసులను తొలగించాం. మంచిరోజులు వచ్చాయి కదా అని కష్టకాలంలో పడిన ఇబ్బంది లను మరువద్దు. అధికారం ఉందని అహంకారం వద్దు. ఓర్పు, సహనంతో ముందుకు సాగుదాం. నమ్ముకున్న సిద్ధాంతం కోసం అహర్నిశలు కష్టపడదాం. చంద్రబాబు అనే మహావృక్షం నీడే మనకు శ్రీరామరక్ష. ఒంటెద్దు పోకడలతో వెళ్లే నాయకులకు పద్ధతి మార్చుకోవాల్సిందిగా మూడుసార్లు చెప్పి చూస్తాం. వినకపోతే 4వ సారి దండం పెట్టి కొత్త వారికి బాధ్యతలు అప్పగిస్తాం. పార్టీలో ఎవరి పోస్టులు శాశ్వతం కాదన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకుని మసలుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## జగన్‌ను సీరియస్‌గా తీసుకోవాల్సిన పనిలేదు

వైసీపీ అధినేత జగన్ మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకో వాల్సిన పనిలేదు. నిన్న మావిగన్ అన్న నోటితోనే మళ్లీ ఈరోజు మూడు రాజధానులు అంటున్నాడు. అధికారంలో ఉన్నప్పుడే కాకుండా ఇప్పుడు కూడా ఆయన ప్రజలకు దగ్గరగా ఉండటం లేదు. ఇంటి వద్ద 30 అడుగుల ఇనుప కంచె ఏర్పాటు చేసుకున్నాడు. 2019లో తెలుగుదేశం ఓటమి పాలయ్యాక చంద్రబాబు అనునిత్యం జనం లోనే ఉన్నారు..వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఏడాదిలోనే ఇసుక కష్టాలపై ఉద్యమించారు. కార్యకర్తల ఆవేదనను విన్నారు. వాటన్నింటినీ గుర్తుపెట్టుకుని క్యాడర్‌కు దగ్గరగా ఉంటూ ఆయన ముందుకు సాగుతున్నారు. క్యాడర్‌ను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. పార్టీలో పనిచేయడానికి పదవులే ప్రామాణికం కాదు, వివిధ సమీకరణాల వల్ల ఇప్పుడు అవకాశం రాని వారికి మరోసారి కల్పిస్తామని తెలిపారు.

## హనీమూన్ ముగిసింది.. జనంలోకి వెళదాం!

ప్రస్తుతం మనకు హనీమూన్ పీరియడ్ ముగిసింది. ప్రతిఒక్కరూ ప్రజాక్షేత్రంలోకి వెళ్లి పనిచేయాలి. జూన్ నుంచి ప్రభుత్వ విజయాలను ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యక్రమాన్ని రూపొందిస్తాం. కార్యక్రమాలను సమర్థవంతంగా జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత క్యాడర్‌దే. ప్రతి బూత్ కూడా మనకు చాలా కీలకం. 94 శాతం స్ట్రైక్ రేటుతో గెలిచినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా 4,600 బూత్‌లలో మనం వెనకబడ్డాం. వాటిపై నాయకులు దృష్టిసారించాలి. పార్టీ బలోపేతం కోసం అహర్నిశ లు కష్టపడదాం. గత మహానాడులో ఇచ్చిన ఆరు శాసనాలను అమలు చేద్దాం. కార్యకర్తే అధినేత అనే శాసనం ఇప్పటికే కార్య రూపం దాల్చింది. కూటమి మళ్లీ అధికారంలోకి వస్తేనే మనం అభివృద్ధిని కొనసాగించగలం. చంద్రబాబు బలంగా ఉంటేనే అంతా సంతోషంగా ఉంటారన్న సందేశాన్ని జనంలోకి తీసుకెళ్లా లని యువనేత పిలుపునిచ్చారు.






# ఆత్మీయ పలకరింపు.. భరోసా

- 87వ రోజు ప్రజాసేవలో లోకేష్
- ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ
- సమస్యల పరిష్కారానికి ఆదేశాలు







మంగళగిరి(చైతన్యరథం): మంత్రి లోకేష్ ప్రజాదర్బార్ నిరాటంకంగా కొనసాగుతోంది. కష్టాల్లో ఉన్న వారికి నేనున్నానంటూ ప్రజలకు భరోసా ఇస్తున్నారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో 87వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమస్యలపై పార్టీ కార్యాలయానికి తరలివచ్చిన సామాన్యు లు, పార్టీ కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై వారి నుంచి వినతులు స్వీకరించారు. సౌత్ కోస్ట్ రైల్వే ఏర్పాటు నేపథ్యంలో విజయవాడలోని లోకో పైలట్ల గాలా (సికింద్రాబాద్) డిపోను తరలించకుండా విజయవాడలోనే కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బంది లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. విజయవాడ బోర్డును కొండపల్లి నుంచి మోటమర్రికి పెంచడం వల్ల గత 17 ఏళ్లుగా విజయవాడలో ఉన్న సికింద్రాబాద్ (గాలా) డిపో ఉనికి సందిగ్ధంలో పడిందని, డిపోను మోటమర్రికి లేగా డోర్నకల్‌కు తరలిస్తారనే ప్రచారంతో సుమారు 500 కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయనే విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

### దినసరి ఉద్యోగుల క్రమబద్ధీకరణకు వినతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆల్ యూనివర్సిటీస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ దినసరి ఉద్యోగుల కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కొవిడ్ వల్ల నష్టపోయిన హైర్ బస్ యజమానుల బస్సులకు రీప్లేస్ మెంట్ కల్పించి ఆదుకోవాలని ఏపీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. నంద్యాలజిల్లా మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో తమకువంశపారంపర్యంగా సంక్రమించిన 2.63ఎకరాల భూమిని శిరిగిరి చంద్రమౌళీశ్వరరెడ్డి ఆక్రమించారని, విచారించి తగిన న్యాయం చేయాలని కర్నూలు జిల్లా గుండంపాడుకు చెందిన ఎస్.చిన్న శివమ్మ కలిసి కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని లోకేష్ హామీ ఇచ్చారు.













## ‘మావిగన్’ అంటే ఇదేనా?

**మంత్రి నారా లోకేష్ కౌంటర్**

అమరావతి(చైతన్యరథం): రాజధానిగా అమరావతికి చట్టబద్ధ త కల్పించిన నేపథ్యంలో వైసీపీ అధినేత జగన్‌రెడ్డి ప్రతిపాదించిన ‘మావిగన్’ పేరు, ఆ పార్టీ నేతల వ్యాఖ్యలకు మంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. జగన్ వైఖరిని ఎండగడుతూ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

రాజధాని అమరావతికి చట్టబద్ధత నేపథ్యంలో అటు అధికార పార్టీ నేతలు, ఏపీ ప్రజలు ఎంతో సంతోషంలో మునిగిపోతుంటే.. వైసీపీ అధినేత జగన్ మరోసారి తన ‘మావిగన్’ వ్యాఖ్యను సమర్థిం చుకున్నారు. తాడేపల్లిలో ఆ పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలోనే జగన్ వ్యాఖ్యలపై లోకేష్ సెటైర్లు వేశారు. మావిగన్ అంటే.. ‘మా’ అంటే మాయ అని, ‘వి’ అంటే విధ్వంసం అని, ‘గన్’ అంటే గందరగోళం, గన్ కల్చర్ ఇదేనా జగన్ మీ ప్లాన్ – బీ అంటూ ట్వీట్ చేశారు.



# సేంద్రియ వ్యవసాయమే భవిష్యత్

- రసాయనాల తగ్గింపు, ఆరోగ్యకరమైన భూమి, జీవన విధానం ముఖ్యం
- డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆలోచనాత్మకంగా ముందుకు సాగాలి
- మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా పంటల మార్పు అవసరం
- సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- మార్టేరు కిసాన్ మేళాలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



మార్టేరు (చైతన్యరథం): రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని స్థిరమైన అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గంలోని పెనుమంట్ర మండలం మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో బుధవారం నిర్వహించిన "కిసాన్ మేళా" మారుతున్న వాతావరణ పరిస్థితులు-సుస్థిర వరి వ్యవసాయం" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయన పరిశోధన కేంద్రంలోని ల్యాబ్‌లను పరిశీలించి శాస్త్రవేత్తలతో మాట్లాడి ఆధునిక వరి వంగడాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రైవేట్ కంపెనీలు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్స్‌ని పరిశీలించి వ్యవసాయ రంగంలో ఉపయోగించే ఆధునిక యంత్రాలను స్వయంగా నడిపారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో రైతులనుద్దేశించి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతులకు తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలు సాధ్యమవుతాయని, అదే సమయంలో భూమి సారాన్ని కాపాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చని తెలిపారు. ప్రస్తుతం రసాయన ఎరువులు, పురుగు మందుల అధిక వినియోగం వల్ల భూమి నాణ్యత దెబ్బతింటోందని, రైతుల ఖర్చులు పెరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చడానికి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అత్యవసరమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సేంద్రియ వ్యవసాయం వైపు మారేందుకు శిక్షణ, సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు అందిస్తోందన్నారు. రైతులు ఉత్పత్తి చేసిన సేంద్రియ పంటలకు మంచి ధర లభించేలా ప్రత్యేక మార్కెట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్‌తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణం అందించాలంటే సేంద్రియ వ్యవసాయాన్ని ప్రతి రైతు ఆచరించాల్సిన అవసరం ఉందని మంత్రి పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సేంద్రియ వ్యవసా యాన్ని విస్తృతంగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్తలను మంత్రి అభినందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నందున మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు చేయాలని రైతులకు సూచించారు. ఏ ప్రాంతంలో ఏ పంటలు అనుకూలమో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు గ్రామస్థాయిలోనే రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం ట్రాక్టర్లు, డ్రోన్లు, ఇతర వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందిస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలువల ఆధునికీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును పుష్కరాల కంటే ముందుగానే పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సన్మాన్ నిధి పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. రైతులు భూసార పరీక్షలపై తప్పక అవగాహన కలిగి ఉండాలన్నారు. సేంద్రియ ఉత్పత్తులు సాగు చేయడానికి ఆలోచన చేయాలన్నారు. దేశీయ వినియోగాల్ని పెంచాలని సూచించారు. రాష్ట్రంలో నదులు అనుసంధానం ద్వారా సాగునీటి కొరత లేకుండా సాధ్యపడుతుందన్నారు.

కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం అభివృద్ధి చేసిన వరి వంగడాలు దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసి 24 గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రబీ పంట కొనుగోలుకు 7.25 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించామని వెల్లడించారు.

సభాధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయ్యాయని, ఈ సందర్భంగా కిసాన్ మేళా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఈ కేంద్రం ద్వారా 70-75 రకాల నూతన వరి వంగడాలను అభివృద్ధి చేయాలన్నారు. తణుకు ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా నూతన పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి, హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ధనుంజయరావు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ ఆలపాటి సత్యనారాయణ, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ సహాయ సంచాలకుడు టి.శ్రీనివాస్, కోనసీమ, ఏలూరు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, పశ్చిమ గోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్ సామంతపూడి శ్రీరామరాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి జి. పిచ్చయ్య, పెనుమంట్ర తహసీల్దారు వై.రవికుమార్, మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ విభాగ అధికారులు, సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అప్పుడు వైసీపీ మహిళలంతా ఏమయ్యారు?

- నాడు అవమానిస్తుంటే ఎక్కడికి పోయారు
- వైసీపీ నేతలకు మాట్లాడే నైతిక హక్కు లేదు
- తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి



అమరావతి (చైతన్యరథం): మహిళల గౌరవం, భద్రత, ఆత్మ గౌరవం వంటి విలువల విషయంలో మాట్లాడే నైతిక హక్కు వైసీపీ కి లేదని రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి విమర్శించారు. మహిళల ను కవచంగా పెట్టుకుని రాజకీయ డ్రామాలు ఆడటం వైసీపీ నాయకుల నిత్యకృత్యంగా మారిందని మండిపడ్డారు. నిజంగా మహిళల పట్ల గౌరవం ఉంటే గతం లో జరిగిన అవమానాలపై ఎందుకు ఒక్క మాట కూడా మాట్లా డలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా మహిళల గౌరవాన్ని తుంచి పారేసినప్పుడు నవ్వులు చిందించిన వారే..ఇప్పుడు నకిలీ సెంటిమెంట్‌తో రోడ్లపైకి రావడం ప్రజలను మోసం చేసే చీప్ నాటకమని ఎద్దేవా చేశారు. భువనమ్మ, బ్రాహ్మణి, హోం మంత్రి అనిత, అమరావతి ఆడపడుచులను అవమానించినప్పుడు వైసీపీ మహిళా నాయకులు ఎక్కడికి వెళ్లారో చెప్పాలని నిలదీశారు. కన్నతల్లి గురించి అసభ్య వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో దారుణ మైన పోస్టులు వచ్చినప్పుడు మౌనం పాటించిన వారు..ఇప్పుడు చిన్న పదాన్ని కారణంగా చూపించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. అమరావతిని రాజధానిగా కేంద్ర ప్రభుత్వం గుర్తించగానే "జగన్‌కు మళ్లీ మావిగన్ గుర్తుకొచ్చింది" అంటూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు కొత్త డ్రామాలకు తెరలేపారు. ఏబీఎన్‌లో ఏదో వచ్చిందని ఆ కారణాన్ని అడ్డం పెట్టుకుని ప్రజల దృష్టిని మళ్లిం చేందుకు కావాలనే రచ్చ చేస్తున్నారు. ఇప్పుడు మహిళల పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. రాజధాని అమరావతి విషయంలో రాష్ట్ర ప్రజలు, దేశం మొత్తం మద్దతు తెలుపుతున్నప్పటికీ, తమ పార్టీ నేతకు నిజం చెప్పే ధైర్యం లేని నాయకులు, ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చి సవాళ్లు విసరడం పూర్తిగా సిగ్గుచేటన్నారు. వైసీపీ నాయకులు నాటకాలు మానుకోవాలని హితవుపలికారు.

## మచిలీపట్నాన్ని ఆదర్శ నియోజకవర్గంగా

# మార్చి చూపిస్తా: కొల్లు రవీంద్ర

**గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు తెలుసుకోవడమే లక్ష్యం - 34 పంచాయతీలు, 50 డివిజన్లలో పర్యటనకు శ్రీకారం**



మచిలీపట్నం (చైతన్యరథం): సంక్షేమం, అభివృద్ధిలో మచిలీపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తున్నానని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బందరు నియోజకవర్గంలోని 34 గ్రామ పంచాయతీలు, 50 డివిజన్లలో రోజూ పర్యటించేలా ప్రత్యేక కార్యక్రమానికి బుధవారం ఆయన శ్రీకారం చుట్టారు. తొలిరోజు పోతిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పొట్లపాలెం, పిల్లారిశెట్టిపాలెం, పోతిరెడ్డిపాలెం, శ్రీనివాస నగర్‌లలో పర్యటించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పిల్లలతో మమేకమై వారితో కాసేపు సరదాగా గడిపారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. నియోజకవర్గంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యల గురించి తెలుసుకున్నారు. సెంటు పట్టాలో ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బందిగా ఉందని చెప్పడంతో అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వ్యవసాయ కాలువల్లో పూడిక తొలగించాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని విన్నవించడంతో అధికారులతో మాట్లాడి తక్షణస్త్ర పరిష్కరించాలని సూచించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ... మచిలీపట్నం నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. గత ఐదు సంవత్సరాలు నియోజకవర్గంలో అభివృద్ధిని గాలికి వదిలేశారు. అందుకే క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేలా చిత్తశుద్ధితో పనిచేస్తోంది. గ్రామాలను పచ్చగా మార్చడం ద్వారా మాత్రమే అసలైన అభివృద్ధి సాధ్యమవుతుంది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. డ్రైనేజీలు, రోడ్ల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాం. డ్రైనేజీ సమస్య లేకుండా చూసుకుంటాం. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం కేటాయించి ఇళ్లు నిర్మించి అందిస్తాం. ఇంటింటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేస్తాం.' అన్నారు.

'రాష్ట్రానికి వచ్చే ఆదాయం మొత్తం జీతాలు, పెన్షన్లకే సరిపోతోంది. కేంద్రం నుంచి వచ్చే నిధులు వడ్డీలు చెల్లించేందుకు పోతోంది. వృద్ధాప్య పెన్షన్ల కోసం ఏటా రూ.32వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. తల్లికి వందనం పథకానికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఉచిత గ్యాస్ కోసం రూ.2,500 కోట్లు ఖర్చవుతోంది. ఉచిత బస్సు పథకం, అన్నదాత సుఖీభవ లాంటి అనేక పథకాలను పక్కా గా అమలు చేస్తున్నాం. జగన్ రెడ్డి రూ.3,000 పెన్షన్ హామీని ఏటా పెంపు పేరుతో దగా చేస్తే.. కూటమి అధికారంలోకి రాగానే అమలు చేసింది.'

'గత ఐదు సంవత్సరాలు మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధిని గాలికి వదిలేశారు. కూటమి వచ్చాక చేయాలనుకున్నా అడ్డుకున్నారు. అందుకే భవిష్యత్తులో సమస్య అనేది లేకుండా సన్నాహాలు చేస్తున్నాం. ప్రధాన సమస్యల్ని దశల వారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్ శాఖ నుంచి అవసరమైన నిధులు తీసుకొస్తాం. ప్రధాన రోడ్లు మొత్తం పూర్తి చేశాం. డ్రైనేజీల పనులు పూర్తి చేస్తాం. ఇళ్ల స్థలాలు కూడా అందరికీ అందించి వాటిని పూర్తి చేస్తాం. మచిలీపట్నంలో తాగునీటి సమస్య తీరుస్తాం. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్ని వీలైనంత వరకు అభివృద్ధి చేస్తాం. ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. ప్రతి గ్రామంలో పర్యటించి ప్రతి సమస్యనూ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాము' అని మంత్రి రవీంద్ర చెప్పారు.

సెంటు పట్టాలో ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బంది ఎదురవుతోందని చెప్పడంతో అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వ్యవసాయ కాలువల్లో పూడిక తొలగించాలని రైతులు కోరడంతో త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కొత్త పెన్షన్ల వినతులను కూడా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, కుంచె దుర్గాప్రసాద్, గంగాధర్, మధు, ఆలపాటి రమేష్, టీడీపీ నాయకులు విష్ణు, శివ పాల్గొన్నారు.

# బందరు మున్సిపాలిటీ పూర్వ వైభవం సాధించాలి

- ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి
- అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు
- మచిలీపట్నం మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): మచిలీపట్నం మున్సిపాలిటీ పూర్వ వైభవం సాధించేలా అధికారులు, ప్రజలు కలిసి పని చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై అధికారులను ఆరా తీశారు. మున్సిపాలి టీ పరిధిలో 108.7 కి.మీ. డ్రైనేజీ ఉండగా అందులో 122 గ్యాప్స్ గుర్తించారు. వాటిని సరిదిద్దాలని అధికారులకు సూచించారు. అమృత్ పథకంలో ఇళ్ల మధ్యనున్న డ్రైన్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాల న్నారు. మచిలీపట్నంలో మురుగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీటిని బయటకు పంపించేలా రూ.13కోట్లతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాగునీటి పైపులైన్లకు మరమ్మతులు, అభివృద్ధి కోసం రూ.15 కోట్లు నిధులు కేటాయించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'గతంలో వాటర్ హౌస్ వద్ద కొంతమంది గంజాయి తాగి తాగునీటి వ్యవస్థను నాశనం చేశారు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా చెత్త పేరుకుపోయినా మున్సిపల్ కార్యాలయం నుంచే పరిశీలించేలా సన్నాహాలు చేస్తున్నాం. మచిలీపట్నంలో 12వేలకు పైగా వీధి దీపాలున్నాయి. వాటి నిర్వహణతో పాటు పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలి. పన్నుల చెల్లింపులో బాధ్యతగా వ్యవహరించాలి. మున్సిపాలిటీకి రూ.24 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. మన మున్సిపాలిటీని మనమే కాపాడుకోవాలి' అని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

'1864లో ఏర్పడిన మున్సిపాలిటీ మన మచిలీపట్నం. అలాంటిది ప్రస్తుతం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. రాష్ట్రంలో 42వ స్థానంలో ఉండడం బాధాకరం. మచిలీపట్నం మున్సిపాలిటీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అధికారులకు ప్రజలు సహకరించాలి. మున్సిపాలిటీని అభివృద్ధిలో రాష్ట్రానికి మోడల్‌గా మార్చేందుకు తోడ్పాటు అందించాల'ని మంత్రి రవీంద్ర సూచించారు.

### చార్జీలు పెంచకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలన్నదే

# సీఎం చంద్రబాబు లక్ష్యం

- రైతులకూ ఇబ్బంది లేని విద్యుత్ సరఫరానే ధ్యేయం
- ఉద్యోగుల కృషితోనే విద్యుత్ శాఖకు మంచి పేరు
- సూర్యఘర్ వంటి పథకాల అమలులో సిబ్బంది పనితీరు భేష్
- 95 శాతం సంతృప్త స్థాయిలు ఉండేలా ఉద్యోగుల సేవలుండాలి
- సీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయ ప్రారంభోత్సవంలో మంత్రి ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



విజయవాడ (చైతన్యరథం): ప్రజలపై అదనపు భారం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లక్ష్యమని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విజయవాడలోని గుణదలలో రూ.35కోట్లకు పైగా వెచ్చించి నిర్మించిన ఏపీసీపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరాకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఉద్యోగుల కృషి, పనితీరు కారణంగా విద్యుత్ శాఖకు మంచి పేరు వచ్చింది. అంతరాయాలు, లో ఓల్టేజ్ సమస్యలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా విద్యుత్ శాఖ పని చేస్తోంది. పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలులో కూడా సిబ్బంది అందిస్తున్న సేవలు ప్రశంసనీయం. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు విద్యుత్ శాఖపై నమ్మకం పెరుగుతోంది' అని స్పష్టం చేశారు. 95 శాతం ప్రజల సంతృప్త స్థాయిని అందుకునేలా సిబ్బంది మరింత సమర్థవంతంగా పని చేయాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు.

**కూటమి ప్రభుత్వంలో రికార్డు స్థాయి విద్యుదుత్పత్తి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల రెండు నెలల కాలంలోనే ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జెన్‌కో రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి సాధించిందని మంత్రి గొట్టిపాటి ప్రశంసించారు. రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించేందుకు, పవర్ లాసెస్‌ను తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెరగడంతో బయటి నుంచి కొనుగోలు చేసే విద్యుత్‌ను కూడా తగ్గించినట్లు తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. మరోవైపు అన్నదాతలకు కూడా 'పీఎం కుసుమ్' ద్వారా పగటి పూటే 9 గంటల నాణ్యమైన నిరంతరాయ విద్యుత్‌ను త్వరలోనే అందిస్తామని వెల్లడించారు. ఈ పథకానికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, పనులు కూడా ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక పద్ధతుల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని మరింత పెంచేలా అనేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సోలార్, విండ్, పీఎస్పీ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 10 చోట్ల టెండర్లు ఇప్పటికే పిలిచామని చెప్పారు.

**ప్రకృతి వైపరీత్యాల్లోనూ ప్రత్యేక సేవలు....**

విద్యుత్ శాఖ సిబ్బంది ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ ప్రత్యేక సేవలు అందించారని మంత్రి గొట్టిపాటి అభినందించారు. విజయవాడ వరదల సమయంలో, విశాఖ తుఫానుల సమయంలో రేయింబవళ్లు ప్రజలకు విద్యుత్ సేవలు అందించడానికి ఎంతో కష్టపడ్డారన్నారు. ముఖ్యంగా తుపాను సమయంలో ఎస్పీడీసీఎల్‌కు చెందిన సుమారు 2వేల మంది సిబ్బంది కుటుంబాలను వదిలి మరీ.. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించిన విషయాన్ని గుర్తు చేశారు. గంటల వ్యవధిలోనే 20వేల విద్యుత్ స్తంభాలను మార్చి తుపాను తీరం దాటిన కేవలం 24గంటల్లోనే విద్యుత్‌ను పునరుద్ధరించిన ఘనత విద్యుత్ శాఖదే అన్నారు. ఈ విధంగా కష్టపడే సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే తాము ముందుండి పని చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. సీఎం చంద్రబాబు ఆశయ సాధన కోసం సిబ్బంది అందరూ మరింత కష్టపడి విధులు నిర్వహించి విద్యుత్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి గొట్టిపాటి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఇంధన శాఖ స్పెషల్ సీఎం కె.విజయానంద్, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఇంజనీర్లు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల వైద్యం, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

*- మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి*

కొండపి (చైతన్యరథం): పేదల వైద్యం, ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. కొండపి సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మరమ్మతులు, ప్రహరీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని అధికారులకు సూచించారు. పనులు త్వరగా పూర్తి చేసి వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. వైసీపీ హయాంలో ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసారని విమర్శించారు. నేడు పేద ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్ని విధాలా అండగా ఉంటున్నా రని మంత్రి చెప్పారు.



# పొరుగు రాష్ట్రాలకు దీటైన రాజధాని మన అమరావతి

**- ఒకే రాజధానితో అభివృద్ధి వికేంద్రీకరణ**
**- ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు**

మంగళగిరి (చైతన్యరథం): అమరావతికి చట్టబద్ధత రావడం ఒక చారిత్రాత్మక ఘట్టమని, దేశంలోనే చట్టబద్ధత పొందిన ఏకైక రాజధానిగా అమరావతి చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు కొనియాడారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కలలు కన్న రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించడం పట్ల రాష్ట్ర ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

'రాష్ట్రపతి ఆమోదంతో అమరావతి శాశ్వత రాజధానిగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో అమరావతి చరిత్రలో అత్యున్నత స్థానంలో నిలిచింది.



2014-19 మధ్య అసెంబ్లీలో జగన్‌మోహన్‌రెడ్డి అమరావతిని స్వాగతించారు. 30వేల ఎకరాల భూమి కావాలని, తాను కూడా అక్కడే ఇల్లు కట్టుకుంటానని చెప్పారు. తీరా అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల బిల్లు తెచ్చి అయోమయం సృష్టించారు. చంద్రబాబుపై నమ్మకంతో 29వేల మంది రైతులు 34వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ఇచ్చారు. ఇది దేశ చరిత్రలోనే గర్వించదగ్గ విషయం. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు అందరికీ మధ్యస్థంగా ఉండాలనే ఉద్దేశంతోనే కృష్ణా నదీ తీరాన అమరావతిని రాజధానిగా ఎంపిక చేశారు. అమరావతి కేవలం రాజధాని మాత్రమే కాదు, యువత కలల సౌధం. 26 జిల్లాల ప్రజలకు ఇది ఉపాధినిచ్చే కేంద్రం.' అన్నారు.

గతంలో హైదరాబాద్ ఎలాగైతే అభివృద్ధి చెంది రాష్ట్రానికి ఆదాయాన్ని ఇచ్చిందో అమరావతి కూడా అలాగే 13 జిల్లాల (పాత) అభివృద్ధికి, ప్రతి పంచాయతీ ఆదాయానికి వనరుగా నిలుస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కాయి. సుమారు రూ. 58వేల కోట్లతో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. గతంలో చంద్రబాబునాయుడు హయాంలో ప్రారంభించిన సెక్రటేరియట్, ప్రజాప్రతినిధుల భవనాలు, మౌలిక సదుపాయాల పనులను ప్రభుత్వం వేగవంతం చేస్తోందన్నారు.

"జగన్‌మోహన్ రెడ్డి 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడే రాజధానిని మార్చలేకపోయారు. ఎందుకంటే రైతులు ఒప్పందాలను కోర్టులో సవాల్ చేసే ధైర్యం వారికి లేదు. అమరావతి అనేది సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్. ఇది ప్రజల రాజధాని, శాశ్వత రాజధాని అని కూటమి ప్రభుత్వం తరపున స్పష్టం చేస్తున్నాం." అని రామారావు అన్నారు.

# రూ.185 కోట్లతో విజయవాడ స్టేడియం అభివృద్ధి

### గత ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు: రవాణా, క్రీడల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రవాణా, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. క్రీడల వికాసానికి ముఖ్య మంత్రి చంద్రబాబుతో పాటు యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియ (ఏజీఎంసీ) స్టేడియాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా మరో రూ.20 కోట్లు..మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.160 కోట్లను మూడు దశల్లో ఖర్చు చేయనుందని మంత్రి మండిపల్లి తెలిపారు. విజయవాడకు తలమానికంగా నిలిచిన ఈ స్టేడియం గత ప్రభుత్వ పాలనలో ఐదేళ్ల పాటు నిర్లక్ష్యానికి గురైం దని మండిపడ్డారు. ప్రస్తుతం ఎంపీ కేశినేని చిన్ని నాయకత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, శాప్ సమన్వయంతో దీని అభివృద్ధికి జీవో తీసుకురావడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం మంత్రులు, ఎంపీలు నిరంతరం కేంద్ర మంత్రు లను కలిసి ఏపీకి కావాల్సిన నిధులను సాధిస్తున్నారని కొనియా డారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర



రాజధానిగా అమరావతికి శాశ్వత గుర్తింపు రావడంతో విజయవాడకు మహర్ద శ పట్టనుందని తెలిపారు. విజయవాడ ఐజీఎంసీ స్టేడియాన్ని సుమారు రూ.185 కోట్ల వ్యయంతో మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కానుందని, స్పోర్ట్స్ యూనివర్శిటీ కూడా ఏర్పాటు కానుందని పేర్కొన్నారు. అమరావతిలో 2,500 ఎకరాల్లో భారీ స్పోర్ట్స్ సిటీని నిర్మించాలని సీఎం చంద్రబాబు కృత నిశ్చయం తో ఉన్నారని తెలిపారు. 2029 నాటికి విజయవాడ, అమరా వతిలో నేషనల్ గేమ్స్ నిర్వహించేలా కూటమి సర్కార్ ముందు కు సాగుతోందని తెలిపారు.

**ఎంపీ కృషి ప్రశంసనీయం: రవినాయుడు**

విజయవాడ ఐజీఎంసీ స్టేడియం అభివృద్ధిలో ఎంపీ కేశినేని శివనాథ్ పాత్ర అత్యంత కీలకమని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. దాని అభివృద్ధి కోసం సుమారు 20 సార్లు స్టేడియానికి వెళ్లి సూచనలు చేసినటు చెప్పారు. ఎంపీ కేశినేని శివనాథ్ కోరినట్లుగా స్టేడియంలో ఓ బ్లాక్‌కు మహిళా క్రీడాకారిణి పేరు పెడతామని తెలిపారు. వచ్చే ఏడాది నాటికి స్టేడియం రూపు రేఖలు మారిపోనున్నాయని చెప్పుకొచ్చారు శాప్ చైర్మన్. వచ్చే సంవత్సరం ఓ అంతర్జాతీయ క్రీడాకారుడిని స్టేడియానికి తీసుకువచ్చి కార్యక్రమం చేపడతామని తెలిపారు.

# గుంటూరు ప్రజల 70ఏళ్ల కల సాకారం

### *శంకర్ విలాస్ ఆర్వోబీ పనుల పరిశీలనలో మంత్రి జనార్దన్‌రెడ్డి*

గుంటూరు (చైతన్యరథం): గుంటూరు నగరాభివృద్ధిలో అత్యంత కీలకమైన, దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం మోక్షం కలిగించిందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

**ఆర్వోబీ ప్రత్యేకతలు - పురోగతి:**

నిధుల కేటాయింపు: కేంద్ర ప్రభుత్వ జ=×ఖీ (సేతు బంధన్) పథకం కింద రూ.98 కోట్లతో 930 మీటర్ల పొడవున నాలుగు వసరుల ఆర్వోబీ మంజూరు చేశారు.

ఆధునిక నిర్మాణం: భవిష్యత్తులో విద్యుత్ లైన్లు, డబుల్ డెక్కర్ రైళ్ల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వంతెన ఎత్తును పెంచుతున్నట్టు మంత్రి తెలిపారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా 2027 మే నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. నిర్దేశిత సమయం కంటే ముందే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు:**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టుపై కనీసం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని మంత్రి విమర్శించారు. నేడు కూటమి ప్రభుత్వం వేగంగా అనుమతులు తెచ్చి పనులు ప్రారంభిస్తే, ఉనికి కాపాడుకోవడానికి వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి 'మావిగన్' అంటూ చేస్తున్న వ్యాఖ్యలపై ప్రజలు నవ్వుకుంటున్నారని, రాజధాని విషయంలో ఆయన వైఖరి మూర్ఖత్వంగా ఉందని ఎద్దేవా చేశారు.

**రాష్ట్రవ్యాప్త అభివృద్ధి - ముఖ్యాంశాలు:**

రాష్ట్రంలో రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనలో కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి వివరించారు:



గుంటూరు జిల్లా అభివృద్ధి: జిల్లాలో 974 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్లకు గాను ఇప్పటికే రూ. 159.41 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.

గుంతల రహిత రాష్ట్రం: కేవలం 9 నెలల్లో 27 వేల కిలోమీటర్ల రోడ్లను గుంతల రహితంగా తీర్చిదిద్దామని, రాబోయే 20నెలల్లో రూ.3వేల కోట్లతో రోడ్ల నెట్‌వర్క్‌ను ఆధునీకరిస్తామని తెలిపారు.

భారీ కేటాయింపులు: ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఏడాది ఆర్‌అండ్‌బీ శాఖకు రూ. 3,000 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

పెట్టుబడులు – ఉపాధి: విశాఖ సీఐఐ సదస్సు ద్వారా రూ.16లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, లోకేష్ ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

కీలక ప్రాజెక్టులు: రాష్ట్రంలో కొత్తగా 6 విమానాశ్రయా లు రానున్నాయని, భోగాపురం ఎయిర్‌పోర్టును వచ్చే ఏడాది ఆగస్టులో ప్రారంభించి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారు. నాలుగు గ్రీన్ ఫీల్డ్ పోర్టుల పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.

'సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది... ఒకవైపు లక్ష కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి, మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డు పనులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేస్తాం'... మంత్రి జనార్దన్‌రెడ్డి

## రామచంద్రపురంలో అభివృద్ధి పనులకు నిధులు

**- పురపాలక మంత్రి పొంగూరు నారాయణ ఆదేశం**

**- మున్సిపాలిటీలో అధికారులతో కలిసి పర్యటన**



రామచంద్రపురం (చైతన్యరథం): మున్సిపాలిటీ పరిధిలో మంత్రి పొంగూరు నారాయణ బుధవారం పర్యటించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి పార్కులు, రోడ్లు, డ్రైన్లు ఖాళీ స్థలాలు పరిశీలించారు. రామచంద్రపురం మున్సిపల్ ఆఫీసులో అధికారులతో సమీక్షించారు. పలు అభివృద్ధి పనులకు రూ.3 కోట్ల విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. రామచంద్ర పురంలో పార్కు అభివృద్ధికి కోటి రూపాయలు, సెంట్రల్ డివైడర్ నిర్మాణానికి రూ.50 లక్షలు, డ్రైన్ల నిర్మాణానికి రూ.1.5 కోట్లు విడుదలకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సి పాలిటీల్లో మౌళికవసతుల అభివృద్ధిపై దృష్టి పెట్టాం. గత ప్రభుత్వ నిర్వాకంతో మున్సిపాలిటీల్లో అభివృద్ధి జరగలేదు. రాబోయే రెండేళ్లలో మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా తాగు నీరు అందిస్తాం. రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల్లో డ్రైన్ల నిర్మాణా నికి రూ.14,000 కోట్లు అవసరం. జనాభా ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రాధాన్యతగా డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

## గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

**- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి**

**- పంచాయతీల ప్రత్యేకాధికారులతో సమీక్ష**



కొండపి (చైతన్యరథం): పంచాయతీల ప్రత్యేక అధికారులు గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అన్నారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన పంచాయతీల ప్రత్యేక అధికారులతో తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో బుధవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి కొండపి నియోజకవర్గంలోని అన్ని మండలాల పంచాయతీ ప్రత్యేక అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచా యతీల ప్రత్యేక అధికారులు గ్రామాల్లో సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించాలి..గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు అధిక ప్రాధా న్యత ఇవ్వాలి..వీధిలైట్లు లేని చోట వెంటనే లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, అందుకోసం చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# అమరావతిలో నిర్మాణాలు శరవేగం

**- మంత్రి పొంగూరు నారాయణ ఆదేశం**

**- పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష**

అమరావతి(చైతన్యరథం): అమరావతి అభివృద్ధిని వేగవంతం చేస్తూ వివిధ భవనాలు, ఇళ్లు, మౌళిక సదుపాయాల నిర్మాణాన్ని పూర్తి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి నారాయణ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెలలోనే పలు భవనాల నిర్మాణం పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించడంపై సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. పనులు వేగంగా పూర్తి చేయాలని సంస్థల అధికారులను, కాంట్రాక్టర్లను మంత్రి ఆదేశిం చారు.



అమరావతిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల కోసం మొత్తం 4,026 ఇళ్లను ప్రభుత్వం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణాలు పూర్తవుతున్న టవర్ల వద్ద మౌలిక సదుపా యాలు(రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాలు) కల్పించడంపై సమావేశంలో చర్చించారు. ఈ సదుపాయాలు సకాలంలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ సమీక్ష సమావేశంలో ఏజీఐసీఎల మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్, ఇంజినీర్లు, వివిధ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారానే జోనల్ల పోస్టుల భర్తీ

***నియామకాలు మరింత త్వరగా, పారదర్శకంగా జరిగేందుకు వీలుగా చర్యలు: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్***

అమరావతి (చైతన్యరథం): జోనల్ స్థాయి ఉద్యోగ నియామకాల ప్రక్రియలో పారదర్శకత మరింత పెంచేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని నాలుగు జోనల్ కార్యాలయాలపై ఒత్తిడి తగ్గించే ఉద్దేశంతో జోనల్ స్థాయి పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ జారీ నుంచి ఎంపిక జాబితా ఖరారు వరకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఏపీఎంఎస్ఆర్‌బీ) ద్వారా జరుపుతామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఇకపై ఇచ్చే నోటిఫికేషన్లకు ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని చెప్పారు. జీరో వేకెన్సీ కింద పోస్టుల భర్తీని ఎప్పటికప్పుడు చేపడుతున్నందున కొత్త నిర్ణయం ద్వారా త్వరితగతిన నియామకాలు పూర్తవుతాయని, పాదదర్శకత మరింత పెరుగుతుందని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు.



స్టాఫ్ నర్సులు, రేడియోగ్రాఫర్స్, ఫార్మసీ అసిస్టెంట్, మలేరియా ఆఫీసర్, స్టాటిస్టికల్ ఆఫీసర్, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, మెడికల్ రికార్డు టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రస్తుతం జోనల్స్ వారీగా జరుగుతోంది. జోన్-1, జోన్-2, జోన్-3, జోన్ -4 కింద విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గుంటూరు, కడప కార్యాలయాల కేంద్రంగా సదరు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వెలువడుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ ఎంపిక జాబితా ఖరారు, కౌన్సెలింగ్ పోస్టింగు ఉత్తర్వుల జారీ ప్రాంతీయ కార్యాలయాల ద్వారానే జరుగుతోంది. ఈ క్రమంలో పోస్టుల భర్తీ తీరుపై పలు సందర్భాల్లో విమర్శలు వస్తున్నాయి. ఈ మధ్య రాజమహేంద్రవరం జోనల్ కార్యాలయం ద్వారా సుమారు 310 నర్సు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా 12వేల దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులో పేర్కొన్న అర్హతలు, సీనియార్టీ, ఇతర వివరాలను నిశితంగా పరిశీలించేందుకు మూడు నెలల సమయం పట్టింది. ఇలా పోస్టుల సంఖ్య అనుసరించి వచ్చే దరఖాస్తుల ప్రకారం ఎంపిక జాబితా ప్రకటించేందుకు ఎక్కువ సమయం పడుతోంది. జోనల్ కార్యాల యాల్లో రికార్డు అసిస్టెంటు నుంచి సూపరింటెండెంట్ వరకు కలిపి సగటున 15 మంది ఉంటున్నారు.

మరోవైపు దరఖాస్తుల పరిశీలన కోసం తాత్కాలిక పద్ధతిలో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీనియర్ అసిస్టెంట్లు, ఇతర ఉద్యోగుల సేవలు పొందుతున్నారు. ఈ పరిస్థితుల్లో రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారానే జోనల్ పోస్టుల భర్తీకి సంబంధించిన జాబితా ఖరారు వరకు చర్యలు తీసుకోవడం ద్వారా అక్కడి అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తగ్గుతోంది. ఉద్యోగుల పదోన్నతులు, ఉద్యోగుల సర్వీసు వ్యవహారాల పరిశీలనకు తగిన సమయం దొరుకుతుంది.

రిక్రూట్‌మెంట్ బోర్డులో దరఖాస్తుల పరిశీలన దగ్గర నుంచి ఎంపిక చేసిన వారి జాబితా ఖరారు వరకు తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన విధానం అమల్లో ఉంది. రాష్ట్ర సాయి నియామకాలు (మెడికల్ ఆఫీసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, సైక్రియాటిస్టులు, ఇతర పోస్టులు) జరుగుతున్నాయి. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆయుష్ హెచ్‌వోడీ కార్యాలయాల నుంచి ఇండెంట్ల ఆధారంగా రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్లు జారీ చేసి సదరు పోస్టుల ఎంపిక జాబితా ఖరారు వరకు చర్యలు తీసుకుంటోంది. ఆన్లైన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించడం, పోస్టింగులు ఇవ్వడం మాత్రమే సదరు హెచ్‌ఓడీల ద్వారా జరుగుతోంది. తాజాగా డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని 482 వైద్యుల నియామకాలు ఇదే విధంగా జరిగాయి. సరిగ్గా అదే విధానాన్ని జోనల్ స్థాయి పోస్టుల భర్తీలోనూ అనుసరించేలా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 2024 జూన్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు 2,310 నియామకాలు జరిగాయి. త్వరలో బోధనాసుపత్రుల్లో 317 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ జరగనుంది.

# యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- ప్రతి ఇంటి నుంచి ఒకరు తయారుకావాలి
- ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్‌కు పెద్దపీట
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత




మంగళగిరి(చైతన్యరథం): యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగి, మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామి కవేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. పరిశ్ర మల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. నాగా ర్జున యూనివర్శిటీలోని డాక్టర్ హెచ్.హెచ్.డైక్ మన్ ఆడిటోరి యంలో బుధవారం నిర్వహించిన ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడ బ్ల్యూఎస్ వర్గీయులకు అవకాశాలపై ఒకరోజు అవగాహన సదస్సు లో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి అనం తరం మంత్రి ప్రసంగించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ఏర్పాటుపై అగ్ర కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు మేలు కలుగజేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇంతకుముందు ప్రకృతి వ్యవసా యంతో ఎలా లాభాలు ఆర్జించ వచ్చో అవగాహన సదస్సు నిర్వ హించారన్నారు. ఇప్పుడు ఉపాధి కల్పనపై మరో అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తం గా అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులకు బీసీ సంక్షేమ శాఖ అండగా నిలుస్తుంది. ఆసక్తి కలిగిన యువత డీపీఆర్‌లతో ముందుకొస్తే చిన్న,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుక సబ్సిడీ రుణాలు, ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ సీఈవో ఎం.విశ్వ, వీసీ గంగాధర్‌రావు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు బుచ్చి రాంప్రసాద్, బ్రహ్మం చౌదరి, డైరెక్టర్లు, ఔత్సాహిక పారిశ్రా మికవేత్తలు, విద్యార్థులు, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖలో మంత్రి సుభాష్ ఆకస్మిక తనిఖీలు



విశాఖపట్నం(చైతన్యరథం): నగరంలో కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకస్మికంగా పర్యటించారు. ఎండాడ, సాగర్ నగర్ ప్రాంతాల్లో భవన నిర్మాణ పనులను ఆకస్మిక తనిఖీ చేశా రు. కార్మికులతో మాట్లాడి యజమానులు వారికి కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో కార్మికుల భద్రతపై అసహనం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో మంత్రితో పాటు ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డ్ చైర్మన్ వలవాల బాబ్జీ, కార్మిక శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విశాఖలో భవన నిర్మాణ ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు చెప్పారు. నిర్మాణ పనులలో కార్మికులు మాస్కులు వాడడం లేదు. కార్మికులకు నిర్మాణ ప్రాంతంలో వాష్ రూమ్ సౌకర్యం లేదు. సెస్ డబ్బులు చాలా చోట్ల కట్టడం లేదు. మాజీ ఎంపీ ఎంవీవీ రూ.10 కోట్లు సెస్ కట్టాల్సి ఉందని తెలిపారు. సీఎం చంద్రబాబు భవన నిర్మాణ కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని పేర్కొన్నా రు. భవన నిర్మాణ కార్మికులు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఒక సంవత్సరంలో 40 రోజులు కార్మికులు పనిచేస్తే భవన నిర్మాణ కార్మికుల కేటగిరిలోకి వస్తారని తెలిపారు. నిర్మాణ సంస్థ లు కార్మికుల భద్రతపై తప్పక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# విజయవాడ ఉగ్ర కేసులో షాకింగ్ విషయాలు

- 42 మంది అమ్మాయిల రిక్రూట్
- జిహాదీ గ్రూప్స్‌లో ఆకర్షించేలా వీడియోలు

అమరావతి: విజయవాడ ఉగ్రవాద లింకుల కేసులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌కు చెందిన సైదా బేగం విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. మహిళలను ఉగ్రవాద దిశగా ఆకర్షించేలా సైదా బేగం యత్నం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 42 మంది యువతులను రిక్రూట్ చేసింది. KHAWATEEN అనే పేరుతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి జిహాదీ గ్రూప్స్‌లో యువతను ఆకర్షించే విధంగా వీడియోలు షేర్ చేసినట్లు తెలుస్తోంది. లాడెన్, జకీర్ నాయక్ తదితరుల జిహాదీ వీడియోలను సైదా బేగం వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేసింది. ఇన్‌స్టాలో 40 అకౌంట్లలో జిహా దీ వీడియోలు ఉంచి మదర్సాల్లో మతపరమైన శిక్షణ తర్వాత వెపన్ ట్రైనింగ్‌కు సన్నాహాలు చేసినట్లు విచారణలో తెలుస్తోంది. పోలీసులు వాట్సాప్‌లో భారీగా పీడీఎఫ్ ఫైళ్లను స్వాధీనం చేసుకు న్నారు. వీటిని ట్రైనింగ్, రిక్రూట్‌మెంట్‌కు సంబంధించిన విగా గుర్తించారు. ప్రస్తుతం ఉగ్రవాద లింకులపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. తద్వారా ఉగ్రవాద నెట్‌వర్క్‌లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# పేదలకు అండగా సీఎం సహాయ నిధి

**లబ్ధిదారులకు రూ.10.43 లక్షలు విలువైన చెక్కులను పంపిణీ చేసిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి**



సాలూరు (చైతన్యరథం): ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. బుధవారం ఆమె సాలూరు నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు సుమారు రూ.10,43,512 విలువైన చెక్కులను స్వయంగా అందజేశారు.

లబ్ధిదారులు వీరే: శ్రీనివాసరావు (సాలూరు టౌన్, 13వ వార్డు) రూ.1,65,585, అల్లు ఈశ్వరరావు (సాలూరు టౌన్, 21వ వార్డు) రూ.44,368, జమ్మూ రాము (సాలూరు టౌన్, 28వ వార్డు) రూ.88,210, అచ్చుభక్త పద్మావతి (సాలూరు టౌన్, 14వ వార్డు) రూ. 32,028, తాడివలస గుణశేఖర్ (సాలూరు టౌన్, 7వ వార్డు) రూ.64,859, జక్కు రాములు (సాలూరు టౌన్, 23వ వార్డు) రూ.67,470, బూర్లి ప్రణయ్‌కుమార్ (సాలూరు టౌన్, 29వ వార్డు) రూ.3,50,072, తిర్లింగి అక్షయ (విశ్వనాథపురం, పాచిపెంట మండలం) రూ. 15వేలు, ఈదుబిల్లి అనురాధ (గురివినాయుడుపేట, పాచిపెంట) రూ.60,637, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి (పి.కొనవలస, పాచిపెంట మండలం) రూ.48,237, కొండపల్లి జయాంత్ (పోరం, మెంటాడ మండలం) రూ. 87,440.

ఈ సందర్భంగా మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ అనారోగ్యం, అత్యవసర సమయాల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి కి, మంత్రి సంధ్యారాణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బడ్జెట్ ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో బడ్జెట్ అవుట్‌లుక్ సమావేశంలో మంత్రి నారాయణ**




కాకినాడ (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కాకినాడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన బడ్జెట్ అవుట్‌లుక్ సమావేశానికి ఆయన హాజరయ్యారు. కలెక్టర్ హరిచంద్ ప్రసాద్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**అమరావతికి చట్టబద్ధత - కృతజ్ఞతలు:**

అమరావతి రాజధానికి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడం పట్ల కలెక్టర్, మంత్రి నారాయణకు జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాజధాని నిర్మాణం రాత్రింబవళ్లు శరవేగంగా జరుగుతోందని స్పష్టం చేశారు.

మారిషస్ గన్ వ్యాఖ్యలు: జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న 'మావిగన్' వ్యాఖ్యలు చూసి చిన్న పిల్లలు కూడా నవ్వుకుంటున్నారని మంత్రి ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం అమరావతి రైతులను అనేక ఇబ్బందులకు గురిచేసిందని మండిపడ్డారు.

జగన్ వైఖరి: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి ఒప్పుకొని, అధికారంలోకి రాగానే మాట మార్చారని విమర్శించారు. పార్లమెంట్‌లో అమరావతి బిల్లు పెట్టినప్పుడు 5 కోట్ల మంది ప్రజలు సంతోషిస్తే, జగన్ మాత్రం తన 'సైకో మెంటాలిటీ'తో ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

రాష్ట్ర విభజన తర్వాత కంటే గత ఐదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతిన్నదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

నిధుల మళ్లింపు: మున్సిపల్ నిధులు రూ. 3,000 కోట్లను గత ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని తెలిపారు.

తక్కువ తలసరి ఆదాయం: ప్రస్తుతం ప్రభుత్వ ఆదాయంలో 93శాతం కేవలం ఉద్యోగుల జీతాలకే సరిపోతోందని, రాష్ట్ర తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉందని పేర్కొన్నారు.

నీతి ఆయోగ్ నివేదిక: అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ 17వ స్థానానికి పడిపోయిందని గుర్తుచేశారు.

**సంక్షేమం-అభివృద్ధి లక్ష్యంగా కూటమి పాలన:**

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదాయ మార్గాలపై దృష్టి సారించారని మంత్రి తెలిపారు. నిధుల కొరత లేకుండా ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం-2, స్త్రీ శక్తి పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు.

గత ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసినా, తమ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమించి డీఎస్సీ, జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.

# డంప్ యార్డ్ రహిత ఆంధ్రప్రదేశే లక్ష్యం

- **రూ.528.65 కోట్లతో 107 ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటు**
- **ఏ రోజుకారోజు 5,385 టన్నుల చెత్త ప్రాసెస్**
- **'స్వచ్ఛ' విప్లవానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం**
- **రైతులకు బ్రాండెడ్ 'బయో-ఫర్టిలైజర్లు'**
- **ప్రభుత్వ గ్రాంట్‌తో పాటు కార్పొరేషన్‌కు కొంతమేర సొంత ఆదాయం**
- **గత ప్రభుత్వం చెత్తకు పన్ను-మా ప్రభుత్వం సంపద సృష్టి**
- **గ్రామాల్లోనూ స్వచ్ఛ విప్లవం**
- **పది క్లస్టర్లలో జూన్ మొదటివారంలో ప్రాజెక్టులు ప్రారంభం**
- **స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్**




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో రూ.528.65 కోట్లతో 107 ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి ఒప్పందం పత్రాలను అమరావతిలోని కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం చైర్మన్ పట్టాభిరామ్ సమక్షంలో కార్పొరేషన్ ఎండీ బి.అనిల్‌కుమార్‌రెడ్డి నుంచి ఏజెన్సీల ప్రతినిధులు అందుకున్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే కాకుండా, చెత్త నుంచి సంపదను సృష్టించడం ద్వారా ఆదాయం సమకూర్చేవైపు అడుగులు వేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో మంత్రి నారాయణ పర్యవేక్షణలో రాష్ట్ర పారిశుధ్య ముఖచిత్రాన్ని మార్చేసే పలు చారిత్రాత్మక నిర్ణయాలకు బుధవారం ఉదయం జరిగిన కార్పొరేషన్ బోర్డు సమావేశంలో ఆమోదించినట్టు తెలిపారు. "గత ప్రభుత్వం చెత్తపై పన్ను వేసింది. పారిశుధ్యాన్ని గాలికి వదిలేసింది. రాష్ట్రాన్ని చెత్త కొండలమయం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా చెత్తను తొలగించకపోవడంతో అది 153 లక్షల మెట్రిక్ టన్నులకు పేరుకుపోయింది. మొదట 100 లక్షల టన్నుల లెగసీ వేస్ట్ క్లియర్ చేశాం. ఇంకా 53 లక్షల టన్నుల చెత్త క్లియర్ చేయవలసి ఉంది. దీనిని దశలవారీగా క్లియర్ చేస్తూనే, భవిష్యత్తులో ఎక్కడా చెత్త నిల్వలు ఉండకుండా ఉండేందుకు అత్యాధునిక విధానాలను అమలు చేస్తున్నాం. డంప్ యార్డ్ రహిత ఆంధ్రప్రదేశ్ మా లక్ష్యం" అని పట్టాభిరామ్ వివరించారు.

**107 ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లు జూన్ నాటికి అందుబాటులోకి**

రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో 107చోట్ల రూ.528.65 కోట్ల వ్యయంతో ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రాసెసింగ్ యూనిట్ల కోసం కేంద్రం రూ.213 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.141 కోట్లు ఇస్తుందని, మున్సిపాల్టీలు తమ వంతుగా రూ.173 కోట్లు ఖర్చు చేస్తాయని తెలిపారు. రాష్ట్రంలోని 107 నగరాలు, మున్సిపాల్టీలను 10 క్లస్టర్లుగా విభజించి రోజుకు 5,385 టన్నుల చెత్తను ఎప్పటికప్పుడు ప్రాసెస్ చేయిస్తామన్నారు. ప్రతి సెంటర్ క్వార్టర్లీ రిటన్స్ ఫైల్ చేయవలసి ఉంటుందన్నారు.

మే నెలాఖరుకు ఈ సెంటర్లకు సంబంధించిన పనులు పూర్తి చేసి, జూన్ మొదటి వారంలోనే వీటిని ట్రయల్ రన్, ఆపరేషన్స్ లోకి తీసుకురావాలని మంత్రి నారాయణ లక్ష్యాన్ని నిర్దేశించారని తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే అగ్రిమెంట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఈ సెంటర్లు ఏర్పాటైన తర్వాత చెత్త సేకరణను నిరంతర పర్యవేక్షించేందుకు రియల్ టైం డ్యాష్ బోర్డును ఏర్పాటు చేయబోతున్నట్లు చైర్మన్ పట్టాభిరామ్ చెప్పారు. తమ తమ పట్టణాలు, గ్రామాలలో రోజుకు ఎంత చెత్త వస్తుందో, ఎంత ప్రాసెస్ చేస్తున్నారో ప్రజలు తెలుసుకుంటారన్నారు.

**రైతులకు 'బయో' భరోసా.. పీఎం ప్రణామ్ ద్వారా లబ్ధి**

చెత్తను కేవలం పారవేయడం కాకుండా దానిని రైతులకు ఉపయోగపడేలా చేసేందుకు వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుంటున్నామని చైర్మన్ పేర్కొన్నారు. తడి చెత్త నుంచి కంపోస్ట్ తయారు చేసి... దానికి పోషకాలు జోడించి బ్రాండెడ్ బయో-ఫెర్టిలైజర్‌గా తక్కువ ధరకే బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్స్ (బీఐఆర్సీ) ద్వారా రైతులకు అందిస్తామన్నారు. సేంద్రియ వ్యవసాయానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దేశంలోనే మొదటిసారిగా మన రాష్ట్రంలోనే ఈ ప్రక్రియ మొదలుపెడుతున్నట్టు చెప్పారు. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించినందుకు 'పీఎం ప్రణామ్' పథకం కింద కేంద్రం ఇచ్చే 50 శాతం సబ్సిడీ గ్రాంట్‌ను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేసే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని చెప్పారు.

**ప్రభుత్వ గ్రాంట్‌తోపాటు కార్పొరేషన్‌కూ కొంత మేర సొంత ఆదాయం**

రీసైక్లింగ్ పరిశ్రమల ద్వారా కార్పొరేషన్‌కు, మున్సిపాల్టీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. ఇప్పటివరకు గ్రాంట్ల ద్వారా మాత్రమే వచ్చిన నిధులు ఖర్చు చేస్తున్నామని, ఇక ముందు చెత్త నుంచి వచ్చిన ఆదాయం కూడా యాడ్ అవుతుందని చెప్పారు. రీసైక్లింగ్ పరిశ్రమ కొనుగోలు చేసే చెత్త విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయంలో మున్సిపాలిటీలకు 10 శాతం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు 10 శాతం వాటా లభిస్తుందని తెలిపారు. ఆ విధంగా బయోవేస్ట్ ద్వారా 10 శాతం, రీసైక్లింగ్ ద్వారా 10 శాతం ఆదాయం సమకూరుతోంది. ఇప్పటి వరకు గ్రాంట్ల ద్వారా మాత్రమే నడుస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కు కొంతమేర సొంత ఆదాయం కూడా సమకూరుతుందని చెప్పారు.

**జీరో వేస్ట్ కాన్సెప్ట్ - సర్క్యులర్ ఎకానమీ**

దేశంలోనే మొదటిసారిగా సర్క్యులర్ ఎకానమీ పాలసీని ఆంధ్రప్రదేశ్ విడుదల చేసిందని ఆయన గుర్తు చేశారు. తడిచెత్త, పొడి చెత్తను సేకరించి, తడిచెత్తని కంపోస్ట్‌గా తయారు చేయడం, ప్లాస్టిక్, పేపర్లు, కార్డుబోర్డు... వంటి వాటిని రీసైక్లింగ్ చేసే పరిశ్రమల వారు అపార్ట్‌మెంట్లు, కమ్యూనిటీ సెంటర్లు, పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాల నుంచి తడి, పొడి చెత్తలను డబ్బులు ఇచ్చి కొనుగోలు చేస్తారని చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. భవిష్యత్తులో అపార్ట్‌మెంట్లు, కమ్యూనిటీ సెంటర్లు, విద్యాసంస్థల వద్దే చెత్తను కొనుగోలు చేయడానికి ఏజెన్సీలు ముందుకు వస్తాయని చెప్పారు. "చెత్తపై పన్ను వేసిన గత ప్రభుత్వానికి భిన్నంగా.. చెత్తను కొనుగోలు చేసి సంపదగా మార్చి రాష్ట్రాన్ని సుందరంగా తీర్చిదిద్దే బాధ్యతను ఈ ప్రభుత్వం తీసుకుంది" అని పట్టాభిరామ్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆరుచోట్ల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు పట్టాభిరామ్ తెలిపారు.

**గ్రామాల్లోనూ స్వచ్ఛ విప్లవం**

2026 స్వచ్ఛ భారత్ నిబంధనలు గ్రామాలకు కూడా వర్తిస్తాయని చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని పట్టాభిరామ్ తెలిపారు. ప్రతి 3 మండలాలకు ఒకటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 210 యూనిట్లను ఒక్కొక్కటి రూ. 16-17 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 591 స్వచ్ఛ రథాలు ఆపరేషన్‌లో ఉండగా, వీటిని ప్రతి మండల స్థాయికి విస్తరిస్తున్నామన్నారు. 12వేల ట్రై సైకిళ్లు, 5వేల పుష్‌కార్టులు, 200 ఈ-ఆటోలను గ్రామాలకు సరఫరా చేశామన్నారు.

**ప్రత్యేకంగా ఎఫ్ఎస్టీపీ వాహనాల రూపకల్పన**

సెప్టిక్ ట్యాంకులు, గుంత మరుగుదొడ్లు వంటి వాటిని పారిశుధ్య వ్యవస్థల నుండి సేకరించి శుద్ధి చేయడానికి, సురక్షితంగా నిర్వహించడానికి ఫీకల్ స్లడ్జ్ మొబైల్ ట్రీట్ మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్టీపీ) కోసం ప్రత్యేకమైన ఒక వాహనాన్ని తమ కార్పొరేషన్ ఇంజనీర్లు రూపొందించినట్లు వివరించారు. ఎఫ్ఎస్టీపీలు ఈ వ్యర్థాలను శుద్ధి చేసి, శుద్ధి చేసిన నీటిని, బయోసాలిడ్స్‌ను (ఘన వ్యర్థాలు) వేరు చేసి, సురక్షితంగా పారవేయవచ్చు లేదా వ్యవసాయ ప్రయోజనాల కోసం తిరిగి ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఇటువంటి 70 మొబైల్ వాహనాలు సమకూర్చుకునే ప్రయత్నంలో కార్పొరేషన్ ఉందని పట్టాభిరామ్ చెప్పారు. ఈసారి జాతీయ స్థాయిలో మరిన్ని స్వచ్ఛ రక్షణ అవార్డులు సాధించడమే లక్ష్యంగా 'బెస్ట్ రివర్ టౌన్', 'బెస్ట్ కోస్టల్ టౌన్' విభాగాల్లో ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

**మంత్రి నారా లోకేష్ సారథ్యంలో విద్యార్థులకు అవగాహన**

పారిశుధ్యంపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ఐటీసీ వారి సహకారంతో 5 వేల పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఐటీసీ వెల్ బీయింగ్ అవుట్ ఆఫ్ వేస్ట్ కార్యక్రమం ద్వారా చిన్న వయసులోనే విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో వారు బాధ్యత పౌరులుగా తయారవుతార న్నారు. ప్రజలంతా తమ ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి అందిస్తే ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్రక్రియ సులభతరం అవుతుందని చెప్పారు.

**పబ్లిక్ టాయిలెట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం పబ్లిక్, కమ్యూ నిటీ టాయిలెట్స్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్టు చెప్పారు. టాయిలెట్స్ విషయంలో మెయింటినెన్స్ ముఖ్యమన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే మహిళా టాయిలెట్స్‌లో శానిటరీ నాప్‌కిన్స్ వంటి వాటితో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు.

సమావేశంలో కార్పొరేషన్ డైరెక్టర్లు చిన్ని శ్రీనివాసరావు, రవి కుమార్, ఆరుద్ర భూలక్ష్మి, లక్షణరావు బొమ్మినేని, ఎం.నాగలక్ష్మి, ఎం.పర్వీన్‌భాను, నాగమణి బోలెం, పి.భవాని రవికుమార్, రాము బుచ్చా, రెడ్డివారి మంజునాథ్, సానారెడ్డి కల్పనారెడ్డి, ఉదయ భాస్కర్ కూచిపూడి, పట్టాభిరామయ్య సాలాది, కార్పొరేషన్ సీఈఓ వేణుగోపాల్, జేడీ భాగ్యలక్ష్మి, సీవోవో దశరథ రామిరెడ్డి, ఈడీ అర్జునరావు, ఎఫ్ఎం విజయశేఖర్, ఈఈలు సుహాసిని, డీఈలు జయదేవ్, సతీష్, లక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ అండతో డబుల్ రిజిస్ట్రేషన్ల దందా

- పాల్పడిన వీఆర్వోపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- దేవుడి పేరుతో దగా... వైసీపీ నేతల కనుసన్నల్లోనే భూమి అక్రమ రిజిస్ట్రేషన్
- వారసత్వ భూమిపై కబ్జాదారుల కన్ను... న్యాయం చేయాలంటూ వినతి
- స్థలం కొన్నందుకు దళితుడిపై రౌడీ షీటర్లతో దాడికి యత్నం... కులం పేరుతో దూషణలు
- అర్జీలు స్వీకరించిన హోం మంత్రి వంగలపూడి అనిత, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ యాదవ్
- సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు





మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రజా వినతుల పరిష్కార వేదిక నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వారి నుంచి హోం మంత్రి వంగలపూడి అనిత, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీయాదవ్ వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేశారు.

కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామానికి చెందిన మహంకాళమ్మ అర్జీ... నా భర్తకు తల్లి నుంచి గిఫ్ట్ సెటిల్మెంట్ ద్వారా వచ్చిన 4 సెంట్ల ఇంటి స్థలం ఉంది. (డాక్యుమెంట్ నెం.1382/2023). దీనికి సంబంధించి అన్ని సరిహద్దులూ స్పష్టంగా ఉన్నాయి. ఈ స్థలాన్ని చర్చి నిర్మాణానికి తమకు అమ్మాలని బంధువులైన ఏకుల పద్మావతి, ఆమె కుమారులు అడగ్గా ఇది అమ్మేది కాదని నా భర్త నిరాకరించారు. అప్పటి నుంచీ ఆయన వికలాంగుడనే విషయాన్ని ఎత్తి చూపుతూ దారుణంగా దూషించడం మొదలుపెట్టారు. 2024 ఏప్రిల్ 5న సదరు స్థలంలో అక్రమంగా రాళ్లు పాతడాన్ని అడ్డుకున్నందుకు.. మచిలీపట్నం వీఆర్వోగా పనిచేస్తున్న సతీష్, అతని సోదరులు శ్రీకాంత్, శ్యామ్ కలిసి నా భర్తను ఈడ్చికొట్టారు. అడ్డువచ్చిన నన్ను కూడా జుట్టు పట్టుకుని, అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. రెవెన్యూ విభాగంలో నాకున్న పట్టుతో వీఆర్వో సతీష్ మోసపూరిత మార్గంలో భీమవరంలో అదే స్థలానికి డబుల్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు ఈసీ ద్వారా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ప్రభుత్వంలో రాజకీయ ఒత్తిళ్లతో మాపై కేసు నమోదు కాకుండా అడ్డుకున్నారని, "నేను వీఆర్వోని.. నాకు అందరూ తెలుసు, మీ భూమిని ఎలా కాజేయాలో నాకు తెలుసు" అంటూ సతీష్ బహిరంగంగా బెదిరిస్తున్నాడు. వారిపై చర్యలు తీసుకోవాలి.

వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్లకు చెందిన లక్షుమ్మ వినతి... నా భర్త ద్వారా సంక్రమించిన 0.95 సెంట్ల భూమి సర్వే నెం.34లో ఉంది. కాశినాయన దేవుని గర్భగుడి కట్టిస్తామని, బ్యాంకు లోన్ ఇప్పిస్తామని నమ్మబలికి వేములపాడుకు చెందిన కర్నాటి బలరామిరెడ్డి, కర్నాటి రంగమ్మ నాతో అగ్రిమెంట్ చేయించుకున్నారు. నాకు తెలియకుండానే దొంగ పత్రాలు సృష్టించి భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ భూమిని కలసపాడుకు చెందిన ఒక వ్యక్తికి అమ్మకానికి పెట్టి రూ. 24లక్షలు అడ్వాన్స్ కూడా తీసుకున్నారు. ఈ మోసం బయటపడినప్పుడు అడగ్గా వైసీపీ నాయకులు విశ్వనాథరెడ్డి, మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి వచ్చి డబ్బులు ఇస్తామని నమ్మబలికారు. కానీ ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా, దేవాలయం కట్టకుండా మోసం చేశారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు వినతి... సర్వే నెం.328/6లో ఉన్న 0.49 సెంట్ల భూమి నాకు వారసత్వంగా వచ్చింది. మా గ్రామానికే చెందిన దాసరి వెంకయ్య, రఘురామయ్య ఈ భూమిని అక్రమంగా వారి పేరు మీద ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అక్రమంగా పత్రాలు సృష్టించడమే కాకుండా కోర్టు నుంచి ఇంజంక్షన్ ఆర్డరు తెచ్చుకుని నా కోళ్ల ఫారాన్ని బుల్డోజర్‌తో ధ్వంసం చేయించారు. సాక్ష్యాధారాలు లేకుండా చేయాలనే కుట్రతోనే ఈ పనికి పాల్పడ్డారు. వారు సమర్పించిన నకిలీ పత్రాలను పరిశీలించిన గౌరవ న్యాయస్థానం ఆ కేసును డిస్మిస్ చేసింది. అయినప్పటికీ వారు వెనుకుండి మరికొందరి ద్వారా మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం చిరుమామిళ్ళ గ్రామానికి చెందిన కత్తి శంకరరావు అర్జీ... అన్నవరపు శ్రీనివాసరావు వద్ద మోడల్ స్కూల్ పక్కన ఒక స్థలాన్ని కొనుగోలు చేసి హద్దు రాళ్లు వేయించాను. మార్చి 2న తొగటి నరసింహారావు అనే వ్యక్తి ఆ హద్దు రాళ్లను పీకి వేయడంతో వివాదం మొదలైంది. స్థలం కొన్నందుకు తనను బూతులు తిడుతూ ఊరిలోకి వచ్చి కొనడం ఏంటి?" అంటూ కులం పేరుతో అసభ్యకరంగా దూషించారు. నరసింహారావు నాతో పాటు రౌడీషీటర్ సింగారెడ్డి కోటిరెడ్డి, దంతం నాగేశ్వరరావులను మారణాయుధాలతో రప్పించి నాపై దాడికి ప్రయత్నించారు. నీవు ఊరిలో బతకకూడదు, మరో కారంచేడును చూపిస్తాము అంటూ ప్రాణాలు తీస్తామని నన్ను వెంబడించారు. ఎస్సీ, ఎస్టీ కేసు పెడితే చంపేస్తామని హెచ్చరించారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం పాలగుమ్మి గ్రామానికి చెందిన తరంగిణి వినతి... నన్ను ప్రేమ పేరుతో వంచించి గర్భవతిని చేసి అబార్షన్ చేయించిన కట్టా ధన మహేష్‌పై ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఘటనపై ఈ ఏడాది ఫిబ్రవరి 8న రాజోలు పోలీస్ స్టేషన్‌లో కేసు (జతీఱఎవ చీశీ: 39/2026) నమోదై 60 రోజులు గడిచినా నిందితుడిని అరెస్టు చేయలేదు. పోలీస్ శాఖలో ఉన్న అతగాడి బంధువుల అండతో ఎస్ఐ, సీఐలు దర్యాప్తును కాలయాపన చేస్తున్నారు. కేసు వెనక్కి తీసుకోవాలని నాపై ఒత్తిడి తెస్తున్నారు.

ఏలూరు జిల్లా కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన వరప్రసాద్ వినతి... మా గ్రామంలో సర్వే నెం.400/3లో ఉన్న 1.50 సెంట్ల భూమికి పూర్వం నుంచీ దారి ఉంది. అయితే పక్కనే భూమి కొన్న ఆరుమళ్ళ దుర్గారావు, ఆరు మళ్ళ మహేష్ రాజకీయ పలుకుబడితో ఆ దారిని మూసివేశారు. దారి గురించి ప్రశ్నించిన నాపైన, నా భార్యపైన వారు దాడికి పాల్పడ్డారు. దీనిపై తడికలపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కలెక్టర్, ఆర్డీవో, రెవెన్యూ అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేదు. దారి లేకపోవడంతో పంటను బయటకు తెచ్చుకోవడానికి వీలు పడట్లేదు. వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్న మా కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది.

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి మండలం మద్దూరుపాడు మజరా సిరిపురం గ్రామానికి చెందిన జక్కంపూడి మోహన్‌రావు వినతి... సర్వే నెం. 323(ఎ)లో 1.12 ఎకరాలు, సర్వే నెం. 323(సి)లో 0.12 ఎకరాలు నా పేరిట రెవెన్యూ రికార్డుల్లో స్పష్టంగా ఉన్నాయి. గత ఏడు సంవత్సరాలుగా నేను అనారోగ్యం వల్ల, ఉపాధి నిమిత్తం దూర ప్రాంతంలో ఉండటాన్ని అదునుగా తీసుకుని మా గ్రామానికే చెందిన జక్కంపూడి తిరుమలరావు అనే వ్యక్తి నాకు చెందిన 11 సెంట్ల భూమిని ఆక్రమించుకున్నాడు. పొలానికి వెళ్లే పూర్వీకుల నాటి బండ్ల బాటలో జామాయిల్ చెట్లు వేసి, ట్రాక్టర్లు కూడా వెళ్లకుండా దారిని పూర్తిగా మూసివేశారు. నా భూమి కోసం నిలదీస్తే దుర్భాషలాడుతూ శారీరక దాడులకు దిగుతామని బెదిరిస్తున్నాడు.

ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన వహిద అర్జీ... మార్చి 24న ఎస్‌కే షబాన అనే స్నేహితురాలి ఫిర్యాదు విషయంలో తోడుగా వెళ్లిన నన్ను సీఐ ఆయన ఛాంబర్‌లోకి పిలిచి, "నువ్వు ఎందుకు వచ్చావు?" అంటూ అందరిముందూ అసభ్య పదజాలంతో దూషించారు. హక్కుల గురించి ప్రశ్నించగా నా భర్త అంధుడనే విషయాన్ని ప్రస్తావిస్తూ సీఐ అత్యంత నీచంగా, అమానవీయంగా మాట్లాడారు. ఇది 'దివ్యాంగుల హక్కుల చట్టం 2016'కు పూర్తి విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిని పిలిచి నన్ను వీడియోలు తీయమని, స్టేషన్ నుంచి నెట్టివేయమని సీఐ ఆదేశించారు.

శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం గండివారిపల్లి గ్రామానికి చెందిన ప్రభావతి వినతి... మా గ్రామంలోని సర్వే నెంబర్లు 598/2, 609, 602/4, 610/2, 629, 630/1, 631, 671/2, 695, 974లో మొత్తం సుమారు 7 ఎకరాల భూమి నా తండ్రి పేరిట ఉంది. ఆయన చనిపోయిన తర్వాత ఆ ఆస్తి ముగ్గురు పిల్లలకు సమానంగా చెందాల్సి ఉండగా... సోదరుడు ఆస్తిని పంచకుండా ఇతరులకు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఇప్పటికే అతడి పేరిట పట్టా పుస్తకాలు పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు.

పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన లక్ష్మి అభ్యర్ధన... షేక్ జానపాటి మస్తాన్‌బీ వద్ద 89 చదరపు గజాల ఇంటిని నా కుమారుడు ప్రశాంత్ 2015 జూలై 6న చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ సమయంలో ఇల్లు ఖాళీ చేయడానికి నాలుగు నెలల గడువు కోరగా మానవత్వంతో అంగీకరించాం. గడువు ముగిసినా ఇల్లు ఖాళీ చేయకుండా, పైగా నెలకు రూ. 5వేలు అద్దెను మస్తాన్బీ వసూలు చేసుకుంటూ గడువు పొడిగిస్తూ వచ్చారు. ఇంటికి వెళ్లి అడిగితే "కిరోసిన్ పోసి తగలబెడతాం" అని బెదిరింపులకు పాల్పడుతున్నారు. పెద్ద మనుషుల సమక్షంలో రెండుసార్లు పంచాయితీ నిర్వహించినా ఆమె ప్రవర్తనలో మార్పు రాలేదు. ప్రక్కనే ఉన్న అమీరున్నీసా బేగం ద్వారా కుదిరిన రాజీ ప్రకారం.. ఆ ఇంటికి సంబంధించి రూ.10 లక్షలు ముట్టినట్లు అగ్రిమెంట్ చేయించుకున్నారు. అందులో భాగంగా రూ.4 లక్షలు అకౌంట్‌లో జమ అయ్యాయి. మిగతా మొత్తానికి చెక్కులు, ప్రామిసరీ నోట్లు కూడా ఇచ్చారు. అయితే డబ్బు తీసుకున్న అరగంటకే మస్తాన్బీ మళ్ళీ మాట మారుస్తూ "ఇల్లు ఖాళీ చేయను, డాక్యుమెంట్లు నా దగ్గరే ఉన్నాయి" అని వాదనకు దిగారు.

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం తెరువపల్లికి చెందిన జయలక్ష్మి వినతి... నా అత్తమామలకు చెందిన సుమారు 4 ఎకరాల 50 సెంట్ల భూమి ఉంది. వారు మరణించిన తర్వాత ఆ ఆస్తిపై నలుగురు కుమారులకు, ఇద్దరు కుమార్తెలకు హక్కు ఉంది. ప్రస్తుతం ఆ ఆస్తి ముగ్గురి ఆధీనంలో ఉంది. ఆస్తిని పంచమని అడిగినందుకు నాపైన, నా భర్తపైన పిల్లలపైన గతంలో చాలా సార్లు భౌతిక దాడులు చేయించి కొట్టించారు. ఈ విషయంలో పెద్దలు మందలించినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. భూమి కోసం కక్ష గట్టిన వారు మా కుటుంబాన్ని అంతమొందించాలనే క్రూరమైన ఉద్దేశంతో మాకు ఆహారంలో విషం ఇచ్చి చంపడానికి కూడా ప్రయత్నించారు. వారిపై చర్యలు తీసుకోండి.

## నర్సీపట్నంలో సియట్ టైర్ల కంపెనీ

- 200 ఎకరాలు కావాలని కోరిన ప్రతినిధులు
- అధికారులతో కలిసి భూముల పరిశీలన

నర్సీపట్నం(చైతన్యరథం): నర్సీపట్నం నియోజకవర్గంలోని మాకవరపాలెం మండలంలో మరో భారీ కంపెనీ ఏర్పాటు కానుం ది. ప్రముఖ టైర్ల ఉత్పత్తిదారు అయిన 'సియట్ టైర్స్' రాచపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 737లో 200 ఎకరాలు అవసరమని దరఖాస్తు చేసుకుంది. దీంతో ఏపీఐఐసీ అధికారులు, సియట్ టైర్స్ కంపెనీ ప్రతినిధులు ఇక్కడకు వచ్చి భూములను, మ్యాపులను పరిశీలించారు. రాచపల్లి సర్వే నంబరు 737లో వున్న ఎరకన్నపాలెం, రామన్నపాలెం, వెంకయ్యపాలెం గ్రామాల్లో 406.85 ఎకరాలను రెవెన్యూ శాఖ నుంచి ఇటీవల ఏపీఐఐసీ అధికారులు తీసుకున్నారు. ఇందులో 150 ఎకరాలను డోజ్కో కంపెనీకి, 20 ఎకరాలను ఎంఎస్ఎంఈ పార్కుకు కేటాయించా రు. ఇంకా సుమారు 240 ఎకరాలు మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో సియట్ టైర్ల కంపెనీ ఏర్పాటుకు 200 ఎకరాలు అవసరమని ఆ కంపెనీ యాజమాన్యం కోరింది. దీంతో తహశీల్దారు, సియట్ టైర్ల కంపెనీ ప్రతినిధులు ఇక్కడకు వచ్చి భూములను పరిశీలించారు. మిగిలిన సుమారు 40 ఎకరాలను ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీకి కేటాయిస్తామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ తెలిపారు.



## ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంతో పనులు

**● విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో రూ.2.39 కోట్లతో అభివృద్ధి పనులకు ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గణబాబు శ్రీకారం**



విశాఖపట్నం పశ్చిమ (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని 52, 89 మరియు 90 వార్డులలో సుమారు 2.39 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీభరత్, ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు బుధవారం ఘనంగా ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించే లక్ష్యంతో ఈ పనులను పూర్తి చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. 52వ వార్డులోని వుడా కాలనీలో రూ.23 లక్షలతో నిర్మించిన స్వర్ణ వార్డు కార్యాలయ భవనం మరియు రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ అదనపు అంతస్తును ప్రారంభించారు. 90వ వార్డు: కనకమహాలక్ష్మి నగర్‌లో రూ.13.45 లక్షల వ్యయంతో నిర్మించిన పబ్లిక్ పార్కు మరియు రూ.32.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. కాకాని నగర్‌లో రూ.35 లక్షలతో నిర్మించిన మహిళా భవనం మరియు ఏఎస్ఆర్ నగర్‌లో రూ.18 లక్షల వ్యయంతో ఆధునీకరించిన పబ్లిక్ పార్కును ప్రజలకు అంకితం చేశారు. 89వ వార్డు: కొత్తపాలెంలో రూ.19.6 లక్షల వ్యయంతో పబ్లిక్ పార్కు మరియు రూ.49.80 లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. సంతోష్ నగర్‌లో రూ.19.90 లక్షలతో ముస్లిం కమ్యూనిటీ హాల్ మరియు రూ.19.85 లక్షలతో కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తును ప్రారంభించారు. ఆదర్శ్ నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన విశ్వబ్రాహ్మణ (కంశాలి) కమ్యూనిటీ హాల్‌ను ఎంపీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ... పశ్చిమ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ... ప్రజల అవసరాలకు అనుగుణంగా వార్డులలో పార్కులు మరియు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో APUFIDC డైరెక్టర్ అంగ ప్రశాంతి, స్థానిక నాయకులు బొడ్డేటి విజయ్, వై తిరుమలరావు, వి చంద్రశేఖర్, బొమ్మిది రమణ, ప్రసాద్, అరుణ్, దాడి రమేష్, కూటమి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు నాయకులు, నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.

## నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత



కురుపాం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం రేగిడి గ్రామంలో బుధవారం నాడు "నీటి భద్రత -- సాగు నీటి సంఘాల బాధ్యత" అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నీటి వనరుల సంరక్షణలో సాగు నీటి సంఘాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఏప్రిల్ 6 నుండి జూలై 5 వరకు నిర్వహించే ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా చెరువుల పునరుద్ధరణ, పూడికతీత, భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇది నీటి భద్రత కోసం ప్రభుత్వం చేపట్టిన జలయజ్ఞమని, ప్రజల భాగస్వామ్యంతో సాగునీటి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని స్పష్టం చేశారు. రైతులకు సమయానికి సాగునీరు అందేలా అధికారులు, నీటి సంఘాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, అరకు పార్లమెంట్ సహాయ కార్యదర్శి తాడంగి రామారావు, నిమ్మక సింహాచలం, తాడంగి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ కె.కృష్ణారావు, సీతారాం, పురుషోత్తం, రమేష్, కృష్ణారావు, శంకర్రావు, చిన్నికృష్ణ, మురళి, బలరాం, రంజిత్, నీటి సంఘం అధ్యక్షులు టి. మిన్నారావు, జలవనరుల శాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టమొచ్చినట్టు రోడ్లు తవ్వేస్తారా! అండర్ గ్రౌండ్ కేబుల్ పనులపై గంటా ఆగ్రహం




మధురవాడ (చైతన్యరథం): ఇష్టం వచ్చినట్టు రోడ్లు తవ్వేసి వదిలేస్తారా! మీ నిర్వాకానికి ప్రజలందరూ ఇబ్బంది పడుతూ ఉండాలా!? అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ కాంట్రాక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎం పాలెంలో విద్యుత్ కేబుల్స్ కోసం గొయ్యిలు తీసి వదిలేసిన ప్రాంతాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. నగరంలో కేబుల్స్ కోసం తవ్వేసిన గోతులను నెలల తరబడి వదిలేస్తున్నారని, ప్రజలు నడవడానికి.. వాహనాల మీద వెళ్లడానికి అష్టకష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. 15 రోజుల్లో పూడ్చగలిగితేనే గోతులు తీయాలని, ఊరంతా తవ్వి నచ్చినప్పుడు పనులు పూర్తి చేస్తామంటే కుదరదని స్పష్టం చేశారు. సామర్థ్యాన్ని మించి పనులు ప్రారంభిస్తే ఇలానే ఉంటుందని అసహనం వ్యక్తం చేశారు. పీఎం పాలెంలో గొయ్యి తవ్వి నెల రోజులు దాటిపోయిందని, ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇష్టానుసారం తవ్వేసి వదిలేసినా.. గొయ్యి సరిగా కప్పకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలను ఇబ్బందుల పాల్జేస్తున్న ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలని జీవీఎంసీ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడును.. ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం నాయుడును ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్ కుమార్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, మాన్యాల సోంబాబు, గరే గుర్నాథ్, లొడగల అప్పారావు, జానకిరామ్, కానూరు అచ్యుతరావు, పాసి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి పేరుపై అనవసర వ్యాఖ్యలు - ప్రజల విశ్వాసాలపై దాడి

**● చంద్రబాబు, లోకేష్ నేతృత్వంలో అమరావతి శాశ్వత రాజధానిగా రూపుదిద్దుకుంటుంది**

**● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్**



అమరావతి (చైతన్యరథం): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పులివెందుల ఎమ్మెల్యే వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఇటీవల నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర రాజధాని అమరావతి పేరును మార్చాలని సూచిస్తూ "మావిగన్" అనే పేరును ప్రస్తావించడం రాజకీయ, సామాజిక వర్గాల్లో హాస్యాస్పదంగా మారిందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు డా. కొండారెడ్డి నరహరి వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి అనేది కేవలం ఒక రాజధాని నగరం పేరు మాత్రమే కాదని, అది ఆధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక ప్రాముఖ్యత కలిగిన పవిత్ర నామమని నరహరి వరప్రసాద్ వివరించారు. పురాణాలలో దేవతల రాజధానిగా గుర్తింపు పొందిన ఈ పేరును వ్యంగ్యంగా మార్చాలని ప్రయత్నించడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రజల విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిన పేర్లను తేలికగా తీసుకోవడం ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను ప్రస్తావిస్తూ, హిందూ సంప్రదాయాల పట్ల గౌరవం చూపడంలో వైసీపీ ప్రభుత్వం వైఫల్యమైందని ఆయన విమర్శించారు. జగన్ రెడ్డి తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి ప్రసాదం స్వీకరించకపోవడం, తీర్థం తీసుకుని క్రిందపడవేయడం లాంటి ఘటనలను ఉదాహరణగా పేర్కొన్నారు. ఇవి చిన్న విషయాలుగా కనిపించినప్పటికీ, కోట్లాది మంది భక్తుల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలని ఆయన తెలిపారు. ఇలాంటి చర్యలు ప్రజల్లో అనుమానాలను కలిగించాయని అన్నారు. అమరావతి అనే పేరుకు ఉన్న అర్థాన్ని వివరించిన ఆయన, "అమరావతి అంటే అమరుల నివాసం, దేవతల రాజధాని" అనే భావనతో అనుసంధానమై ఉందని చెప్పారు. ఇలాంటి పవిత్ర నామాన్ని మార్చాలని సూచించడం కేవలం రాజకీయ నిర్ణయం కాదు, ఒక సంస్కృతిని తక్కువ చేసి చూపించే ప్రయత్నంగా భావించాల్సి వస్తుందని అభిప్రాయపడ్డారు.

## మంత్రి సంధ్యారాణి అధ్యక్షతన జీసీసీ సమీక్షా సమావేశం

**● గిరిజన ఉత్పత్తులకు సరైన ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన**



విశాఖపట్నం (చైతన్యరథం): గిరిజన రైతులు సేకరించే అటవీ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు, డి.ఆర్. డిపోలు సమర్థంగా పనిచేయాలన్నారు. గిరిజనుల వద్ద కొనుగోలు చేసిన వస్తువులకు ఆన్ లైన్ ద్వారా డబ్బులు జమ చేయాలని, అప్పుడే పారదర్శకత పెరుగుతుందని సూచించారు. నేడు జీసీసీ వల్లే అరకు కాఫీకి మంచి బ్రాండ్ వచ్చిందని, కాఫీ కొనుగోలు పెంచి రైతులను ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా జీసీసీలో పనిచేస్తున్న 33 మంది సేల్స్ మెన్‌లకు జూనియర్ అసిస్టెంట్‌లుగా ప్రమోషన్లు మంజూరు చేశామని, గిరిజన రైతులకు ఆర్థిక భద్రత, మార్కెట్ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, మార్కెటింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధిపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు. గిరిజన కుటుంబాల ఆదాయాన్ని పెంచే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జీసీసీ ఛైర్మన్ కిదారి శ్రావణ్, వీణ శోభిక తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం ఆధునిక సదుపాయాలు అందించడం మా ప్రధాన లక్ష్యం: కిమిడి నాగార్జున



విజయనగరం (చైతన్యరథం): జిల్లాలో రైతులకు ఆధునిక వ్యవసాయ పరికరాలను అందించటమే లక్ష్యమని విజయనగరం జిల్లా డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం మినిస్ట్రీ ఆఫ్ పవర్ అనుబంధ సంస్థ ఈఈఎస్ఎల్ (EESL) ప్రతినిధులతో డిసిసిబి కార్యాలయంలో నాగార్జున సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో డిసిసిబి – ఈఈఎస్ఎల్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందాలు (MOU\T) చేసుకున్నామని తెలియజేసారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ... రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలను డిసిసిబి మరియు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (సొసైటీలు) ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరికరాల వినియోగంతో రైతుల ఖర్చులు తగ్గి, ఉత్పాదకత పెరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు సాంకేతిక పరిజ్ఞానం చేరువ చేయడం, వ్యవసాయ రంగంలో ఆధునీకరణ తీసుకురావడం లక్ష్యంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఈఈఎస్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ అనిల్ కుమార్ చౌదరి, డిసిసిబి సీఈఓ జప్ప, ఉమామహేశ్వరరావు, జనరల్ మేనేజర్లు వాసు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

# ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది : ఎమ్మెల్యే ముప్పిడి



తాళ్లపూడి (చైతన్యరథం): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని మలకపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో పాటు ధాన్యం లోడుకు జెండా ఊపి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కలెక్టర్ కీర్తి చేకూరి ప్రారంభించారు. నవధాన్యాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. టీబీ వ్యాధిపై అవగాహన కల్పించే గోడపత్రికలను ఆవిష్కరించారు. పెద్దేవంలోని చెరువును బాగుచేయాలని గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్ కీర్తికి వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గత ఏడాది ముఖ్యమంత్రి చంద్రబాబు మలకపల్లి గ్రామానికి వచ్చినప్పుడు పలు అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సరిపడా గోనెసంచులు, సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో 68 సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 4,704 మంది దరఖాస్తు చేసుకున్నారని.. దశల వారీగా యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పెద్దేవం గ్రామానికి చెందిన ఒకరికి సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

# బందరు మున్సిపాలిటీకి పూర్వ వైభవం సాధించాలి

- ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి
- అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు
- మచిలీపట్నం మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (చైతన్యరథం): మున్సిపాలిటీకి పూర్వ వైభవం సాధించేలా అధికారులు, ప్రజలు కలిసి పని చేయాలని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం మున్సిపాలిటీ కార్యాలయంలోని పలు విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల గురించి అధికారులను ఆరా తీశారు. మున్సిపాలిటీ పరిధిలో 108.7 కి.మీల డ్రైనేజీ ఉండగా అందులో 122 గ్యాప్స్ గుర్తించాం. వాటిని పరిష్కరిస్తే డ్రైనేజీ సమస్య పరిష్కరించినట్లేనని అధికారులకు సూచించారు. అమృత్ పథకంలో ఇళ్ల మధ్యనున్న డ్రైన్లను కూడా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలి. మచిలీపట్నంలోని మురుగు నీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలి. మురుగు నీటిని బయటకు పంపించేలా రూ.13 కోట్లతో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నాం. తాగునీటి పైపులైన్ల మరమ్మతులు, అభివృద్ధి కోసం రూ.15 కోట్లు నిధులు కేటాయించారు. వాటిని సద్వినియోగం చేసుకుందాం. గతంలో వాటర్ హౌస్ వద్ద కొంత మంది గంజాయి తాగి తాగునీటి వ్యవస్థను నాశనం చేశారు. అలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా చెత్త పేరుకుపోయినా కూడా మున్సిపల్ కార్యాలయం నుండే పరిశీలించేలా సన్నాహాలు చేస్తున్నాం. మచిలీపట్నంలో 12 వేలకు పైగా వీధి దీపాలున్నాయి.

వాటి నిర్వహణ, పార్కుల అభివృద్ధి, శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రజలు కూడా బాధ్యత తీసుకోవాలి. పన్నుల చెల్లింపులో బాధ్యతగా వ్యవహరించాలి. మున్సిపాలిటీకి రూ.24 కోట్ల మేర బకాయిలు ఉన్నాయి. మన మున్సిపాలిటీని మనమే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 1864లో ఏర్పడిన మున్సిపాలిటీ మన మచిలీపట్నం. అలాంటిది ప్రస్తుతం అభివృద్ధిలో వెనుకబడిపోయింది. రాష్ట్రంలో 42వ స్థానంలో ఉండడం బాధాకరం. మచిలీపట్నం మున్సిపాలిటీని అభివృద్ధి బాటలో నడిపించేందుకు అధికారులకు ప్రజలు సహకరించాలి. మున్సిపాలిటీని అభివృద్ధిలో రాష్ట్రానికి మోడల్‌గా మార్చేందుకు తోడ్పాటు అందించాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.

# మహిళల గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

- తల్లిని, చెల్లిని గెంటేసి నీతులు చెబుతారా? : గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మండిపాటు



గుంటూరు (చైతన్యరథం): తల్లిని, సొంత చెల్లిని అవమానపరిచిన జగన్ మహిళల గురించి మాట్లాడటం, నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు. బుధవారం ఉదయాన్నే గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని వినోభానగర్, రెడ్ల బజార్, మారుతీనగర్, నందివెలుగు ఫ్లైఓవర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. కనీస అవగాహన లేకుండా రాజధాని ప్రాంతాన్ని మావిగన్ పేరిట పిచ్చి ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు. వైసీపీ సైకోసైన్యం రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై దాడులు చేయడం వైసీపీ విపరీత మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. అమరావతి రాజధాని పేరులోనే వైబ్ ఉందని, ప్రపంచమే మెచ్చిన ప్రాంతమని స్పష్టం చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, కానీ అధికార యంత్రాంగం బాధ్యతగా పని చేయాలని అన్నారు. సచివాలయ సిబ్బందిలో కొంత జవాబుదారీతనం లోపించిందని, దీనిని సరిదిద్దుకోవాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు ఏ అవసరమొచ్చినా కూటమి నాయకులు నా దృష్టికి తీసుకురావాలని, 24 గంటలపాటు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల కాలంలో నందివెలుగు ఫ్లైఓవర్ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం తట్టమట్టి కూడా వేయలేదని మండిపడ్డారు.

# సోలార్ మోడల్ విలేజ్‌గా మలకపల్లి గ్రామం ఎంపిక

తాళ్లపూడి (చైతన్యరథం): జిల్లాలోని మలకపల్లి గ్రామం 'సోలార్ మోడల్ విలేజ్ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. కోటి ప్రత్యేక గ్రాంట్ మంజూరవడం గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మండలంలోని మలకపల్లిలో బుధవారం జరిగిన ఎస్సీ, ఎస్టీ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ఉత్సవ్ కార్యక్రమానికి కలెక్టర్ కీర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామానికి వచ్చిన నిధులతో పీహెచ్సీ, పాఠశాలలు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా అవసరాల ఏర్పాటుకు వినియోగించుకోవచ్చన్నారు. భవిష్యత్తులో విద్యుత్తు ఖర్చు గణనీయంగా తగ్గి, ఆ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉందన్నారు.

# వైసీపీ లాంటి పార్టీ రాష్ట్రంలో ఉండకూడదు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీని నామరూపాలు లేకుండా చేయాలి
- శాసన మండలి మాజీ చైర్మన్ ఎం.ఏ షరీఫ్ పిలుపు



వన్‌టౌన్ (విజయవాడ) : వైసీపీ వంటి అరాచక పార్టీ రాష్ట్రంలో ఉండకూడదని శాసన మండలి మాజీ చైర్మన్, ప్రభుత్వ సలహాదారులు ఎం.ఏ షరీఫ్ అన్నారు. తమ సొంత ప్రయోజనాల కోసం ప్రజల ప్రయోజనాలను దోచుకునేందుకు కూడా వైసీపీ నాయకులు వెనుకాడదన్నారు. ఆ విషయంలో ఆ పార్టీ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి దిట్ట అన్నారు. అటువంటి పార్టీ రాష్ట్రంలో ఉంటే రాష్ట్ర అభివృద్ధికి విఘాతమని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని నామరూపాలు లేకుండా చేసే సత్తా ప్రజలకే ఉందన్నారు. వైసీపీ మూడు ముక్కలాటకు శాశ్వత తెరదించేలా టీడీపీ శ్రేణులు అందరూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కూటమి పార్టీ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని గణపతిరావు రోడ్డులో గల విజయవాడ పార్లమెంటు సభ్యుని క్యాంపు కార్యాలయంలో షరీఫ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ... రాష్ట్రాభివృద్ధికి రాజధాని నిర్మాణమే ప్రాణాధారమని, గత వైసీపీ ప్రభుత్వం తనస్వార్థ రాజకీయాల కోసం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా వ్యవహరిస్తూ వైసీపీ ఆడిన 'మూడు రాజధానుల' నాటకానికి ప్రజలే గత ఎన్నికల్లో చరమగీతం పాడారని అన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అమరావతి రాజధానిగా ఉండాలని అసెంబ్లీ సాక్షిగా ఓటు వేసిన వైసీపీ, అధికారంలోకి రాగానే మూడు ముక్కల ఆట మొదలుపెట్టిందని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే రాజధాని నిర్మాణం అత్యవసరమని, కానీ గత ప్రభుత్వం ఆ ప్రక్రియను పూర్తిగా విచ్ఛిన్నం చేసిందని ధ్వజమెత్తారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపాకు ఒక్క సీటు కూడా రాకుండా ప్రజలు బుద్ధి చెప్పాలని, తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఐక్యమత్యంతో పనిచేయాలని ఈ సందర్భంగా షరీఫ్ పిలుపునిచ్చారు. వైసీపీకి రాజకీయ సమాధి కట్టడమే ఆ పార్టీకి తగిన రీతిలో రాష్ట్ర ప్రజలు గుణపాఠం చెప్పడం అన్నారు.

# టీడీపీ నేత వల్లభనేని బాబురావును పరామర్శించిన ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వల్లభనేని బాబూరావును విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ బుధవారం పరామర్శించారు. అనారోగ్య కారణాలతో పటమటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాబూరావును ఎంపీ పరామర్శించి వైద్య చికిత్స అందుతున్న తీరు, ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వెంట టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొప్పన భవకుమార్, టి.ఎన్.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి పొట్లూరి దర్శిత్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి సొంగా సంజయ్ వర్మ తదితరులు ఉన్నారు.

# మై టీడీపీ యాప్ టాప్ కార్యకర్తలతో నారా లోకేష్ సమావేశం

- స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందిన పటాన్ హయత్ ఖాన్



విజయవాడ (చైతన్యరథం): మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో మై టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాచారాన్ని కింది స్థాయి వరకు చేరవేస్తున్న ఉత్తమ కార్యకర్తలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐదు లక్షల మంది మై టీడీపీ యాప్ సభ్యులలో టాప్-10 ర్యాంకుల్లో నిలిచిన కార్యకర్తలతో సమావేశమై వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పార్టీకి వారు అందిస్తున్న సేవలను అభినందిస్తూ మరింత చురుకుగా పనిచేయాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా విజయవాడ తూర్పు నియోజకవర్గానికి చెందిన పటాన్ హయత్ ఖాన్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించి ఈ సమావేశంలో పాల్గొనడం విశేషం. 61551 పాయింట్స్‌తో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన హయత్ ఖాన్‌ను మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా అభినందిస్తూ ఎన్టీఆర్ మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా హయత్ ఖాన్ మాట్లాడుతూ, తనకు ప్రతి విషయంలో ప్రోత్సాహం అందిస్తూ ముందుకు నడిపిస్తున్న విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కి, అలాగే ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధకి కృతజ్ఞతలు తెలిపారు.

# నూతన వంతెన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



బాపట్ల (చైతన్యరథం): నియోజకవర్గ పరిధిలోని బాపట్ల మండలం నాగరాజు కాలువపై అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నూతన వంతెన నిర్మాణ పనులను స్థానిక శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మరాజు బుధవారం పరిశీలించారు. 14 కోట్ల రూపాయల భారీ అంచనా వ్యయంతో ముత్తాయపాలెం నుండి కప్పలవారిపాలెం గ్రామాలను కలుపుతూ ఈ వంతెనను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించి, అధికారులకు మరియు కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ వంతెన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కాలం నాటి రవాణా కష్టాలు తీరుతాయని, ముత్తాయపాలెం - కప్పలవారిపాలెం మధ్య ప్రయాణ దూరం తగ్గడమే కాకుండా ఆర్థిక కార్యకలాపాలు కూడా మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

# టీడీపీ బలోపేతానికి పునాది మీరే...

## పలువురి సర్పంచులను సన్మానించిన ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



వినుకొండ (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీకి చెందిన సర్పంచుల పదవీకాలం పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సర్పంచుల సేవలను కొనియాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే మీరు గ్రామ సర్పంచులుగా, స్థానిక ప్రజా ప్రతినిధులుగా గెలిచి పార్టీని నిలబెట్టారని ఆయన ప్రశంసించారు. గత అధికార పార్టీ దౌర్జన్యాలను, అరాచకాలను మీరు ఎంతో ధైర్యంగా ఎదుర్కొని నిలిచారని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో అవమానాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా పార్టీకి కట్టుబడి పనిచేశారని గుర్తుచేశారు. గెలిచినా, ఓడినా పార్టీ జెండాను వదల్లేదని, పార్టీ బలోపేతం కోసం మీరు చేసిన త్యాగాలు మరువలేనివని అన్నారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, కూటమి ఘన విజయం సాధించడంలో మీ కృషి ఎంతో కీలకమని అభినందించారు. గ్రామ స్థాయిలో పార్టీ బలంగా నిలబడటానికి ముఖ్య కారణం సర్పంచులేనని స్పష్టం చేశారు.

**వచ్చే ఎన్నికల్లో నూటికి నూరు శాతం విజయం సాధిద్దాం**

అన్ని వర్గాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించడంలో టీడీపీ, కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో మీరు క్రియాశీలక పాత్ర పోషించి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమలవుతున్న 'సూపర్ సిక్స్' పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. టీడీపీకి స్థానిక నాయకత్వమే అసలైన బలమని, పార్టీ స్థాపన నుంచి నేటి వరకు గ్రామస్థాయి నాయకులే అండగా నిలిచారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ విధ్వంసకాండపై ప్రజల్లో ఆగ్రహం

**•తప్పుడు ప్రచారాలకు చెక్ పెట్టాలి... ప్రజల్లోకి నిజాలు తీసుకెళ్లాలి**



మంగళగిరి (చైతన్యరథం): వైసీపీ చేస్తున్న విధ్వంసకాండను ప్రజలు గమనిస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌ల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి మంచి కార్యక్రమాన్ని ప్రజలకు నేరుగా వివరించే బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి అంశాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. వైసీపీ దుష్ప్రచారాలతో నిండిపోయిందని ఆరోపించిన ఉమా, తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని నేతలకు సూచించారు. ప్రజల్లో అపోహలు తొలగించి నిజాలను తెలియజేయడం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ప్రధాన బాధ్యత అని అన్నారు. డిజిటల్ వేదికల వినియోగంపై కూడా ఆయన దృష్టి సారించారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో "మై టీడీపీ" యాప్‌ను తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకుని పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ చర్యలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా కట్టుదిట్టమైన ప్రణాళికతో ముందుకు సాగితే స్థానిక సంస్థల్లో కూటమి విజయం సాధ్యమని ఉమా ధీమా వ్యక్తం చేశారు.

# వైసీపీ దుష్ప్రచారాన్ని పట్టించుకోవద్దు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**•రాజకీయాలకు పనికిరాని అసమర్థులు మాటలకు సమాధానం చెప్పాల్సిన పనిలేదు**

**•కూటమిప్రభుత్వం ప్రజలకు మాత్రమే జవాబుదారు**



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణంపై వైసీపీ దిగజారుడు విమర్శలు చేస్తోందని, ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా అనుకూల మీడియాలో అసత్య ప్రచారం చేయిస్తోందని, ఐదేళ్లలో రాష్ట్రంపై అప్పులు, ప్రజలపై పన్నుల భారం మోపిన వారు, నేడు కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని తప్పుపట్టడం హాస్యాస్పదంగా ఉందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం ఆయన యడ్లపాడు మండలం జాలాది, ఉప్పరపాలెం గ్రామాల్లో పర్యటించి, రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి గ్రామస్తులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి ప్రసంగించారు.

**చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి ఢోకా ఉండదు..**

ప్రజల సంతృప్తి మేరకు మరింత సంక్షేమం, అభివృద్ధి చేయాలన్న సంకల్పం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, నిధుల కొరతవల్ల కొంత ఆలస్యమవుతోందన్నారు. పంచాయతీ నిధుల్ని అధికారులు, స్థానిక నాయకులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎక్కడా మారుమూల గ్రామంలో కూడా చిన్న రోడ్డు వేయని వారు.. నేడు పనిచేస్తున్న ప్రభుత్వాన్ని నిందిస్తున్నారని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు.

**జగన్.. వైసీపీ నేతల దుష్ప్రచారాన్ని పట్టించుకోవాల్సిన పనిలేదు**

మంచి నాయకత్వం ఉంటేనే ప్రజలకు మంచి జరుగుతుందని, జగన్.. వైసీపీనేతలు చేసే విషప్రచారాన్ని పట్టించుకోకుంటే, వారి నోళ్లే మూతపడతాయని ప్రత్తిపాటి చెప్పారు. వారు చేసే దుష్ప్రచారానికి స్పందిస్తూ పోతే, ఐదేళ్లు అదే సరిపోతుందన్నారు. నమ్మకంతో కూటమిపార్టీలను గెలిపించిన ప్రజలకు మాత్రమే తాము జవాబుదారులుగా ఉంటామని, రాజకీయాలకు పనికిరాని అసమర్థుల వ్యాఖ్యలను పట్టించుకోవాల్సిన పనిలేదని, వారికి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

## : విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం (చైతన్యరథం): ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు స్పష్టం చేశారు. విజయవాడలోని తన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన రూ. 8,86,387 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ) పత్రాలను అందజేశారు. వైద్యం కోసం ఆర్థిక సహాయం కోరిన ఐదుగురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరయ్యాయి. సూరంపల్లి గ్రామానికి చెందిన గోశాల కోటేశ్వరమ్మకు రూ. 3,50,000, బాపులపాడుకు చెందిన షేక్ సమీనాకు రూ.3,50,000, గజ్జల మోహన్ రామ్ కృష్ణకు రూ.70,000, రామవరప్పాడుకు చెందిన రుద్రపాటి డేవిడ్ ట్రూమన్ బాబుకు రూ.66,734, గన్నవరానికి చెందిన పెండెం చిట్టిబాబుకు రూ.49,653 మొత్తాల పోసి పత్రాలను ఎమ్మెల్యే చేతుల బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపద లో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట ఒక వరం లాంటిదని ఆయన చెప్పారు.

# అందరి సహకారంతోనే గుడివాడ అభివృద్ధి : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ (చైతన్యరథం): ప్రజలందరితో కలిసి కూటమి ప్రభుత్వ సహకారంతో గుడివాడ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఐక్యతతో ముందుకు వస్తే సులభంగా సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన చెప్పారు. గుడివాడ పట్టణం 27, 29 వార్డుల పరిధిలో గల బేతవోలులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుధవారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా పర్యటన వార్డులతో పాటుగా 26,30 వార్డుల పరిధిలో విస్తరించి ఉన్న బేతవోలు చెరువు చుట్టూ ఎమ్మెల్యే రాము ద్విచక్ర వాహనంపై కలియతిరిగారు. చెరువులో నీరు నింపకపోవడం వల్ల స్థానికంగా భూగర్భ జలాలు అడుగంటి పోయాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గతంలో చెరువులో నీటిని నింపే నార్త్ సైడ్ కాలువ పూర్తిగా పూడిక పోవడాన్ని గుర్తించారు. అవుట్ ఫ్లో అయిన చంద్రయ్య కాలువకు అనుసంధానంగా లాకులు నిర్మిస్తే తాజాగా చెరువులో నీరు నింపే అవకాశం ఉంటుందని స్థానిక పెద్దలు, అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే రాము తెలుసుకున్నారు. స్థానికులు ఏకాభిప్రాయంతో ముందుకు వచ్చి వినతి పత్రం అందిస్తే, డ్రాప్ నిర్మిస్తామని ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ... గత ప్రభుత్వం చేసిన తప్పులకు నేటికీ ప్రజలు మూల్యం చెల్లించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డుల్లో కనీస పనులు కూడా చేయకపోవడంతో, చిన్న సమస్యలే నేడు పెద్దవిగా మారాయన్నారు. ప్రతి ఒక్కరు సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలపైనే దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే రాము సూచించారు.

# కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్



తాడికొండ (చైతన్యరథం): ఫిరంగిపురం మండలం గుండాలపాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ మరియు మార్కెట్ యార్డ్ చైర్మన్ మొహమ్మద్ యాకోబు మరణించారు. యాకోబు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించిన నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్... అనంతరం పాడెమోసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. పార్టీకి యాకోబు చేసిన సేవలను ఎమ్మెల్యే శ్రావణ్ గుర్తు చేసుకున్నారు. యాకోబు కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి వందల కోట్ల నిధులు...

## అక్కడ రూ.490 కోట్లతో పనునలకు శ్రీరాం



సాలూరు (చైతన్యరథం): మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రూ. 490 కోట్లతో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. ఈ నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బడ్జెట్‌లో కేటాయించినట్లు ఆమె పేర్కొన్నారు. సాలూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్య రంగాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనులు సమర్థవంతంగా అమలు కావాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. రాజకీయ భేదాలను పక్కనబెట్టి అన్ని పార్టీలు కలిసి పనిచేస్తేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా "చెత్త నుండి సంపద" అనే లక్ష్యంతో రూపొందించిన ఆధునిక వ్యర్థ నిర్వహణ ప్రాజెక్టును మంత్రి ప్రారంభించారు. అత్యాధునిక యంత్రసామగ్రి ద్వారా తడి, పొడి చెత్తను వేరుచేసే యంత్రాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డితో కలిసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ యంత్రం ద్వారా చెత్తను సమర్థవంతంగా వర్గీకరించి, పునర్వినియోగం చేసే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు ఆదాయం కూడా సాధ్యమవుతుందని మంత్రి వివరించారు.

# పాసు పుస్తకాల పంపిణీ... రీసర్వే వేగవంతం చేయాలి : జేసీ



విజయనగరం (చైతన్యరథం): జిల్లాలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, రీ సర్వే, మ్యుటేషన్స్ వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో రెవెన్యూ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పట్టాదారు పాసు పుస్తకాలు, రీసర్వే, 22 ఏ భూములు, పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్, ఎస్.ఐ.ఆర్ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం, రీసర్వే వేగవంతం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఒక్క తప్పుకూడా లేకుండా పాసుపుస్తకాలను రూపొందించాలని, రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని స్పష్టం చేశారు. మ్యుటేషన్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని సూచించారు. రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాయింట్ ఎల్పీఎం సమస్యను జూన్‌లోగా పరిష్కరించాలని, రికార్డులు సరిచేయాలని తెలిపారు. రెవెన్యూ పిటిషన్లకు సంబంధించి తహసీల్దార్లు వ్యక్తిగతంగా హాజరు కావాలని వెల్లడించారు.

# యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

◆రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మంగళగిరి/అమరావతి : యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి, మరింత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పిలుపునిచ్చారు. ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. నాగార్జున యూనివర్శిటీలోని డాక్టర్ హెచ్.హెచ్.డైక్ మన్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవకాశాలపై ఒకరోజు అవగాహన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, అనంతరం మంత్రి సవిత ప్రసంగించారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు ఏర్పాటుపై అగ్రకులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు.

### ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు పెద్దపీట

దేశ పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రగామిగా నిలబెట్టడానికి సీఎ చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్లు కృషి చేస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కేవలం 22 నెలల కాలంలోనే ఏపీకి రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పార్కుల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసే పెట్టుబడి దారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తోందన్నారు. తక్షణ అనుమతులకు చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయులకు బీసీ సంక్షేమ శాఖ ద్వారా అండగా నిలుస్తామన్నారు. ఆసక్తి కలిగిన యువత డీపీఆర్‌లతో ముందుకొస్తే, చిన్న,మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు, ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తామని మంత్రి సవిత తెలిపారు.

### యువతకు చంద్రబాబు ప్రాధాన్యం

ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఒక రోజు సదస్సును ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన యువత, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతే భారత దేశ బలమని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. అందుకే సీఎం చంద్రబాబు అన్నింటా యువతకు ప్రాధాన్యమిస్తున్నారు. పారిశ్రామిక వేత్తలుగా మహిళలు రాణిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి సవిత తెలిపారు.

# మార్కాపురంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 16 రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా నేటి నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు జరగనున్నాయి. స్థానిక ఎస్వీకేపీ కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బుధవారం పోటీలను ప్రారంభించారు. ఎడ్ల ప్రదర్శనను చూసేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# మహిళల గౌరవం గురించి మాట్లాడే నైతికత వైసీపీకి లేదు

◆ తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి



కావలి (చైతన్యరథం): మహిళల గౌరవం, భద్రత, ఆత్మగౌరవం వంటి విలువల విషయంలో వైసీపీ చాలా కాలం క్రితమే తన నైతిక హక్కును కోల్పోయిందని రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి వ్యాఖ్యానించారు. మహిళలను కవచంగా పెట్టుకుని రాజకీయ డ్రామాలు ఆడటం వైఎస్ఆర్‌సిపి నాయకుల నిత్యకృత్యంగా మారిందని ఆమె మండిపడ్డారు. నిజంగా మహిళల పట్ల గౌరవం ఉంటే, గతంలో జరిగిన అవమానాలపై ఎందుకు ఒక్క మాట కూడా మాట్లాడలేదని ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా మహిళల గౌరవాన్ని తుంచిపారేసినప్పుడు నవ్వులు చిందించినవారే, ఇప్పుడు నకిలీ సెంటిమెంట్‌తో రోడ్లపైకి రావడం ప్రజలను మోసం చేసే చీప్ నాటకమని ఆమె తీవ్రంగా ఎద్దేవా చేశారు. నారా భువనేశ్వరిని, నారా బ్రాహ్మణిని, హోమ్ మంత్రి అనితని, అలాగే అమరావతి ఆడపడుచులను అవమానించినప్పుడు వైఎస్ఆర్‌సిపి మహిళా నాయకులు ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఆమె నిలదీశారు. కన్నతల్లి గురించి అసభ్య వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో దారుణమైన పోస్టులు వచ్చినప్పుడు మౌనం పాటించినవారు, ఇప్పుడు చిన్న పదాన్ని కారణంగా చూపించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేయడం వారి ద్వంద్వ వైఖరికి స్పష్టమైన ఉదాహరణ అని ఆమె విమర్శించారు. కేవలం 11 సీట్లు వచ్చినా కూడా వైఎస్ఆర్‌సిపి నాయకులకు బుద్ధి రాలేదని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. అమరావతిని రాజధానిగా కేంద్ర ప్రభుత్వం గుర్తించగానే, "జగన్‌కు మళ్లీ మావిగన్ గుర్తుకొచ్చింది" అంటూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు కొత్త డ్రామాలకు తెరలేపారని విమర్శించారు. ఆంధ్రజ్యోతిలో ఏదో రాసారనే కారణాన్ని అడ్డం పెట్టుకుని, రాష్ట్రంలో అసలు సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కావాలనే రచ్చ సృష్టిస్తూ, ఇప్పుడు మహిళల పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతున్నారని ఆమె తీవ్రంగా దుయ్యబట్టారు.

# పిల్లల పౌష్టికాహారంలో కోత విధిస్తే సహించేది లేదు

◆ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి (చైతన్యరథం): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. వెంకటగిరి పట్టణంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంట గదిని పరిశీలించి, విద్యార్థినులతో నేరుగా మాట్లాడి మధ్యాహ్న భోజనం నాణ్యత, కోడిగుడ్ల పంపిణీ గురించి ఆరా తీశారు. ఈ తనిఖీలో గుడ్ల పంపిణీలో భారీ వ్యత్యాసం ఉన్నట్లు ఎమ్మెల్యే స్వయంగా గుర్తించారు. మొదటి ఏజెన్సీ పరిధిలో 423 మంది విద్యార్థులకు గాను కేవలం 269 గుడ్లు మాత్రమే పెట్టారని, రెండవ ఏజెన్సీ పరిధిలో 153 మందికి గాను కేవలం 60 గుడ్లు మాత్రమే ఉడకబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు అందరూ పిల్లలు గుడ్డు తింటామని చెబుతున్నా, ఏజెన్సీలు మాత్రం సగం గుడ్లు మాత్రమే వండి, మిగతావి పక్కదారి పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రోజువారీగా ఏజెన్సీలు ఎంత మందికి భోజనం వండుతున్నారు, ఎన్ని గుడ్లు పెడుతున్నారు అని లెక్క చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ పై ఉందని ఎమ్మెల్యే గారు గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో లాగా ఇష్టారాజ్యంగా దోచుకుంటామంటే కుదరదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యార్థుల ఆరోగ్యం మరియు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, నాణ్యమైన సన్న బియ్యం, పౌష్టికాహారం అందిస్తుంటే, ఇలాంటి ఏజెన్సీలు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయని ఆయన తెలిపారు.

# నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి వాసంశెట్టి



పీఎం పాలెం (చైతన్యరథం): ఎండాడ, సాగర్ నగర్, మధురవాడ ప్రాంతాల్లో ఎమ్ కే - 1, బూరుగుపల్లి సాగర్ విల్లాల వద్ద జరుగుతున్న భవన నిర్మాణ పనులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అక్కడ కార్మికులకు యజమానులు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అన్ని రకాల భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. ఆయన వెంట ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ వి. మల్లికార్జున రావు, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ రామారావు, జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు మండలాల అధికారులతో గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం సమీక్ష



గుంతకల్లు (చైతన్యరథం): పట్టణంలోని ఎంపీడీవో ఆఫీస్ నందు మూడు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం, వారి సోదరుడు గుంతకల్లు మండల ఇన్‌ఛార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ... సర్పంచుల పదవీకాలం అయిపోవడంతో మూడు మండలాలకి స్పెషల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగిందని, మూడు మండలాల్లో ఏ చిన్న సమస్య ఉన్నా మీ దృష్టికి వచ్చిన వెంటనే మీరు స్పందించి ఆ సమస్యను పరిష్కరించే విధంగా చేయాలని మూడు మండలాల అధికారులకు తెలియజేశారు. అలాగే వేసవికాలం రావడం తోప్రజలను దృష్టిలో ఉంచుకుని ఏ ఒక్క గ్రామంలో నీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు. మండల అధికారులు మాట్లాడుతూ... మా దృష్టికి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే మేము స్పందించి పరిష్కరించే విధంగా చేస్తామని తెలియజేశారు. మూడు మండలాల నుంచి ఒక్క చిన్న నాయకులు కార్యకర్త వచ్చినా వారి సమస్యలు పరిష్కరించేలాగా చూస్తామని తెలియజేశారు. పరిష్కారం కానీ సమస్యలను మీ దృష్టికి తీసుకువస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాల అధికారులు గుంతకల్లు పట్టణం మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు మరియు అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పుట్టపర్తి మున్సిపాలిటీని కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం



పుట్టపర్తి (చైతన్యరథం): పుట్టపర్తి మున్సిపాలిటీనీ అందరం కలిసికట్టుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్దామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి వ్యాఖ్యానించారు. పుట్టపర్తి మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ సువర్ణ అధ్యక్షతన బుధవారం మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పుట్టపర్తి మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో తీవ్రంగా విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే పుట్టపర్తి మున్సిపాలిటీ 120 స్థానంలో ఊడడంపై ఎమ్మెల్యే తీవ్ర ఆసంతృప్తి చేశారు. చిత్రావతి లోకి మురుగునీరు కలుషితం పై మున్సిపల్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఉరవకొండలో "బడ్జెట్ 2026-27 అవుట్‌రీచ్"




ఉరవకొండ (చైతన్యరథం): రాష్ట్ర ఆర్థికశాఖ ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి "బడ్జెట్ 2026-27 అవుట్‌రీచ్" కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లోని ముఖ్యాంశాలు, అభివృద్ధి దిశగా తీసుకున్న నిర్ణయాలు, సంక్షేమ కార్యక్రమాలపై సమగ్ర అవగాహనను జిల్లా మరియు మండల స్థాయి అధికారులతో పాటు ప్రజలకు చేరవేయడమే ఈ అవుట్‌రీచ్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. బడ్జెట్‌లో కేటాయించిన ప్రతి రూపాయి ఎక్కడ, ఎలా వినియోగించాలి అనే విషయంలో ఖచ్చితమైన ప్రణాళిక ఉండాలని అధికారులను ఆదేశించారు. గతంలో నిలిచిపోయిన సుమారు 85 కేంద్ర పథకాలను పునరుద్ధరించినట్లు పేర్కొంటూ, వాటి నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పారదర్శకతను పెంపొందించడం ద్వారా బడ్జెట్ ప్రయోజనాలు సామాన్య ప్రజలకు మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కలసపాడు (చైతన్యరథం): వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుభాన్ తెలిపారు. బుధవారం రాత్రి ఆయన కలసపాడు మండల కేంద్రంలోని పోరుమామిళ్ల ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. 25 వాహనాలు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాల యజమానులకు జరిమానా వేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. వాహనాలకు అదనంగా ఎస్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలన్నారు.

## వైసీపీ హయాంలో విధ్వంసమే అజెండగా పాలన సాగించారు : ధూళిపాళ్ల




పొన్నూరు (చైతన్యరథం): వైసీపీ హయాంలోని ఐదేళ్లు విధ్వంసమే అజెండాగా పాలన సాగించారని తెలుగుదేశం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆరోపించారు. ప్రజలు వారికి ఎన్నికల్లో బుద్ధి చెప్పినా తీరు మాత్రం మారలేదని ఆగ్రహించారు. రైతులు లేకున్న వారి పేరుతో ఆందోళనలు చేస్తున్నారని మండిపడ్డారు. ఫేక్ వార్తలు ప్రచారం చేసి లబ్ధి పొందడానికి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. బుధవారం అమరావతిలోని టీడీపీ కార్యాలయంలో ధూళిపాళ్ల మీడియాతో మాట్లాడారు. నేరస్థులకు వైసీపీ మద్దతు పలుకుతోంది. ఎక్కడ ఏ గొడవ జరిగినా తమ ప్రభుత్వానికి అంటగడుతున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. పొన్నూరు నియోజకవర్గంలో వంశీ, గోపీ అనే నేరస్థులకు వైసీపీ మద్దతు పలుకుతోందని ఫైర్ అయ్యారు. వైసీపీ ఐదేళ్ల హయాంలో కూడా వీరిపై కేసులు నమోదయ్యాయని ప్రస్తావించారు. మద్యం దుకాణం వద్ద నలుగురు వైసీపీ కార్యకర్తలతో దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి మధ్య గొడవ జరిగిందని తెలిపారు. దుర్గా ప్రసాద్‌తో వ్యక్తిగత గొడవని రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. కులాల ప్రస్తావన లేకుండానే ఎస్సీ అట్రాసిటీ కేసు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు.

## ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే చైతన్యరెడ్డి



కమలాపురం (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని నియోజకవర్గ ఎమ్మెల్యే చైతన్యరెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం నియోజకవర్గం చింతకొమ్మదిన్నె మండలం బయనపల్లిలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజలనుండి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వయంగా స్వీకరించిన ఎమ్మెల్యే... వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో వెంటనే మాట్లాడారు. స్పందించి తక్షణ పరిష్కారం చూపించాలని ఆదేశించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం, రోడ్లు, విద్యుత్, పింఛన్లు, గృహ నిర్మాణం వంటి ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారని అన్నారు. ప్రజాదర్బార్ ద్వారా నేరుగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు ఎమ్మెల్యే చైతన్యరెడ్డి. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సచివాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ఆకస్మిక తనిఖీలు



అనంతపురం అర్బన్ (చైతన్యరథం): 34వ డివిజన్‌లో 74వ సచివాలయాన్ని అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే సచివాలయంకి వెళ్లే సమయానికి ముగ్గురు సిబ్బంది హాజరైయ్యారు. మొత్తం 10మంది ఉండాల్సిన చోట ముగ్గురే ఎందుకున్నారని, నలుగురు ఫీల్డ్ విజిట్, మరో 3పోస్టులు ఖాళీగా ఉన్నాయన్న సిబ్బంది... ఫీల్డ్ విజిట్‌లో ఉన్న వారికి నేరుగా ఫోన్ చేసి ఆరా తీశారు. సచివాలయంలో హాజరు శాతం, పీజిఆర్ఎస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుపాటి... ఎన్ని సమస్యలు పరిష్కారించారని ఆరా తీశారు. ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచన, సమయానికి సచివాలయానికి రావాలని సూచించారు. ప్రజలపట్ల గౌరవంగా ఉండాలని, ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గత ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిని గాడిలో పెట్టామన్న ఎమ్మెల్యే... ఇప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండేలా సిబ్బంది పని చేస్తున్నారని, ప్రతి నిత్యం సచివాలయాలపై పర్యవేక్షణ ఉంటుందన్న ఆయన... పింఛన్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. త్వరలోనే ప్రజా సమస్యలను పరిష్కారిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీరు ఉంటేనే అభివృద్ధి సాధ్యం.. నీటిని కాపాడుకుందాం

**●జలధార కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్**

**●త్వరలోనే పీఏబీఆర్ కుడి కాలువ-హంద్రీనీవా కాలువల అనుసంధానిస్తాం**



ధర్మవరం (చైతన్యరథం): నీరు ఎక్కడ ఉంటే అక్కడ వ్యవసాయం మాత్రమే కాదు అభివృద్ధి కూడా కనిపిస్తుందని.. అందుకే ఆ నీటిని మనం జాగ్రత్తగా కాపాడుకుందామని ధర్మవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామంలో జలధార-నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామానికి వచ్చిన శ్రీరామ్‌కు టీడీపీ నాయకులు, రైతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జలధార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్, ఎంపిడిఓ, జల వనరుల శాఖ అధికారులు, సాగునీటి సంఘాల సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామంలో చెరువుని ఎలా అభివృద్ధి చేసుకోవాలన్న అంశం గురించి సాగునీటి సంఘాల సభ్యులు, రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ గతంలో రాయలసీమలో నీటి వనరులు చాలా తక్కువగా ఉండేవని... చెట్ల పెంపకం కూడా తక్కువగా కనిపించేదన్నారు. అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన నీరు - చెట్టు వంటి కార్యక్రమాలతో కొంతవరకు ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చిందన్నారు. ఆ తర్వాత హంద్రీనీవా కాలువను పూర్తి చేయడం ద్వారా అనేక ప్రాంతాలకు నీరు అందిందన్నారు. ఇప్పుడు కాస్తయినా నీటి సమస్య తీరిందంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వలనేనన్నారు. హంద్రీనీవా నీరు మన వరకు చేరాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదని.. ఇలాంటి సమయంలో ఆ నీటిని మనం చాలా జాగ్రత్తగా కాపాడుకోవాలని శ్రీరామ్ సూచించారు. అలాగే వర్షపు నీటిని కూడా మనం జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నడిచే నీటిని పరిగెత్తించి... దానిని భూమిలో ఇంకే విధంగా చేసుకోవాలని శ్రీరామ్ సూచించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్

జలధార కార్యక్రమం అనంతరం బత్తలపల్లి మండలం కి చెందిన ఇద్దరికి పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. రామాపురం గ్రామానికి చెందిన రామలక్ష్మికి రూ.41.50వేలు, నెత్తివారంపల్లికి చెందిన ఆనంద్‌కు రూ.37.34 మొత్తం రూ.78.84వేలు విలువైన చెక్కులను అందజేశారు. ఆరోగ్యం విషయంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఎన్టీఆర్ వైద్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని.. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్రీరామ్ అన్నారు.



# విశాఖ నుంచి విశ్వ వేదికకు...

## 205 శాఖల సిబ్బందికి బాస్... మన తెలుగు తేజం 'నీలిమ పాలడుగు'

## 'డెంటన్స్' గ్లోబల్ చీఫ్ పీపుల్స్ ఆఫీసర్‌గా ఎంపిక



**సంకల్పం గట్టిదైతే సాధ్యం కానిది ఏదీ లేదని నిరూపించారు. ప్రపంచంలోనే భారీ న్యాయ సేవల సంస్థ అయిన 'డెంటన్స్' గ్లోబల్ చీఫ్ పీపుల్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయురాలిగా చరిత్ర సృష్టించారు. ఆమే మన విశాఖ ఆడపడుచు నీలిమ పాలడుగు. చదివింది సాధారణ బీఏ అయినా ఉన్నతమైన ఆలోచనా దృక్పథంతో అసాధారణ శిఖరాలను అధిరోహించారు.**

(చైతన్యరథం ప్రతినిధి-అమరావతి)

తండ్రి ఉప్పలపాటి రాజా ప్రోత్సాహం తల్లి సాయిరాణి క్రమశిక్షణలో పెరిగిన నీలిమ కొటక్ స్కూల్, సెయింట్ జోసెఫ్ కాలేజీలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. సైకాలజిస్ట్ కావాలనే లక్ష్యంతో డిగ్రీలో సైకాలజీ, పొలిటికల్ సైన్స్ ప్రధానాంశాలుగా చదివారు. అదనంగా ఎన్ఐఐటీలో డిప్లొమా పూర్తి చేశారు.

**తొలి పాఠం:** డిగ్రీ పూర్తికాగానే తండ్రి నడుపుతున్న టైటాన్ షోరూమ్‌లో ఒక సామాన్య ఉద్యోగిగా చేరారు. అక్కడే ఆమెకు 'కస్టమర్ రిలేషన్స్', 'మేనేజ్మెంట్'లో తొలి అనుభవాలు లభించాయి.

**అంతర్జాతీయ కెరీర్:** పెళ్లి తర్వాత న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మీదుగా అమెరికా చేరుకున్న ఆమె.. ఐబీఎం, పీడబ్ల్యూసీ, డెలాయిట్ వంటి దిగ్గజ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు.

అరుదైన గౌరవం: ప్రస్తుతం ఆమె ప్రపంచంలోనే అతిపెద్ద లా ఫర్మ్ అయిన 'డెంటన్స్'కు గ్లోబల్ చీఫ్ పీపుల్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈ అత్యున్నత పదవిని చేపట్టిన తొలి భారతీయురాలిగా రికార్డు సృష్టించారు. 80కి పైగా దేశాల్లో విస్తరించి ఉన్న ఈ సంస్థలోని మానవ వనరులను సమన్వయం చేయడం ఇప్పుడు ఆమె బాధ్యత.

**భయాన్ని జయించి.. పర్వతారోహణ వైపు!**

వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగానూ ఆమెకు సాహసాలంటే ఇష్టం. పర్వతారోహణ ఆమె ప్రధాన అభిరుచి.

ఆఫ్రికాలోని అత్యంత ఎత్తైన కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. హిమాలయాలతో పాటు ఐరోపా, అమెరికాలోని పలు శిఖరాలను సైతం ఎక్కారు. కిలిమంజారో ఎక్కేటప్పుడు ఆక్సిజన్ అందక ఇబ్బందిపడినా వెనకడుగు వేయకుండా గమ్యాన్ని ముద్దాడి తనలోని సంకల్ప బలాన్ని చాటుకున్నారు.

**సేవా పథం...**

విజయం కేవలం పదవుల్లోనే లేదని భావించే నీలిమ సామాజిక సేవలోనూ ముందున్నారు. ఆఫ్రికన్ చిన్నారుల చదువుల కోసం 'క్లైంబ్ ఫర్ ఎ చైల్డ్', భారత్‌లో 'నాన్హి కలి', 'రెస్క్యూ ఎయిడ్' వంటి ప్రాజెక్టుల ద్వారా తన వంతు సాయం అందిస్తున్నారు.

**కుటుంబమే ప్రాణం**

తండ్రి ఇచ్చిన ఆత్మవిశ్వాసం, భర్త సుధాకర్, పిల్లలు రియా, సునీల్ ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందని ఆమె గర్వంగా చెప్తారు.

**"పరిస్థితులు మనకు అనుకూలంగా లేనప్పుడు...వాటిని మనకు తగ్గట్లుగా మార్చుకోగలగాలి. అప్పుడే విజయం మన వెంట నడుస్తుంది."**

**- నీలిమ పాలడుగు**

---

### అట్లాంటాలో 11న 'టామా' ఉచిత

# డయాగ్నస్టిక్ టెస్ట్

**డెన్మార్క్:** అట్లాంటా తెలుగు సంఘం (TAMA) తన ఉగాది వేడుకల్లో భాగంగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కీలక నిర్ణయం తీసుకుంది. 'గ్లోబల్ EFE అకాడమీ' (Global EFE Academy) సహకారంతో 9 నుంచి 11వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం ఉచితంగా SAT-డయాగ్నస్టిక్ టెస్ట్' (ఫుల్ లెంగ్త్ డిజిటల్ టెస్ట్), తల్లిదండ్రుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తోంది.

ఏప్రిల్ 11వ తేదీ మధ్యాహ్నం 12:30 గంటలకు 'డెన్మార్క్ హైస్కూల్' (Denmark High School) వేదికగా సదస్సు జరుగుతుంది. ఈ కింది అంశాలపై నిపుణులు అవగాహన కల్పిస్తారు.




మీ పిల్లలకు SAT/ACT ఏది సరైనది?

ఉత్తమ ప్రిపరేషన్ కోర్సును ఎలా ఎంచుకోవాలి?

టెస్ట్ ప్రిపరేషన్ ప్రారంభించడానికి సరైన సమయం ఏది?

డిజిటల్ టెస్ట్ వివరణాత్మక విశ్లేషణ.

**బహుమతులు:** ఈ డయాగ్నస్టిక్ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు (Top 3 scorers) అవార్డులు అందజేయనున్నారు.

**రిజిస్ట్రేషన్:**

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకునే వారు ఆన్‌లైన్ ద్వారా వెంటనే రిజిస్టర్ చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నందున ఆసక్తి గల వారు https://forms.gle/yih4on2yuzRf9jE46 లింక్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు శ్రీని (313-412-0791), సాయి రావల్ (770-256-4562) సుజాత తోట (678-997-7029) నంబర్లను సంప్రదించవచ్చు. తెలుగు విద్యార్థులు తమ విద్యా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఇదొక మంచి అవకాశమని 'టామా' ప్రతినిధులు పేర్కొన్నారు.


---

### ఆంధ్ర ఆడపడుచును కాపాడిన

# ఎన్ఆర్ఐ టీడీపీ

### పది నెలల కష్టం తర్వాత సురక్షితంగా ఇంటికి చేరుకున్న సఖినేటిపల్లి మహిళ

**మస్కట్:** ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలానికి చెందిన ఎరసాని సంపూర్ణ కుటుంబ ఆర్థిక ఇబ్బందులరీత్యా పిల్లలను పోషించుకోవడానికి మస్కట్ వెళ్లింది. అక్కడ ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. ఏజెంట్ రవికుమార్ ఆమెను కృష్ణవేణి అనే లోకల్ ఏజెంట్‌కు అప్పగించగా సరైన జీతం ఇవ్వకుండా పలు ఇళ్లల్లో పని చేయిస్తూ తీవ్రంగా వేధించారు. తిరిగి ఇండియాకు పంపించాలంటే లక్ష రూపాయలు స్పాన్సర్‌కి చెల్లించాలని చెప్పారు.



డబ్బు కట్టే స్తోమత లేక ఆమె ఇండియన్ ఎంబసీని ఆశ్రయించగా అక్కడ కూడా పాత యజమానికి లక్ష రూపాయలు చెల్లించాలనే నిబంధన ఎదురైంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆ ఊరి ఎంపీటీసీ సహాయంతో ఏజెంట్ రవికుమార్‌కు లక్ష చెల్లించారు. కానీ ఆ ఏజెంట్ ఫోన్ ఎత్తకుండా మోసం చేశాడు. చేసేదేమీ లేక సంపూర్ణ కుటుంబ సభ్యులు పోలీసులకు, టీడీపీ ఎన్ఆర్ఐ సెల్ కో-ఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. సంపూర్ణకు ఎలాగైనా న్యాయం చేసి అక్కడ ఎంబసీ వారితో సంప్రదింపులు జరిపి త్వరగా తీసుకు రావాల్సిందిగా ఒమాన్‌లో ఉన్న ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు బొంతు నాగరాజు, మహమ్మద్ ఇమామ్, సత్య శ్రీధర్, వాసుబాబు, రాఘవేంద్ర, శ్రీనివాస్, రాజేష్ కోరారు.

ఒమన్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులు, ఒమాన్ ఎన్ఆర్ఐ టీడీపీ ప్రతినిధులు అంతా ఒక్కటై సంపూర్ణకు భరోసా ఇచ్చారు. యజమానికి చెల్లించాల్సిన లక్ష రూపాయలను వారంతా కలిసి భరించి, ఆమెను సురక్షితంగా ఎంబసీ షెల్టర్‌కు చేర్చారు. ఆ తర్వాత జీఎంకే ట్రావెల్ ట్రస్ట్‌కు చెందిన గుత్తుల మీనాకుమార్ విమాన టిక్కెట్ ఖర్చు భరించగా వెలుగొట్ల అశోక్‌కుమార్ హైదరాబాద్ నుంచి నరసాపురం వరకు బస్సు టికెట్ ఏర్పాటు చేశారు. ఈ తతంగానికి దాదాపు పది నెలలు పట్టింది, అప్పటివరకు భారత ఎంబసీ అధికారులు ఎంతో సహకారం అందించారు.

సుమారు పది నెలల కఠిన పోరాటం తర్వాత ఈ నెల 30న ఆంధ్రప్రదేశ్‌లోని సఖినేటిపల్లిలో ఉన్న తన బిడ్డల వద్దకు సురక్షితంగా చేరుకుంది. తనకు కష్టకాలంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎంబసీ అధికారులతో పాటు ఒమన్ ఎన్నారై టీడీపీ సభ్యులకు, టీడీపీ ఎన్ఆర్ఐ విభాగానికి, పూర్తి సహకారం అందించిన ఏపీ ఎన్నార్టీఎస్ అధికారులకు సంపూర్ణ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో మొదటి నుంచీ టైం టు టైం టచ్‌లో ఉండి ధైర్యం చెప్తూ అధికారులు అందరినీ సమన్వయం చేసుకుంటూ అండదండలు అందించిన బొంతు నాగరాజు, టికెట్ అందించిన గుత్తుల మీనాకుమార్, కోనసీమ సీమ జిల్లా కలెక్టర్, బస్ టికెట్ అందించిన వెలిగోట్ల అశోక్‌కుమార్, పోలీసు అధికారులందరికీ సంపూర్ణ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

---

### 26న పిట్స్‌బర్గ్‌లో 'నాట్స్'

# చెస్ సమరం

**పిట్స్‌బర్గ్:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (NATS) పిట్స్‌బర్గ్ చాప్టర్ ఆధ్వర్యంలో యువ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు 'పిట్స్‌బర్గ్ చెస్ క్లబ్ (PCC)' సహకారంతో 'USCF రేటెడ్ చెస్ టోర్నమెంట్ 2026' నిర్వహిస్తున్నారు. ఈ మెగా ఈవెంట్ ఈ నెల 26వ తేదీ ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మార్స్ (Mars, PA)లోని 400 కయుగా సిర్ (400 CayugaCir) వేదికగా జరగనుంది.

**పోటీల వివరాలు:**

ఈ టోర్నమెంట్ 'ఫోర్ రౌండ్ +/30 స్విస్' (Four round G/30 Swiss) పద్ధతిలో జరుగుతుంది. ఇందులో పాల్గొనే క్రీడాకారులకు ప్రస్తుత USCF మెంబర్‌షిప్ తప్పనిసరి. విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు.




మొదటి బహుమతి: $100 నగదు, ట్రోఫీ

రెండవ బహుమతి: $75 నగదు, ట్రోఫీ

**రిజిస్ట్రేషన్, ఫీజు:** ఆసక్తి గల వారు ఏప్రిల్ 23వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలి. 'నాట్స్' సభ్యులకు 25 డాలర్లు, సభ్యత్వం లేని వారికి 30 డాలర్లు రిజిస్ట్రేషన్ ఫీజుగా నిర్ణయించారు. రిజిస్ట్రేషన్ కోసం https://natsworld.org/pghchess2026 వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

**నిర్వాహకుల పర్యవేక్షణ:**

నాట్స్ ఛైర్మన్ కిషోర్ కంచర్ల, ప్రెసిడెంట్ శ్రీహరి మందాడి పర్యవేక్షణలో జరిగే పోటీలను జెడ్‌వీపీ (ZVP) అనుదీప్ అర్ల, వెబ్ సెక్రటరీ రవి తుమ్మల, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. తెలుగు సమాజంలోని చిన్నారులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు నాట్స్ హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించవచ్చు.

# ఖరీఫ్ సీజన్‌లో న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ

- జైపూర్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం
- హెచ్‌పీసీఎల్ రిఫైనరీకి రూ.79,459 కోట్లు
- అరుణాచల్ ఎలక్ట్రిక్, హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణం
- కేంద్ర క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవా రం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతా రు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపు తూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మిం చనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

## 15న ఆదిచుంచనగిరికి ప్రధాని మోదీ




బెంగళూరు: మండ్య జిల్లా నాగమంగల తాలూకాలోని చారిత్రాత్మక గుర్తింపు కల్గిన ఆదిచుంచనగిరి మఠం పీఠాధ్యక్షుడిగా కొనసాగిన బాలగంగాధరనాథస్వామిజీ సమాధిని శ్రీ గురుభైరవైక్య మందిరం ప్రారంభానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ 15వ తేదీన రానున్నారు. ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటనకు సుదీర్ఘకాలం తర్వాత విచ్చేస్తున్నారు. ఆదిచుంచనగిరి పరిధిలోని కాలభైరవేశ్వరస్వామి ఆలయానికి సమీపంలోనే భైరవైక్య డాక్టర్ బాలగంగాధరనాథ స్వామీజీని సమాధి చేసిన విషయం తెలిసిందే. స్వామీజీ భైరవైక్యం చెందినప్పుడు తాత్కాలికంగా మండపాన్ని నిర్మించారు. ఆ తర్వాత మూల సమాధిని యథాస్థితిలో ఉంచి మండపాన్ని తొలగించారు. రెండు అంతస్తులతో ప్రస్తుతం మందిరాన్ని తీర్చిదిద్దారు. ఈ మండపాన్ని ప్రారంభించేందుకు ప్రధానమంత్రి 15న విచ్చేయను న్నారని మఠం ఒక ప్రకటనలో పేర్కొంది. బుధవారం ఉదయం 11 గంటలకు మండపాన్ని ప్రారంభించే ప్రధానమంత్రి బీజీఎస్ స్టేడియంలో ప్రత్యేక వేదిక ద్వారా భక్తులనుద్దేశించి ప్రసంగించ నున్నారు. ఆదిచుంచనగిరి మఠం ప్రస్తుత పీఠాధిపతి నిర్మలానంద నాథస్వామీజీ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రధాని దేవేగౌడ, కేంద్రమంత్రి కుమారస్వామి సహా జిల్లా మంత్రి చలువరాయస్వామి, రాష్ట్రంలోని వివిధ మఠాల స్వామీజీ లు పాల్గొననున్నారు. ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాధి కారి డాక్టర్ కుమార్, ఎస్పీ డాక్టర్ శోభారాణి మఠాన్ని సందర్శించారు.

## వెనెజువెలా నుంచి 1.2 కోట్ల బ్యారెళ్ల చమురు!

### ఈ నెలలోనే భారత్ పశ్చిమ తీరానికి: కెప్లర్

న్యూఢిల్లీ: వెనెజువెలా నుంచి 1.2 కోట్ల బ్యారెళ్లకు పైగా ముడిచమురు భారత్‌కు రానుం ది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా చమురు సరఫరాకు అంతరాయం కలుగుతున్న తరుణంలో ఈ దిగుమతులు ఇంధన సంక్షోభాన్ని తగ్గించడానికి దోహదపడనున్నా యి. కెప్లర్ సంస్థ గణాంకాల ప్రకారం... ఈ నెలలోనే దేశ పశ్చిమ తీరానికి వెనెజువెలా నుంచి ముడిచమురు చేరనుంది. 2020 ఫిబ్రవరి తర్వాత ఆ దేశం నుంచి భారత్‌కు రానున్న చమురు దిగుమతుల్లో ఇదే అత్యధికం. ఈ సరుకు రవాణాకు సంబంధించిన ఒప్పందాలు ఇరాన్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందే కుదిరి ఉండొచ్చని కెప్లర్ విశ్లేషకుడు సుమిత్ రిటోలియాను ఉటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ పేర్కొంది.



## కేరళ ఎన్నికలు.. 2011 రిపీట్ అవుతుందా?

### నేడు పోలింగ్‌కు సర్వం సిద్ధం

తిరువనంతపురం: కేరళంలో గురువారం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు జోరుగా ప్రచారా లు నిర్వహించాయి. అధికార కమ్యూనిస్ట్ పార్టీ ఈసారి కూడా గెలుపు తమదేనన్న ధీమా వ్యక్తం చేస్తోంది. ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూడా గెలుపు తమదే అంటోంది. కేరళంలో 140 సీట్లు ఉండగా.. గత ఎన్నికల్లో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ 99 స్థానాల్లో విజయం సాధించి అధికారాన్ని చేపట్టింది. యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ 41 స్థానాల్లో గెలిచింది. కాగా 2011 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 72 స్థానాల్లో విజ యం సాధించింది. కాంగ్రెస్ నుంచి ఉమెన్ చాందీ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు. అయితే 2016 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బపడింది. కేరళ కాంగ్రెస్ (ఎమ్) యూడీఎఫ్‌ను వీడి ఎల్‌డీఎఫ్‌లో చేరింది. దీంతో ఓ వర్గం ఓటు బ్యాంకును ఎల్‌డీఎఫ్ సొంతం చేసుకుంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ నుంచి పోటీకి దిగిన కాంగ్రెస్ 21 సీట్లకు మాత్రమే పరిమితం అయింది. ప్రధాన ప్రతిపక్ష హోదాతో సరిపెట్టుకోక తప్పలేదు. ఈసారి ఫలి తాలపై




కాంగ్రెస్ ధీమాగా ఉంది. తమ కూటమి భారీ విజయం సాధించి అధికారాన్ని సొంతం చేసుకోవటం ఖాయమని అంటోంది.

### సంప్రదాయాన్ని బ్రేక్ చేసిన ఎల్‌డీఎఫ్

కేరళంలో సాధారణంగా ప్రతి ఐదేళ్లకు ఒకసారి ప్రభుత్వం మారుతుంటుంది. కానీ, 2021లో పినరయి విజయన్ నేతృత్వం లోని ఎల్‌డీఎఫ్ వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చింది. గత 40 ఏళ్ల రికార్డును తిరగరాసింది. ఎల్‌డీఎఫ్ కూటమిలోని సీపీఐ (ఎమ్) సింగిల్‌గా 62 సీట్లను గెలుచుకుంది. రాష్ట్రంలో అతి పెద్ద పార్టీగా నిలిచింది. ఈసారి కూడా అధికారం తమదేనని ఎల్‌డీ ఎఫ్ కూటమి ధీమా వ్యక్తం చేస్తోంది. మరోసారి చరిత్ర సృష్టిస్తా మంటోంది.

### ఈసారైనా బీజేపీ ఆశలు

2016 ఎన్నికల్లో బీజేపీ ఒక సీటు గెలుచుకుంది. నెమోన్ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎమ్) అభ్యర్థి వి.శివన్‌కుట్టి మీద బీజేపీ అభ్యర్థి ఓ.రాజగోపాల్ విజయం సాధించారు. అది కూడా 8,671 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కేరళ రాజకీ యాల్లో బీజేపీ చరిత్ర సృష్టిస్తూ మొట్ట మొదటిసారిగా గెలుపొం దింది. అది కూడా ఈ ఒక్కస్థానంలో మాత్రమే బీజేపీ విజయం సాధించింది. అయితే గత ఎన్నికల్లో మాత్రం బీజేపీ దారుణ ఓటమి పాలైంది. ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయింది. ఈసారి కేరళ రాజకీయాల్లో తమ ప్రభావం కచ్చితం గా ఉంటుందని బీజేపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## పారిశ్రామిక రంగానికి భారీ ఊరట

### బల్క్ ఎల్‌పీజీ సరఫరాపై కేంద్రం కీలక నిర్ణయం



న్యూఢిల్లీ: దేశంలోని పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఫార్మా, ఫుడ్, పాలిమర్, స్టీల్, గ్లాస్ వంటి పలు పారిశ్రామిక రంగాలకు ఇంధన కొరత అధిగమించేందుకు బల్క్ నాన్-డొమెస్టిక్ ఎల్‌పీజీ కేటాయింపులను పెంచుతూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల పారిశ్రామిక యూనిట్లకు ఇధన అవసరాలు పెరగడమే కాకుండా, ఉత్పత్తి వ్యయం తగ్గడానికి అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం.. పారిశ్రామిక యూనిట్లకు గత మార్చి నెల నాటి వినియోగంతో పోలిస్తే 70 శాతం ఎల్‌పీజీ సరఫరాను పునరుద్ధరించాలని కేంద్రం నిర్ణయించింది. పారిశ్రామిక అవసరాల కోసం రోజుకు గరిష్ఠంగా 0.2 టీఎంటీ వరకు గ్యాస్ కేటాయింపులు జరగనున్నాయి. సహజ వాయువు లభ్యం కాని లేదా ప్రత్యామ్నాయంగా వాడలేని సున్నితమైన పారిశ్రామిక ప్రక్రియలకు ఈ కేటాయింపుల్లో అగ్రతాంబూలం దక్కనుంది. పీఎన్‌జీ సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసే రాష్ట్రాలకు కేంద్రం బంపర్ ఆఫర్ ప్రకటించింది. అటువంటి రాష్ట్రాలకు అదనంగా 10శాతం వరకు ఎల్‌పీజీ కేటాయింపులు పెంచనున్నారు. అలాగే, కంప్రెస్ట్ బయో గ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి త్వరితగతిన రాష్ట్ర సీబీజీ పాలసీని నోటీఫై చేయాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం ఆదేశించింది. ఈ అదనపు కేటాయింపులు పొందాలనుకునే పారిశ్రామిక యూనిట్లు తప్పనిసరిగా ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వద్ద తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది.

## ఊటీ పుష్ప ప్రదర్శనకు ఏర్పాట్లు



చెన్నై: వేసవి ప్రారంభంతో ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. 23వ తేదీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత, ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ఈ సంవత్సరం పుష్ప ప్రదర్శన తేదీలు ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, ఈ కార్యక్రమం మే 2న జరుగుతుందని భావిస్తున్నారు. పుష్ప ప్రదర్శన సన్నాహాల్లో భాగంగా, ఉద్యానవనాన్ని ప్రస్తుతం శరవేగంగా సిద్ధం చేస్తున్నారు 35వేల కుండీల్లో పెంచుతున్న కొన్ని మొక్కలు పుష్పిస్తున్నాయి. ముఖ్యంగా, పాన్సీలు, సాల్వియాలు, కోలియస్ వంటి మొక్కలు వికసించడం మొదలుపెట్టాయి. ఉద్యానవనాన్ని సందర్శించే పర్యాటకులు ఈ పూల అందాలను చూసి ముచ్చటపడుతున్నారు. అంతేకాకుండా, వృక్షశాస్త్ర ఉద్యానవనంలోనే ఉన్న ఫెర్న్‌హౌస్ కూడా పర్యాటకుల కోసం తెరిచేవుంచారు. దీనితో, సందర్శనకు వచ్చే పర్యాటకులు ఇప్పుడు ఆ ప్రాంగణంలో ఉన్న అనేక రకాల ఫెర్న్ మొక్కలను, ఇతర అరుదైన మొక్కల దగ్గర సెల్ఫీలు తీసుకుంటున్నారు.

# డెడ్‌లైన్‌కు ముందు సీజ్ ఫైర్

- ఇరాన్‌కు మరో రెండువారాల గడువు
- డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం



అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో రెండు వారాల గడువు ఇచ్చారు. ఇరాన్‌పై దాడులను తాత్కాలికంగా రెండువారాల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమయం లో శాంతి చర్చలు కూడా జరగనున్నాయి. ఇరాన్ కూడా ఈ తాత్కాలిక ఒప్పందానికి అంగీకరించినట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌కు ఇచ్చిన గడువును పొడిగించాలనే పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రతిపాదనను అంగీకరించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు 'ట్రూత్' ద్వారా ట్రంప్ వెల్లడించారు. 'పాక్ ప్రధాని షరీఫ్, ఫీల్డ్ మార్షల్ మునీర్‌తో మాట్లాడాను. ఇరాన్‌కు ఇచ్చిన గడువును పొడిగించాలని, దాడులను నిలిపి వేయాలని కోరారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలనే షరతుకు లోబడి రెండు వారాల గడువుకు, కాల్పుల విరమణకు అంగీకరించాను. ఇరు దేశాల వైపు నుంచి ఈ కాల్పుల విరమణ ఉంటుంది' అని ట్రంప్ పేర్కొ న్నారు. ఇరాన్ పది సూత్రాలతో ఓ ప్రతిపాదనను పంపించిందని, అవన్నీ సానుకూలంగానే ఉన్నాయని ట్రంప్ పేర్కొనడం గమనా ర్హం. ఈ రెండు వారాల సమయంలో ఇరాన్‌తో శాంతి చర్చలు కూడా జరుగుతాయని చెప్పారు. ఇరాన్‌తో శాశ్వత ఒప్పందానికి, పశ్చిమాసియాలో ప్రశాంతతను నెలకొల్పడానికి ఈ రెండు వారాల గడువు ఉపయోగపడుతుందని ట్రంప్ పేర్కొన్నారు. దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం త్వరలోనే దొరకబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ఇజ్రాయెల్ ప్రధాని మద్దతు

కాగా, కాల్పుల విరమణపై అమెరికాకు మద్దతు ఇవ్వబోతున్న ట్లు ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. అయితే ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టం చేశారు. తాజాగా దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దళాలు దాడులు చేశాయి. అమెరికాకు ఇరాన్ ప్రతిపాదించిన పది పాయింట్ల అజెండాలో లెబనాన్‌పై దాడులను ఆపాలని కూడా ఉంది. అయినప్పటికీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడం గమనార్హం.

# యుద్ధం ఇంకా ముగియలేదు..

- మా వేళ్లు ట్రిగ్గర్‌పైనే ఉన్నాయి
- ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఈ నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ కీలక ప్రకటన చేశారు. దాడులు ఆపాలని తమ సైనిక దళాలకు ఆదేశాలు జారీ చేశారు. అయితే యుద్ధం పూర్తిగా ముగియలేదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్ కాస్టింగ్' టెలివిజన్ ఖమేనీ ప్రకటనను చదివి వినిపించింది. 'అన్ని సైనిక విభాగాలు సర్వోన్నత నాయకుడి ఆదేశాన్ని పాటించి కాల్పులు ఆపాయి. కాల్పుల విరమణ అంటే యుద్ధం ముగిసినట్లు కాదు. మా వేళ్లు ఇంకా ట్రిగ్గర్ పైనే ఉన్నాయి. శత్రు దేశాలు మళ్లీ దురాక్రమణకు పాల్పడితే పూర్తి బలంతో దీటుగా స్పందిస్తాం' అని పేర్కొంది. ఏప్రిల్ 10వ తేదీన ఇస్లా మాబాద్‌లో చర్చలు జరుగుతాయని, ఇరుపక్షాల మధ్య రెండు వారాల పాటు కొనసాగుతాయని టెహ్రాన్ ధ్రువీకరించింది. హర్మూజ్‌ను తెరిచేందుకు ఇరాన్ అంగీకరించిందని, దీంతో రెండు వారాల పాటు ఇరాన్‌పై ఎలాంటి దాడులూ చేయబోమని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇరాన్‌తో శాశ్వత ఒప్పందానికి, పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పడానికి ఈ గడువు ఎంతగానో ఉపయోగపడుతుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరాన్ పంపించిన పది పాయింట్ల ప్రతిపాదనలు కూడా సానుకూలంగానే ఉన్నాయని ట్రంప్ అభిప్రాయపడ్డారు.

# ఇరాన్‌ను విడిచి వెళ్లండి..


**భారత పౌరులకు ఎంబసీ కీలక ఆదేశాలు**

టెహ్రాన్: ఇరాన్ - అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం ఆగిన సంగతి తెలిసిందే. ఇరాన్, అమెరికాల మధ్య 15 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం జరిగింది. అమెరికా సీజ్ ఫైర్ నిర్ణ యానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు తెలిపింది. లెబనాన్ విషయం లో మాత్రం వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో ఉన్న భారతీయులకు ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే భారత రాయబార కార్యాలయం సహాయం తీసుకో వాలని తెలిపింది. తాము సూచించిన మార్గాల్లో మాత్రమే దేశాన్ని వీడాలని ఎంబసీ ఆదేశించింది. ఎంబసీని సంప్రదించకుండా.. పర్మీషన్ తీసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు వెళ్లరా దని హెచ్చరించింది. ఈ మేరకు ఎంబసీ బుధవారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది.

### హర్మూజ్ జలసంధిపై వెనక్కి తగ్గని ఇరాన్

ఇరాన్, అమెరికా దేశాల మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం జరిగినా కూడా హోర్ముజ్ విషయంలో ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గటం లేదు. ఇప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే హోర్ముజ్ జలసంధి ఉంది. హోర్ముజ్‌లో షిప్పుల నుంచి ఇరాన్ భారీ మొత్తంలో టోల్ వసూలు చేస్తోంది. టోల్ ఫీజు ఆదాయాన్ని పునర్నిర్మాణానికి ఖర్చు చేస్తా మని అంటోంది.

# కాల్పుల విరమణ.. తెరవెనుక చైనా..



గత 40 రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. పాకిస్థాన్ ప్రధాని సూచనల మేరకే గడువును పొడిగించినట్లు ట్రంప్ తెలిపారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించడం వెనుక చైనా కీలక పాత్ర పోషించిందని వార్తలు వస్తున్నాయి. 'కాల్పుల విరమణపై చర్చలు జరపడానికి టెహ్రాన్‌ను ఒప్పించడంలో చైనా ప్రమేయం ఉందా' అని విలేకరులు ప్రశ్నించినపుడు 'అవుననే అనుకుంటున్నా. నేను కూడా విన్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు.

ఈ ఏడాది మే నెలలో చైనా పర్యటనకు ట్రంప్ వెళ్లబోతున్నారు. ఆ సమయం లోపునే ఈ యుద్ధం ముగిసిపోవాలని చైనా భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, టర్కీ, ఈజిప్టు వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌ను శాంతి మార్గం వైపు నడిపించడంలో చైనా నిశబ్దంగా పని చేసిందని వార్తలు వస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో బీజింగ్ పాత్రపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదు. నిజానికి ఈ యుద్ధం ఆగడం చైనాకు కూడా చాలా కీలకం.

ఎందుకంటే చైనాకు ఇరాన్ ప్రధాన ఆయిల్ సరఫరాదారు. హోర్ముజ్ జలసంధి మూసి వేసి ఉండడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే శాంతి చర్చల విషయమై చైనా అధికారులు నేరుగా ఇరాన్ నాయకులతోనే సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఏదేమైనా, భవిష్యత్తులో ప్రపంచ రాజకీయాల్లో చైనా ప్రభావం మరింత పెరుగుతుందనేందుకు ఈ పరిణామం కీలక సంకేతం.

# ఇంధనం ఆదా కోసం పాక్ 'స్మార్ట్' లాక్‌డౌన్

ఇస్లామాబాద్: ఇరాన్-అమెరికా యుద్ధం నేపథ్యంలో ఇంధన పొదుపు కోసం దాయాది దేశం పాకిస్థాన్ మంగళవారం సాయంత్రం నుంచి దేశవ్యాప్తంగా 'స్మార్ట్ లాక్‌డౌన్' ప్రకటించింది. వ్యాపార సమయం, పబ్లిక్ కార్యక్రమాలపై ఆంక్షలు విధించింది. దేశంలోని ప్రధాన కేంద్రాల్లోని మార్కెట్లు, షాపింగ్ మాల్స్, వాణిజ్య కేంద్రాలు ప్రతి రోజూ రాత్రి 8 గంటలకు, హోటళ్లు రాత్రి 10 గంటలకు మూసేయాల్సి ఉంటుంది. వివాహాది శుభకార్యాలు కూడా రాత్రి 10 గంటల్లోపే ముగించుకోవాలి. మెడికల్ షాపులు, ఫార్మసీ ఔట్‌లెట్లతోపాటు అత్యవసర సర్వీసులు మాత్రం యథాతథంగా కొనసాగుతాయి. భారీ స్థాయిలో ప్రజలు గుమిగూడటంపైనా ఆంక్షలు విధించింది.



# ప్రపంచ శాంతికి గొప్పరోజు: ట్రంప్

ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం ప్రపంచ శాంతికి ఒక గొప్పరోజు అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. గత 40 రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధానికి రెండువారాల పాటు ఉపశమనం లభించింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ గురించి స్పందించారు. హర్మూజ్ మార్గంలో నౌకాయానాన్ని సులభతరం చేయడానికి అమెరికా సహాయం చేస్తుందని తెలిపారు. 'ఈ యుద్ధం ఆగిపోవాలని ప్రపంచం మొత్తం కోరుకుంటోంది. ఇరాన్‌కు ఇక చాలు అనిపించింది. పశ్చిమాసియాలో సువర్ణాధ్యాయం మొదలు కాబోతోంది. హర్మూజ్ మార్గంలో నౌకాయానాన్ని సులభతరం చేయడానికి అమెరికా సహాయం చేస్తుంది. సానుకూల చర్యలు చేపట్టి వాణిజ్యపరంగా ముందడుగు వేయడానికి ఇరాన్‌కు ఇది సువర్ణావకాశం. ఇరాన్ తమ దేశాన్ని పునర్నిర్మించుకునే పనిని మొదలుపెట్టవచ్చు. అమెరి కా తప్పకుండా సహాయం చేస్తుంది. మా దేశం లాగానే ఇరాన్‌కు కూడా మంచి రోజులు రాబోతున్నాయి' అని ట్రంప్ పేర్కొన్నారు.

# చంద్రుడి చెంత నుంచి సూర్యగ్రహణం

*వీక్షించిన ఆర్టెమిస్ 2 వ్యోమగాములు*

*దగ్గర్నుంచి చూసి భావోద్వేగం*



ఓరియన్ వ్యోమనౌకలో భూమి నుంచి చంద్రుడి చెంతకు వెళ్లిన నలుగురు వ్యోమగాములు జాబిలి ఆవలివైపు దృశ్యాలను చూసి మైమరచిపోయారు! చందమామ ఉపరితలం మీదుగా నీలిగోళంలా కనిపించే భూమిని.. సూర్యగ్రహణాన్ని.. చంద్రుడిపై దాదాపు 950 కిలోమీటర్ల మేర విస్తరించిన భారీ ఉల్కా పాతబిలం (ఓరియంటేల్ ఇంపాక్ట్ బేసిన్) వంటివాటిని వేయి కళ్లు చేసుకుని చూశారు. నలుగురు వ్యోమగాములూ ఇద్దరిద్దరుగా విడిపోయి.. ఓరియన్ స్పేస్‌క్రాఫ్ట్ కిటికీల వద్ద చేరి.. నరమానవులెవరూ చూడని దృశ్యాలను కన్నులారా తిలకించి పులకించిపోయారు. ఆ దృశ్యాలన్నింటినీ కెమెరా కళ్లతో చిత్రీక రించారు. ఈ మిషన్‌లో భాగంగా చంద్రుడి చెంతకు వెళ్లిన తొలి మహిళ క్రిస్టినా కోచ్.. "చంద్రుడిని అంత దగ్గర్నుంచీ చూస్తుం టే నాకు ఒక్కసారిగా గాఢమైన భావోద్వేగం కలిగింది." అని పేర్కొన్నారు. దీపపు సెమ్మెలోని రంధ్రాల నుంచి వచ్చే కాంతి లా.. చందమామపై కనిపించిన ప్రకాశవంతమైన బిలాలను చూసి ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు. కాగా.. సోమవారం అర్ధరాత్రి దాటాక చంద్రుడి ఆవలివైపునకు చేరుకున్న ఈ వ్యోమనౌక మళ్లీ భూమి దిశగా ప్రయాణిస్తోంది. గంటకు 40 వేల కిలోమీటర్లకు పైగా వేగంతో భూవాతావరణంలోకి ప్రవేశిం చి అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 8.07 గంటలకు.. శాన్‌డియాగో తీరానికి సమీపాన సముద్రంలో దిగనుంది.







# విజయం ముంగిట ఢిల్లీ బోల్తా

• ఒక్క పరుగుతో గుజరాత్ టైటాన్స్ ఉత్కంఠ విజయం

ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్ జట్టు ఒక్క పరుగుతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు 211 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్ సాయి సుదర్శన్(12) మినహా టాపార్డర్ బ్యాటర్లు అందరూ చెలరేగి ఆడారు. వరుసగా హాఫ్ సెంచరీలతో అదర గొట్టారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(70; 45 బంతుల్లో 5 సిక్స్‌లు, 4 ఫోర్లు), జోస్ బట్లర్(52; 27 బంతుల్లో 5 సిక్స్‌లు, 3 ఫోర్లు), వాషింగ్టన్ సుందర్(55; 32 బంతుల్లో 2 సిక్స్‌లు, 6 ఫోర్లు)తో



బీభత్సం సృష్టించారు. గ్లెన్ ఫిలిప్స్(14), రాహుల్ తెవాటియా(1) నాటౌట్‌గా నిలిచారు. జీటీ బ్యాటర్ల విధ్వంసానికి ఢిల్లీ బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు. ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ముకేశ్ కుమార్ తన ఓవర్ కోటాలో ఏకంగా 55 పరుగులు సమర్పించుకుని 2 వికెట్లు తీశాడు. ఎంగిడి 1, కుల్దీప్ యాదవ్ 1 వికెట్ పడగొట్టారు.

**చివరి వరకూ పోరాడి..**

లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ చివరివరకు పోరాడింది. జట్టులో కేఎల్ రాహుల్ 91, నిశాంక 41, డేవిడ్ మిల్లర్ 41 పరుగులు చేశారు. చివరి బంతికి రెండు పరుగులు అవసరం కాగా చేతులెత్తేశారు. దాంతో ఓటమి చవిచూసింది. 8 వికెట్లు కోల్పోయి 209 పరుగులు మాత్రమే చేసింది. నిరాశ పరిచింది.

## ధోని లేకుండా విజయం కష్టం

**- సీఎస్‌కేపై మాజీ ప్లేయర్ సంచలన వ్యాఖ్యలు**

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఇంకా గెలుపు ఖాతా తెరవలేదు. ఐదుసార్లు ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడిన ఈ జట్టు.. గతేడాది నుంచి పేలవ ప్రదర్శన కనబరుస్తూ వస్తోంది. ఐపీఎల్ 2025లో పాయింట్ల పట్టికలో సీఎస్కే ఆఖరి స్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. అదే తీరును కొనసాగిస్తూ ఈ సీజన్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒక్క విజయాన్ని కూడా సాధించలేక అట్టడుగు స్థానంలోనే ఉంది. సీజన్ ప్రారంభానికి ముందు సీఎస్కే స్టార్ ప్లేయర్ ఎంఎస్ ధోని గాయం కారణంగా మైదానంలోకి దిగకపోవడం ఆ జట్టుకు ఇబ్బందిగా మారింది. ఈ నేపథ్యంలో సీఎస్కే కోచ్



ఫ్లెమింగ్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ సదాగోపన్ రమేశ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. 2009లో ఫ్లెమింగ్ సీఎస్కే కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. ఆయన నేతృత్వంలోనే చెన్నై ఐదుసార్లు టైటిల్ దక్కించుకుంది. అయితే ఆ ట్రోఫీలన్నీ ధోని నాయకత్వంలోనే రావడం గమనార్హం. 2024లో సీఎస్కే కెప్టెన్సీని రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి జట్టు ప్రదర్శన దారుణంగా పడిపోయిందని విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రమేశ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి. 'ధోని లేకుండా ఫ్లెమింగ్ ఎక్కడా విజయాన్ని సాధించలేదు. ఆయన విజయాలు పూర్తిగా ధోనిపైనే ఆధారపడి ఉన్నట్టు నాకు అనిపిస్తోంది. ప్రస్తుతం క్రికెట్ చాలా వేగంగా మారుతోంది. ఆటగాళ్ల ఫిట్‌నెస్‌ను ఎలా విశ్లేషిస్తామో.. కోచ్‌ల పనితీరును కూడా అలాగే పరిశీలించాలి. కానీ ఫ్లెమింగ్ మాత్రం ఆధునిక ఆట తీరుకు తగ్గట్టు మారలేకపోతున్నారు. ఆయన ఇంకా ఐదు అడుగులు వెనుకబడి ఉన్నట్లు కనిపిస్తున్నారు' అని రమేశ్ విశ్లేషించాడు. సీఎస్కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఫామ్‌పైన కూడా సదాగోపన్ రమేష్ ఆందోళన వ్యక్తం చేశాడు. కెప్టెన్‌గా రాణించాలంటే గైక్వాడ్ ముందుగా బ్యాటింగ్‌లో రన్స్ చేయాలి. మ్యాచ్‌లు గెలిపిస్తే నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నాడు.

## ఆ కుర్రాడిని జట్టులోకి తీసుకోండి

**- మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్**





యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పరుగుల వరద పారిస్తున్నాడు. ఐపీఎల్ 2026లోనూ అతడి విధ్వంసం కొనసాగుతోంది. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లో 5 సిక్సర్లు, ఒక ఫోర్ సాయంతో ఏకంగా 39 పరుగులు చేశాడు. ఎంఐ దిగ్గజ బౌలర్ బుమ్రా వేసిన తొలి బంతికే సిక్సర్ బాది అందరినీ ఆశ్చర్య పర్చాడు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్.. వైభవ్ సూర్యవంశీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అతడిని వెంటనే టీమిండియాలోకి తీసుకోవాలని బీసీసీఐకి సూచించాడు. 'వైభవ్ సూర్యవంశీ ఓ యువ సంచలనం. 15 ఏళ్ల వయసులో వైట్ బాల్ క్రికెట్‌లో ఇలాంటి ప్రదర్శన మరెక్కడా చూడలేం. 'నేను గతేడాది బుమ్రా బౌలింగ్‌లో ఔటయ్యాను. ఇప్పుడు అతడి బౌలింగ్‌లో ఎక్కువ స్కోర్ చేసేందుకు ఎదురుచూస్తున్నాను' అని గతంలో సూర్యవంశీ చెప్పాడు. ఇప్పుడు నిజంగానే చెప్పిందే చేసి చూపించాడు. వైట్ బాల్ క్రికెట్‌లో బుమ్రాను ఎదుర్కోవడం చాలా కష్టం. కానీ వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ఆ గోల్‌ను కూడా రీచ్ అయ్యాడు. కాబట్టి ఈ కుర్రాడిని జాతీయ జట్టుకు ఎంపిక చేయడానికి ఎదురుచూడాల్సిన అవసరం లేదు. వెంటనే అతడిని టీమిండియాలోకి తీసుకోవడం ఉత్తమం. ఇలా అయితే వైభవ్ 20 ఏళ్ల పాటు ఈ వృత్తిలో కొనసాగగలడు' అని వెల్లడించాడు.

## హాఫ్ సెంచరీ మిస్: ఏడ్చిన వైభవ్

వైభవ్ సూర్యవంశీ.. ఈ 15 ఏళ్ల చిచ్చర పిడుగు క్రికెట్‌లో సంచనాలు సృష్టిస్తున్నాడు. రాజస్థాన్ రాయల్స్-ముంబై ఇండియన్స్ మధ్య మంగళ వారం మ్యాచ్ జరిగింది. వర్షం కారణంగా 11 ఓవర్లకు ఈ మ్యాచ్‌ను కుదించారు. వైభవ్ సూర్యవంశీ 14 బంతుల్లోనే 39 పరుగులు చేశాడు. దూకుడుగా ఆడుతున్న వైభవ్ సూర్యవంశీని శార్దూల్ ఠాకూర్ పెవిలియన్‌కు పంపాడు. ఓ భారీ షాట్‌కు ప్రయత్నించి లాంగాన్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అప్పటికి చేయాల్సిన విధ్వంసం అంతా చేసేసిన వైభవ్.. చిరునవ్వుకు బదులు కన్నీళ్లతో మైదానాన్ని వీడాడు. హాఫ్ సెంచరీ మిస్ అయిందన్న బాధతో డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లేటప్పుడు వెక్కి వెక్కి ఏడ్చాడు. ఈ చిచ్చర పిడుగు టీమిండియాలోకి త్వరగా తీసుకోవాలని అభిమానులు కోరుతున్నారు.



## అభిమానుల మనసు గెలిచిన ముంబై కెప్టెన్ పాండ్య



ఆటల్లో గెలుపోటములు సహజం. అయితే క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించినప్పుడే ఆటగాళ్లు నిజమైన విజేతలుగా నిలుస్తుంటారు. అలానే చాలా సందర్భాల్లో కొందరు క్రీడాకారులు తమదైన చర్యలతో అభిమానుల మనసు గెలుస్తుంటారు. తాజాగా ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య చేసిన పనికి అందరూ ఫిదా అయ్యారు. 'ఇది కదా క్రీడా స్ఫూర్తి' అంటూ అతడిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఐపీఎల్-2026లో రాజస్థాన్ రాయల్స్ చిచ్చం పిడుగు వైభవ్ సూర్యవంశీ అదరగొడుతున్నాడు. ఇప్పటికే చెన్నై, గుజరాత్ జట్లలపై మెరుపు ఇన్నింగ్స్ ఆడిన వైభవ్.. తాజాగా ముంబై ఇండియన్స్‌తో మంగళవారం నాటి మ్యాచ్‌లోనూ విధ్వంసకర బ్యాటింగ్‌తో అలరించాడు. కేవలం 14 బంతుల్లోనే 39 పరుగులు సాధించాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్.. ముంబై స్టార్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో రెండు సిక్సర్లు బాదడం హైలైట్‌గా నిలిచింది. ఈ మ్యాచ్‌లో ముంబైపై 27 పరుగుల తేడాతో రాజస్థాన్ గెలిచి హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. రాజస్థాన్ చేతిలో ముంబై పరాజయం పాలైనప్పటికీ.. 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ ప్రదర్శించిన అసాధారణ బ్యాటింగ్‌కు ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా ఫిదా అయ్యాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం వైభవ్ సూర్యవంశీని దగ్గరకు పిలిచి ప్రత్యేకంగా అభినందించాడు. అతడి భుజం తడుతూ.. గుండెపై చేయి వేసి.. 'ఈ గుండె గట్టిదిరా బుడ్డోడా' అన్నట్లుగా రియాక్షన్ ఇచ్చాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హార్దిక్ పాండ్య మాట్లాడుతూ వైభవ్ సూర్యవంశీని ఆకాశానికెత్తాడు. ఈ 15 ఏళ్ల కుర్రాడు ఆడిన ఆట తీరు చాలా ఆశ్చర్యంగా ఉంది. రాజస్థాన్‌తో మ్యాచ్ కోసం సిద్ధమవుతున్నప్పుడే వైభవ్ గురించి మా జట్టులో చర్చించుకున్నామని తెలిపాడు.